
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 14-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 72 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50


కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణను బీఆర్ఎస్ తుప్పు పట్టించింది
దాన్ని వదిలిస్తున్నాం

గవర్నర్ ప్రసంగానికి కాదు...సభలో చర్చకు రావాలని కేసీఆర్‌కు పిలుపు
ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాల ట్రాప్‌లో పడను
మెట్రో, మూసీ, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులకు అనుమతి మాత్రమే కోరుతున్నాం
వీటికి రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధం
ఈ విషయమై ఎప్పుడైనా మంత్రి కిషన్‌రెడ్డి ప్రధానిని కోరారా..?
దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కుట్రను తిప్పికొడతాం
ఈ అంశంపై చర్చకు రావాలని ముఖ్యమంత్రికి తమిళనాడు సీఎం ఆహ్వానం : ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 5లో



బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్



బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు...
స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల ఫలితం

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యులు, మంత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను శాసనసభావ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించగా స్పీకర్ ఆమోదించారు. సస్పెన్షన్ ప్రకటన చేయగానే సభలోనే ఉన్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో ఆయన సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ప్రారంభంలోనే ఆయన దూకుడుగా ప్రభుత్వాన్ని ధాటిగా, వ్యంగ్యంగా విమర్శిస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. 'సభను ఆర్డర్‌లో పెడితేనే మాట్లాడతా'...అంటూ జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీనికి ప్రతిగా జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈ సభ నీ సొంతం కాదు. మా అందరి తరపున కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే" అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా తప్పుపడుతూ దళితుడు స్పీకర్ స్థానంలో కూర్చుంటే ఓర్వలేకే జగదీశ్‌రెడ్డి ఇలాంటి ఏకవచన సంబోధంతో జుగుప్సాకర వ్యాఖ్యలు చేస్తున్నారనీ, ఆయన్ని సభ నుంచి సస్పెండ్ చేయాలని కేకలు వేశారు. దీనితో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఉదయం 11.35 నిముషాలకు సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభ తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. సభాధ్యక్ష స్థానాన్ని ఏకవాక్యంతో సంబోధిస్తూ, స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు. దళితుడైన స్పీకర్‌కు జరిగిన అవమానంగా దాన్ని పరిగణిస్తున్నామని చెప్పారు. అనంతరం మరో కాంగ్రెస్ సభ్యులు రామచంద్రనాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్‌ను జగదీశ్‌రెడ్డి అహంకారపూరిత భాషతో, అభ్యంతరకర బాడీలాంగ్వేజ్‌తో దూషించడం సరికాదన్నారు. గతంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్నారనీ, డిప్యూటీ సీఎంగా ఉన్న దళిత రాజయ్యను అవమానిస్తూ ఆ పదవి నుంచి బర్తరఫ్ చేశారని గుర్తుచేశారు. సభలో ...3లో

ఈ సభ నీ సొంతం కాదు
మా అందరి తరపున కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే
స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు
క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సభ్యుల నిరసన
సభ నుంచి సస్పెండ్ చేయాలని పలువురి పట్టు
కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల వాగ్వివాదాలతో అట్టుడికిన శాసనసభ
6లో..

గొంతునొక్కే యత్నం
కమీషన్లు, ఢిల్లీ మూటల విషయాలు చర్చకొస్తాయనే
అబద్ధాల ఆధారంగా జగదీశ్‌రెడ్డిపై చర్య
తప్పేంటో చెప్పకుండా వేటేశారు
అధికారపక్షానికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
నేడు అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం : అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసనలో కేటీఆర్
13లో..

విరామ వ్యూహం
జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై కాంగ్రెస్ తర్జనభర్జన
సీఎంతో సంప్రదింపులు జరిపిన మంత్రి శ్రీధర్‌బాబు
కేసీఆర్‌కు ఫోన్ చేసిన గులాబీ నేతలు
జగదీశ్‌రెడ్డి ఒక మెట్టు దిగాలన్న కేసీఆర్
క్షమాపణ చెబుతామంటూ స్పీకర్‌కు రాయబారం
అయినా తప్పని వేటు.. డిఫెన్స్‌లో బీఆర్ఎస్ఎల్పీ
5లో..

విద్యా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి

బడులున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న చోట బడుల్లేవు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
6లో..

స్టార్‌లింక్ ఒప్పందాన్ని ఆపండి
టెలికం సర్వీసులు దేశ రక్షణకు చాలా కీలకం
చట్టాలను ఉల్లంఘించి ప్రయివేటు సంస్థలకు ఎలా ఇస్తారు ? : సీపీఐ(ఎం)





న్యూఢిల్లీ : బహిరంగ, పారదర్శక వేలం ద్వారా కాకుండా ఒక విదేశీ సంస్థకు, దానితో జత కట్టిన ఇతర ప్రయివేటు సంస్థలకు స్పెక్ట్రమ్‌ను ఏకపక్షంగా కట్టబెట్టడం మన దేశ చట్టాలకు తీవ్ర విరుద్ధమని సీపీఐ(ఎం) పేర్కొంది. తక్షణమే స్టార్ లింక్ ఒప్పందాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది. దేశంలో అధిక వేగంతో ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్ సేవలు ఇచ్చేందుకు జియో, ఎయిర్‌టెల్‌లు ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పొత్తు కుదుర్చుకున్నట్టు ఇటీవల వచ్చిన వార్తలతో స్పెక్ట్రమ్ కేటాయింపు లు, జాతీయ భద్రతా ఆందోళనలకు సంబంధించి తీవ్ర ప్రశ్నలు తలెత్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. స్పెక్ట్రమ్ అనేది అత్యంత కొరతగా వున్న వనరు అయినందున పారదర్శ క, బహిరంగ వేలం ద్వారా మాత్రమే ప్రయివేటు వ్యక్తులకు కేటాయించవచ్చని 2జీ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అలాకాకుండా ...13లో



ట్రంప్ మెహర్బానీ కోసమే..
స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, జియోల భాగస్వామ్యం
ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లను అనుమతిస్తారా..?
ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏంటీ ? : జైరాం రమేశ్
13లో.



ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం
కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఒక్కరు
అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి
వివరాలు 13లో

ఎండుతున్న పంటలు
చివరి ఆయకట్టు వరకూ సాగునీరందక ఇబ్బందులు


జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు

చెరువులు, కుంటలు ఖాళీ.. అడుగంటిన భూగర్భ జలాలు
ఎండిన పంటలకు రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్
జనగామ కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా
పలు జిల్లాల్లో ఎండిన వరి పంటలను సీపీఐ(ఎం), తెలంగాణ రైతుసంఘం బృందాల పరిశీలన

నవతెలంగాణ-జనగామ/విలేకరులు

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందక పలు జిల్లాల్లో వరి పంటలు ఎండిపోయాయి. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటడంతో పొట్టదశకు వచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం పర్యటించారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎండిన వరి పనులను ప్రదర్శిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ఆయన మాట్లాడుతూ.. సాగు నీటిపై ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్ల రాష్ట్రంలో, జిల్లాలో వరి, ఇతర పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పంటలు ఎండుతున్నా స్థానిక అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు స్పందించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లాలో 40శాతం పంటలు ఎండిపోయాయని, రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నాట్లు వేయగా పంటలు ఎండిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారని తెలిపారు. రైతులు పంటలను రక్షించుకోవడానికి ...13లో



ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్
కొత్త లోగోను విడుదల చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్
బడ్జెట్ లోగోను మార్చేసిన తమిళనాడు
రూపాయి గుర్తుకు బదులుగా తమిళ అక్షరాలు

చెన్నై : తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడుతున్న తమిళనాడు ప్రభుత్వం తాజాగా బడ్జెట్ లోగోనే మార్చేసింది. ఆ లోగోలో దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్' (అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కార్యాలయం గురువారం మధ్యాహ్నం ...13లో


యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి
యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్
యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల ఆందోళన
భూములమ్మితే చరిత్ర కనుమరుగవుతుంది
పురాతన ఆనవాళ్లను పరిరక్షించాలి
వివరాలు 5లో

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపేయాలి

ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ
5లో..

ఆర్ఎస్ఎస్ కోసమే జమిలీ
• హిందూత్వ సంస్థకు ఈ ఏడాదితో వందేండ్లు • సంఘ్ సుదీర్ఘ వాంఛను నెరవేర్చేందుకు మోడీ యత్నం

కేంద్రంలోని మోడీ సర్కారు వన్ నేషన్-వన్ ఎలక్షన్(ఓఎన్ఓఈ)పై తీవ్రంగానే శ్రమిస్తోంది. దీనిని ఎలాగైనా తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే అటువైపుగా చర్యలు ప్రారంభించింది. ఇందుకు కావాల్సిన గ్రౌండ్‌వర్క్‌ను సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగానే భారత మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లను వేసింది. ఈ కమిటీలు చర్చలూ జరిపాయి. నివేదికలనూ అందించాయి. అయితే, బీజేపీ తాపత్రయమంతా దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ కోరికను తీర్చటం కోసమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

న్యూఢిల్లీ : వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనేది సదరు హిందూత్వ సంస్థ వాంఛ అనీ, దానిని ఏ విధంగానైనా నెరవేర్చాలని మోడీ భావిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన, దక్షిణాది మెడపై కత్తిని పెట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ, ఈ-ఓటింగ్ ప్రతిపాదన పునరుద్ధరణ, నకిలీ ఓట్ల స్కాం గురించి తీవ్ర చర్చ నడుస్తున్నది. మోడీ సర్కారు జమిలీ ఎన్నికలపై ప్రధానంగా దృష్టిని సారించింది. ఏకకాల ఎన్నికలనేది బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ చిరకాల వాంఛ. దానికి అనుగుణంగానే మోడీ సర్కారు పని చేస్తున్నది. అంతేకాదు, ఈ ఏడాదిలో ఆరెఎస్ఎస్‌కు వందేండ్లు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్‌ను తీసుకొచ్చి ఆర్ఎస్ఎస్‌కు బహుమతిగా ఇవ్వాలని మోడీ ప్రభుత్వం యోచిస్తున్నది. ధీరేంద్ర కె.ఝా కొత్త పుస్తకం " గోల్వాల్కర్ : ది మిత్ బిహైండ్ ది మ్యాన్, ది మ్యాన్ బిహైండ్ ది మెషిన్" ఇదే విషయాన్ని తెలియజేస్తున్నది. " శాసనసభ నుంచి వారి దైనందిన జీవితాల వరకు, ముస్లింల పౌర హక్కులను నిరాకరిస్తామనే గోల్వాల్కర్ వాగ్దానం నెరవేర్చే ప్రయత్నం సాగడం రాజకీయంగా, ముస్లిములను కనుమరుగు చేసేస్తున్నారు. గోల్వాల్కర్ ఆలోచనలకు, భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చటం అనే ఆయన ఆర్ఎస్ఎస్ కోసం నిర్దేశించిన చారిత్రక విధికి అనుగుణంగా ఉండటం వల్లే ఇదంతా సంఘ్ పరివార్‌లో విస్తృత ఆమోదం పొందింది" అని వివరించారు. జమిలీ ఎన్నికలు ఆర్ఎస్ఎస్ రెండో చీఫ్ భావనలకు దగ్గరగా ఉంటుందని పేర్కొన్నారు. ఏకీకృత ప్రభుత్వ విధానానికి ఆయన బలమైన మద్దతుదారు అని వివరించారు. జమిలీ ఎన్నికలపై 2023, సెప్టెంబర్ 2న భారత మాజీ



రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పడింది. గతేడాది మార్చి 14న 18 వేల పేజీలతో కూడిన తన తుది నివేదికను ప్రస్తుత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాంనాథ్ కోవింద్ సమర్పించారు. అయితే, మోడీ సర్కారు జమిలీ ఎన్నికల ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకతే వచ్చింది. కాంగ్రెస్, సీపీఐ(ఎం)తో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఇది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతాన్ని ...13లో

ఉచితాలతో నిరుపయోగం

ఉద్యోగాల వల్లనే పేదరిక సమస్యకు పరిష్కారం : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నారాయణ మూర్తి
6లో..

రేపటినుంచి ఒంటిపూట బడులు
ఉత్తర్వులు విడుదల
టెన్త్ విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులు
13లో..


మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను
ఈయూకు ట్రంప్ హెచ్చరిక
వివరాలు 13లో


కులగణన చారిత్రాత్మకం

ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ చరిత్రలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన చారిత్రాత్మకమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. గురువారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేండ్లలో అన్ని విధాలుగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని 15 నెలల్లో ప్రజాపాలన దిశగా అడుగులు వేయించినట్టు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నిమ్స్ వరకు నిధులివ్వక నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నమూనాగా ఏవో కొన్ని చేశారే తప్ప రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారి కోసం కార్యక్రమాలు తీసుకుంటున్నదని తెలిపారు. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ ఒరవడి తెలంగాణలోనూ రావాలని ఆకాంక్షించారు. ఎన్నికల వరకే పార్టీలనీ, అయిపోయాక వెనకబడిపోతున్న తెలంగాణ కోసం నిధులు తెచ్చుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలి

టీయూఎంహెచ్ఇయూ టీవీవీపీ విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) టీవీవీపీ విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 010 పద్దు కింద వేతనాలను అందజేయాలని కోరారు. దీనికి సంబంధించిన బిల్లును ఈ బడ్జెట్ సమావేశంలోనే ఆమోదం తెలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ఆర్థిక ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించి ఉదారతను చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీవీవీపీలో రెగ్యులర్ ఉద్యోగులకు 13 రోజులు గడిచినా జీతాలు రాలేదనీ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, శానిటేషన్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం

22న చెన్నైలో అఖిలపక్షానికి బీఆర్ఎస్ హాజరు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనాభా ఆధారంగా కేంద్ర ప్రభుత్వం జరపాలనుకుంటున్న డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. భారత ప్రభుత్వ సూచన మేరకు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో మార్చి 22న చెన్నైలో నిర్వహించబోతున్న సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించేందుకు హైదరాబాద్ వచ్చిన డీఎంకే నేతలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ, నీటి సరఫరా మంత్రి కె.ఎన్. నెహ్రూ, రాజ్యసభ ఎంపీ ఎన్.ఆర్.ఎలాంగో బృందంతో గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "డీ లిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భం ఇది. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సమష్టిగా పోరాడితే తప్పకుండా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుంది. 1970-80 దశకంలో ఫ్యామిలీ ప్లానింగ్ బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్తగా వచ్చిన సెన్సెస్ ప్రకారం నిర్ణయిస్తామనడం అన్యాయం. ఫలితంగా పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఈ విషయంలో స్టాలిన్ ఏర్పాటు చేస్తున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరపున హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారు. కేసీఆర్ ఆదేశం ప్రకారం మార్చి 22 న జరిగే సమావేశానికి హాజరై బీఆర్ఎస్ , తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తాం..." అని తెలిపారు.

డీఎంకే నాయకులు మాట్లాడుతూ "డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మొదటి నుంచి ప్రశ్నిస్తున్నారు. అందుకే మార్చి 22న దక్షిణాదిలోని అన్ని పార్టీలతో చెన్నైలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఆ సమావేశంలో అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి కార్యచరణను ప్రకటిస్తాం. ఈ సమావేశానికి హాజరు అవుతామని బీఆర్ఎస్ చెప్పింది. అందుకు ధన్యవాదాలు.... " అని తెలిపారు.

సీఎంలతో సీక్రెట్ మీటింగ్‌లా?

అట్లాగైతే అధికారంలోకి ఎలా వస్తాం!

పార్టీలోని పాత సామాను అంత బయటకు పోవాలి

కేంద్ర నాయకత్వం దీనిపై ఆలోచన చేయాలి : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ హిందూ సేఫ్ ఉండాలంటే తెలంగాణలో బీజేపీ గవర్నమెంట్ రావాలి. బీజేపీ గవర్నమెంట్ రావాలంటే పాతసామాను బీజేపీ నుంచి బయటకు వెళ్లిపోవాలి. తెలంగాణలో ఏ గవర్నమెంట్ వస్తే ఆ ముఖ్యమంత్రులతోని సీక్రెట్ మీటింగ్‌లు పెట్టుకుంటున్నారు. అట్లాంటి మీటింగ్‌లు పెట్టుకుంటే బీజేపీ గవర్నమెంట్ ఎలా అధికారంలోకి వస్తుంది? దీనిపై కేంద్ర నాయకత్వం ఆలోచించాలి' అంటూ రాజాసింగ్ హాట్‌కామెంట్లు ఇప్పుడు బీజేపీ పార్టీలో చర్చనీయాంశం అవుతున్నాయి. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇది నా పార్టీ. నా అయ్య పార్టీ అనేవారు తెలంగాణ బీజేపీలో చాలా మంది ఉన్నారు. వాళ్లని రిటైర్ చేస్తేనే బీజేపీకి మంచి రోజులు వస్తాయి.ఇది నేను కాదు ప్రతి ఒక్క సీనియర్ నాయకుడు, బీజేపీ కార్యకర్తలు కోరుకుంటున్నారు' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో కొంతమంది బీజేపీ పార్టీ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రహస్యంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సమావేశం అవుతున్నారనీ, ఇది బీజేపీకి మంచిది కాదని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్న ఎమ్మెల్యేల వివరాలు తనకు తెలుసుననీ, త్వరలోనే బీజేపీ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. దీంతో పార్టీలో పేరుకుపోయిన పాతసామాను అని ఏ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు? అధికార పార్టీ ముఖ్యులతో భేటీ అయిన ఎమ్మెల్యేలెవరు? సీఎంలతో లాలూచీ పడుతున్న నేతలెవరు? అనే దానిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఆ పార్టీలోనూ అంతర్గతంగా చర్చ నడుస్తున్నది.

కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవం

- పల్లా వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ఎన్నిక కావటం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి తెలిపారు. సత్యం ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఉజ్జిని యాదగిరి రావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ రెడ్డి, మల్లెపల్లి యాదిరెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, ఉస్తేల సృజన, సీపీఐ సూర్యాపేట కార్యదర్శి బేజవాడ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు, కార్మికులు ఎక్కువగా ఉన్నారనీ, వారి సమస్యల పరిష్కారం కోసం సత్యం కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీపీఐ నేతలు సత్యాన్ని ఘనంగా సన్మానించారు.

'ఉపాధి' నిధుల విడుదలలో జాప్యం

కేంద్రాన్ని తప్పుపట్టిన పార్లమెంటరీ కమిటీ | **వేతనాలు సవరించండి** | **దేశమంతటా ఒకే రేటు ఉండేలా చూడండి**

- పని దినాలు పెంచండి
- ఆధార్ ఆధారిత చెల్లింపులను ఐచ్ఛికం చేయండి

ప్రభుత్వానికి సూచన

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రామీణ వేతనాలపై ద్రవ్యోల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా వేతన రేట్లను సవరించాలని కేంద్రానికి సూచించింది. దేశ వ్యాప్తంగా ఒకే రకమైన వేతన రేటును వర్తింపజేయాలని సిఫార్సు చేసింది. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 100 నుండి 150కి పెంచాలని, ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ఐచ్ఛికం చేయాలని, పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వాల్సిన నిధులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కూడా సూచించింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ (2024-25)పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం తన నివేదికలను లోక్‌సభకు సమర్పించింది.

వేతన రేట్లపై...

వేతన రేట్లను సవరించకపోవడంపై చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నామని కమిటీ తన నివేదికలో గుర్తు చేసింది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలులో ఉన్న వేతన రేట్లలో వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపింది. వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీతో ముడిపడిన ఉపాధి పథకం వేత నాలు ద్రవ్యోల్బణ ధోరణులను ప్రతిబింబించడం లేదని చెప్పింది. ఈ సూచీ ద్రవ్యో ల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా లేదని అభిప్రాయపడింది. కాబట్టి క్షేత్ర స్థాయిలో వాస్తవ ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాధాన్యతా ప్రాతిపదికన వేతన లెక్కలను సమీక్షించి తాజా పర చాలని సూచించింది. ఈ పథకానికి కేంద్రం నిధులు అందిస్తున్నందున అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకే విధమైన వేతన రేటు ఉండేలా గ్రామీణాభివృద్ధి శాఖ పరిశీలన జరపాలని కోరింది.

ఇతర అంశాలపై...

పథకం అమలులో అవకతవకలు జరుగుతున్నాయన్న కారణంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2021 నుండి పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలను నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను అందజేయాలని కేంద్రానికి కమిటీ సూచించింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని తప్పనిసరి చేయవద్దని కూడా కమిటీ సిఫార్సు చేసింది. ఆధార్ వివరాలు, జాబ్‌కార్డు రికార్డుల్లో తేడాలు ఉన్నాయన్న సాకుతో కార్మికులను తొలగిస్తున్నారని తెలిపింది. దీనివల్ల అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతోందని చెప్పింది. కమిటీ తన నివేదికలో పని దినాల పెంపునూ ప్రస్తావించింది.

వాటా చెల్లింపుపై...

ఉపాధి పథకానికి కేంద్రం తన వంతు వాటాను సకాలంలో చెల్లించకపోవడంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపింది. గ్రామీణాభివృద్ధి శాఖ అందించిన సమాచారం ప్రకారం ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వేతనాల చెల్లింపు, సామగ్రి కొనుగోలు కింద కేంద్రం తన వంతు వాటాగా రూ.23,446.27 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇది 27.26 శాతం. కేటాయించిన నిధుల్లో నాలుగో వంతు మొత్తాన్ని గత సంవత్సరపు బకాయిల చెల్లింపులకే ఉపయోగిస్తున్నారు. అంటే ప్రస్తుత సంవత్సరపు వాస్తవ బడ్జెట్‌ను రూ.62,553.73 కోట్లకు కుదించారు. దీనివల్ల పథకం లక్ష్యాలు నెరవేరే పరిస్థితి లేదు. కాబట్టి కేంద్రం తన వంతు వాటా మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాల్సిన అవసరం ఉంది. చెల్లింపుల్లో జాప్యం జరగకుండా రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలి' అని కమిటీ సూచించింది.





ఆర్‌టీఐ చట్టానికి సవరణలు ఉపసంహరించుకోండి

కేంద్రాన్ని కోరిన మాజీ ప్రభుత్వోద్యోగులు

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఉపసంహరించుకోవాలని మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2023వ సంవత్సరపు డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టంలోని సెక్షన్ 44 (3) ద్వారా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8(1)(జే)ని సవరించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వోద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడాన్ని ఇది అనుమతించదు. దీనిపై తమ వ్యతిరేకత వ్యక్తం చేస్తూ మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖలు రాశారు. ఈ సవరణ సమాచార హక్కు చట్టం చేతులు కట్టేస్తుందని వారు అందులో ఆందోళన వ్యక్తం చేశారు. అసలు 'వ్యక్తిగత సమాచారం' అంటే ఏమిటో అందులో నిర్వచించలేదని తెలియజేశారు.

సమాచార హక్కు చట్టం ఏ పారదర్శకత, జవాబుదారీతనం కోసం రూపొందించబడిందో వాటికి ప్రతిపాదిత మార్పులు తూట్లు పొడుస్తున్నాయని విమర్శకులు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ద్వారా సమాచార హక్కు చట్టం రూపుదిద్దుకున్నదని, అది భావ ప్రకటనా స్వేచ్ఛకు గ్యారంటీ ఇస్తోందని వారు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లల్లో కుంగుబాటు

- 17.1 శాతం మందికి వయస్సుకు తగిన బరువు లేదు
- కేంద్ర ప్రభుత్వ పోషణ్ ట్రాకర్ ప్రకారం నివేదిక

న్యూఢిల్లీ : దేశంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారుల్లో 37.7 శాతం మంది కుంగుబాటుకు గురవుతున్నారు. 17.1 శాతం మందికి వయసుకు తగిన బరువు లేదు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ్ ట్రాకర్' ప్రకారం ఫిబ్రవరి నాటికి అంగన్‌వాడీల్లో 8.8 కోట్ల మంది పిల్లలు (0-6 సంవత్సరాల మధ్య వయ స్కులు) ఉన్నారు. వీరిలో 8.5 కోట్ల మంది బరువు, ఎత్తును పరీక్షించి వారిలో ఎదుగుదల ఎలా ఉన్నదో పరిశీలిం చారు. బాలబాలికల్లో పోషకాహార లోపాన్ని ఎలా నివారి స్తారంటూ రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖిల పూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారాన్ని అందించారు. దేశవ్యాప్తంగా పిల్లల్లో పోషకలోపాల సూచికలు మెరుగు పడుతు న్నాయని ఆమె తెలిపారు. 2021 నాటికి దేశంలో ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు 13.7 కోట్లు ఉన్నారని, 0-6 సంవత్సరాల గ్రూపులో 16.1 కోట్ల మంది ఉన్నారని వివరించారు.

సమస్యలు పరిష్కరించండి

శాసనమండలిలో పలువురు సభ్యుల ప్రత్యేక ప్రస్తావనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూపాలపల్లి నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని బీఆర్ఎస్ శాసనమండలి నేత మధుసూదనా చారి మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం శాసన మండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అధికారులు ప్రత్యేకంగా పర్య వేక్షిస్తే నష్టనివారణ కొంత వరకు జరుగుతుందని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పెరిగిన విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసు కెళ్లాలనీ, మెయిన్ అంగన్ వాడీ లుగా మారిన వాటిలో పని చేస్తున్న వారికి పెరిగిన జీతాలి వ్వాలని కోరారు. అదే విధంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజే యాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ మాట్లాడుతూ మంత్రివర్గంలో ఒక ముస్లీంను తీసుకోవాలని కోరారు. రెసిడెన్షియల్ స్కూళ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే ఉచితాలను నిలిపివేయాలని సలహా ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారసత్వ కట్టడాల వద్ద ప్రజలను ఆకర్షించే లైట్స్ అండ్ సౌండ్స్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ బహుళ అంతస్థుల భవనాల్లో ఉన్న లిఫ్టుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాద్నాలు జరగకుండా ఏదైనా చట్టం ఉంటే పటిష్ఠంగా అమలు చేయాలనీ, లేకపోతే కొత్త చట్టాన్ని తీసుకురావాలని సూచించారు.



సభ రికార్డులు పరిశీలించండి..

ఎమ్మెల్యే కోవా లక్ష్మి

శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏం మాట్లాడారో కాంగ్రెస్ నాయకులు సభ రికార్డులు పరిశీలించొచ్చని ఎమ్మెల్యే కోవా లక్ష్మి తెలిపారు. సభలో కాంగ్రెస్ నాయకుల తీరు సరిగ్గా లేదన్నారు. సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అడగడం సమంజసం కాదని, జగదీశ్‌రెడ్డి వ్యక్తిగతంగా స్పీకర్‌ను ఎక్కడా దూషించలేదని, కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై దళిత స్పీకర్‌ను అవమానపరిచారనే మాట ముందుకు వేసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో పత్రిక స్వేచ్ఛ లేకుండా పోయిందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ ముఖ్యమంత్రి మాట్లాడని భాష, తిట్లు ఈ ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని అన్నారు.

స్పీకర్‌ను అవమానపర్చారని నిందలు వేయడం సరికాదు

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

శాసనసభ మనందరిది.. ఈ సభలో ఉన్న సభ్యులందరికీ సమాన హక్కులు ఉండాలి.. ఇది కాంగ్రెస్ సభ కాదంటూ తమ సభ్యులు మాట్లాడారు.. అంతేకానీ స్పీకర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నిందలు వేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, వివేకానంద, సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. స్పీకర్ అంశంపై రాద్ధాంతం చేస్తూ.. దాదాపు నాలుగు గంటలపాటు సభ నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని సభలో తమ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రస్తావించారన్నారు. దీనిపై తమ నాయకుడు కేసీఆర్‌కు వివరించగా.. తాము తప్పు మాట్లాడకున్నా స్పీకర్ హోదాకు గౌరవం ఇచ్చి.. వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేసి సభను సజావుగా నడిపేలా చూడాలని తమకు సూచన చేశారని తెలిపారు. తప్పు చేయకున్నా.. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి సభ నడిచేలా చూడాలని కేసీఆర్ తమకు చెప్పారని అన్నారు. సీఎం ఢిల్లీలో ఉన్నారు.. సభ నడిపిస్తారా లేదా అని స్పీకర్‌ను కోరామని, సభలో జరిగిన దానిపై రికార్డులు పరిశీలించాలని, ఒకవేళ తప్పుంటే జగదీశ్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తారని చెప్పామన్నారు. తమ సభ్యులు ప్రజల పక్షాన సమస్యలపై మాట్లాడకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా చేయడానికే ఈ విధంగా వ్యవహరిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, విద్యార్థులు, మహిళాలు, కాంట్రాక్టర్ల సమస్యలు అనేకం ఉన్నాయని, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం సెక్రటేరియట్ వద్ద ధర్నా చేసే పరిస్థితి నెలకొందన్నారు. ఇవన్నీ అడుగుతామని అసెంబ్లీలో తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నా రన్నారు. దీన్ని బీఆర్ఎస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్షాన్ని పిలిచి రికార్డులను పరిశీలించాలని కోరారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కినా, ప్రజాక్షేత్రంలో తమ గొంతు నొక్కలేరని.. ప్రజల పక్షాన వారి సమస్యలపై సర్కారును ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

దళిత సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల శామ్యూల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో దళితమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కూడా బీఆర్ఎస్ అవమానించిందని అన్నారు. అనంతరం మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి దురహంకారంతో జుగుప్సాకరంగా, ఏహ్యాభావంతో మాట్లాడారని అన్నారు. కొన్ని వర్గాలు, కొన్ని కుటుంబాలకే గౌరవం అంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ను అకారణంగా వారి పదవీకాలం ముగిసేవరకు శాసనసభ నుంచి సస్పెండ్ చేసిన అంశాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులకు ఆపార్టీ అధినేత కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశంలో ఇవే నేర్పించారా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సభాపతిని ఆ హోదాలో చూడలేక, ఇంకోరకంగా చూస్తున్నారని విమర్శించారు. కఠిన నిర్ణయం తీసుకోవాలనీ, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల్ని ఎథిక్స్ కమిటీ పరిశీలన చేసి ఆయన పదవీకాలం ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ గౌరవాన్ని కాపాడటం సభ్యులుగా అందరి బాధ్యత అనీ, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. స్పీకర్ దీన్ని ఆమోదిస్తూ జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. అనంతరం గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చారు. ఆ సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు.



అటు హాట్‌హాట్..ఇటు సీతక్క గిఫ్ట్

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చీరలు

తన సిబ్బంది ద్వారా బీఆర్ఎస్ ఎల్పీలో అందజేసిన మంత్రి

తమకు గిఫ్టులేవంటూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సరదా కామెంట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓవైపు జగదీశ్‌రెడ్డి ఉదంతంతో అసెంబ్లీ అంతా హాట్‌హాట్‌గా ఉంటే...మరోవైపు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) మాత్రం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లకు గిఫ్టులు ఇచ్చి సర్‌ప్రైజ్ చేసింది. మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని వారికి చీరలను పంపించింది. తన సిబ్బంది ద్వారా బీఆర్ఎస్ ఎల్పీలో ఉన్న మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అందజే యించింది. ఇదేంటి ఇప్పుడు అని ఆరా తీయగా..ఆరోజు కలవలేదు కాబట్టి మేడం ఇప్పుడు పంపారు అంటూ సీతక్క కార్యాలయ సిబ్బంది చెప్పారు. అదే సమయంలో వారికే గిఫ్టులు ఇస్తారా? మాకు ఇవ్వరా? అంటూ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సరదాగా అనడంతో అక్కడ నవ్వులు పూశాయి.

ప్రశ్నించడమే రాజద్రోహం అనే ధోరణి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజ ద్రోహమనే ధోరణి నడుస్తున్నదని, ప్రజలు అంతా గమనిస్తున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ప్రశ్నించినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఇది బాధాకరమన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, మల్లారెడ్డి, కెపి.వివేకనందగౌడ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గతంలో రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్ విజయారెడ్డి, సరితపై దాడి చేశారని, రాష్ట్రంలో అసలు ఏం పాలన సాగుతుందో తెలియడం లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి వద్దే హెూంశాఖ ఉందని, ఆయన కనుసైగల్లో జర్నలిస్టులపై దాడి జరుగుతోందని, ముఖ్యమంత్రి ఇంకా స్పందించడం లేదని విమర్శించారు. వేదికలపై మాత్రం మహిళల గురించి గొప్పలు చెబుతున్నారని, రాష్ట్రంలో మహిళా జర్నలిస్టుల అరెస్టును కపిల్ సిబల్ ఖండించారని చెప్పారు. ఇందిరమ్మ పాలన, సోనియమ్మ దీవెన అంటూ మహిళా జర్నలిస్టుల అరెస్టు, మీడియా ప్రతినిధుల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారన్నారు. ఏదో రకంగా సభలో తమను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, మాట్లాడే అవకాశమూ ఇవ్వడం లేదన్నారు.

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ఏం చేసింది?

టి.జీవన్ రెడ్డి

- 50 ఏండ్లు మీరేం చేశారో? : శేరి సుభాష్ రెడ్డి
- శాసనమండలిలో పరస్పర ఆరోపణలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. గురువారం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో నీటి కష్టాలకు కేసీఆర్ సొంత తెలివితో వేసిన రీ డిజైన్ కారణమని ఆరోపించారు. పదేండ్లలో గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకునేందుకు సరైన నిర్ణయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రతిపక్షమంటే కేవలం విమర్శలు చేయడమే కాదనీ, సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పుకు ఏడాదికి దాదాపు రూ. లక్ష కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నదని విమర్శించారు. మిషన్ భగీరథ ఏమైందంటూ ప్రశ్నించారు. పెళ్లికి కళ్యాణలక్ష్మి ఇచ్చి పిల్లలు పుట్టాక రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కొన్ని ఆస్పత్రులు ఇప్పటికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రోగులకు చికిత్స అందించేందుకు నిరాకరిస్తున్నాయనీ, అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరించాలని డిమాండ్ చేశారు. జేబీఎస్ నుంచి ఉత్తర తెలంగాణ వెళ్లే ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, భూ బదలాయింపు కింద రక్షణ శాఖ పరిధిలోని భూములను కేటాయించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి సహకరించాలన్నారు. పదేండ్లు హంగూ ఆర్భాటం, ప్రచారంతో బీఆర్ఎస్ సర్కారు ఒక శాంపిల్ సర్కార్‌ను నడిపిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు, పంటల మార్పిడికి ప్రోత్సాహం, 56 వేల ఉద్యోగాల కల్పన తదితర కార్యక్రమాలతో ప్రజాపాలన దిశగా అడుగులు పడ్డాయని కొనియాడారు. 56 శాతం మంది బీసీలున్నారని కులగణన చేసి అధికారికంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రజల సొమ్ముతో సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆ రిపోర్టును ఇంట్లో పెట్టుకుంటారా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ సభ్యులు శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. 50 ఏండ్లకుపైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం సమైక్య పాలకులు తెలంగాణను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. దీనిపై మంత్రి కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దిష్ట కాలం, ఎవరి పాలనలో అంటూ మాట్లాడాలని సూచించారు.

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వచ్చాక రైతుల పట్ల పాలన బాగుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.లక్ష కోట్లైతే అవినీతి కూడా రూ. లక్ష కోట్లు జరిగిందని ఎలా ఆరోపణలు చేస్తారంటూ శేరి సుభాష్ రెడ్డి ఎదురు ప్రశ్నించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణపై వివక్షకు ప్రొఫెసర్ కోదండరాం సాక్ష్యమని తెలిపారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలేవి? అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆ అబద్ధాలనే గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశారు.



సంపాదకీయం

ట్రంప్‌నకు ప్రతిఘటన!



సుంకాల పోరు మొదలైంది. అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై బుధవారం నుంచి సుంకం పెంచారు. అంతకు ముందు సోమవారం నుంచే చైనా సుంకాలు అమల్లోకి వచ్చాయి. మహాభారతంలో అర్జునుడు రెండు చేతులతో ఒకే సామర్థ్యంతో బాణాలను సంధించిన కారణంగా సవ్యసాచి అనే పేరు వచ్చింది. అదే మాదిరి అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులు అని లేకుండా ఎడాపెడా సుంకాలు విధిస్తున్నాడు. దీనికి ప్రతిఘటన పెరుగుతున్నట్లు పరిణామాలు సూచిస్తున్నాయి. వెనక్కు తగ్గకపోతే బాధితురాలైన ప్రతిదేశం ఒక రోజు అటూ ఇటూగా తన అస్త్రాలను సంధించకమానదు. మొండి వైఖరిని వీడకుండా ముందుకే మునుముందుకే అంటే మాంద్యంలో మునిగేది అమెరికా అని అనేక మంది ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాచపీనుగ ఒంటరిగా పోదనట్లు మాంద్యం యావత్ ప్రపంచాన్ని ఏదో విధంగా ఆవరిస్తుంది. గోల్డ్‌మన్ శాచస్ 20శాతం అంటే జెపి మోర్గాన్ 40శాతం అమెరికా మాంద్య అవకాశాలున్నాయని ప్రకటించింది.

తొలుత చైనా, కెనడా, మెక్సికోల మీద పోరు శంఖం పూరించిన ట్రంప్ తర్వాత బ్రిక్స్ దేశాలు, ఐరోపా యూనియన్, ప్రత్యేకించి మనదేశాన్ని కూడా ఆ జాబితాలో కలిపాడు. అంతటితో ఊరుకోలేదు, సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని బహిరంగంగా ప్రకటించాడు.మన విశ్వగురువు మౌనవ్రతం పాటిస్తూ అలాంటిదేమీ లేదని పార్లమెంటరీ కమిటీ ముందు ఒక అధికారితో చెప్పించారు. అదే సమయంలో ఎలన్‌మస్క్ స్టార్‌లింక్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ప్రకటించాయి. ఇంతవరకు అసలు స్టార్‌లింక్‌కు మనదేశం అనుమతి ఇవ్వకుండానే ఈ ప్రకటనలు వెలువడ్డాయంటే తెరవెనుక ఏదో జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉనికిలో లేని కంపెనీ సేవలు అవి ఎలా అందిస్తాయి ? అమెరికా దిగుమతులపై కెనడా, ఐరోపా యూనియన్ కూడా 25శాతం వంతున ప్రతి సుంకాలు ప్రకటించాయి. మనదేశం మౌనంగా ఉంది. వాణిజ్యాలకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి పలుకుబడితో వేర్వేరుగా దేశాలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.వాణిజ్య పోరులో ఒక దేశం ఎక్కువా తక్కువా అన్నది పక్కన పెడితే ప్రతిదేశం నిబంధనలకు పాతరవేస్తున్నట్లే.

ప్రపంచీకరణ యుగంలో ప్రతిదేశం మరొకదాని మీద ఏదో విధంగా ఆధారపడి ఉన్నందున కర్ర ఉన్నవాడిదే గొర్రె అంటే కుదిరే రోజులు కావివి. మా వస్తువుల మీద పన్నులు వేస్తే మీ కొన్ని రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్ నిలిపివేత లేదా పన్నులు వేస్తామని కెనడాలో ఓంటారియో అనే ఒక రాష్ట్ర ప్రధాన మంత్రి కూడా ప్రపంచ అగ్రరాజ్య అధిపతి ట్రంప్‌ను హెచ్చరించాడంటే ఆ ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. బలవంతుడైన సర్పము చలి చీమలచేత చచ్చినట్లుగా పరిస్థితి ఉందన్నది స్పష్టం. ఒక హానికారక వైరస్ పుట్టుక ఎక్కడైనా ఎటు గాలివీస్తే అటు విస్తరిస్తుంది, తన మన అనే విచక్షణ లేకుండా ఎవ్వరినీ వదలదు.వాణిజ్య పోరు కూడా అలాంటిదే. ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న జనరిక్స్ విలువ ఏటా 12.7 బిలియన్ డాలర్లు కాగా దాని వలన అమెరికాకు 219 బిలియన్ డాలర్ల మేర ఆరోగ్య ఖర్చు తగ్గిందని అంచనా.

మన దేశం అమెరికా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న 36 ప్రాణాధార ఔషధాలపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసినప్పటికీ ట్రంప్ సంతృప్తి చెందినట్లు కనిపించటం లేదు. మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికా వెళ్లి సంప్రదింపులు జరిపిన తర్వాతే ట్రంప్ మనమీద సుంకాల యుద్ధ ప్రకటన చేశాడు.అందరూ నష్టపోతారంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చేసిన హెచ్చరికను వాణిజ్యపోరుకు నాందిపలికిన ట్రంప్ తలకెక్కించుకుంటాడా! తగ్గేదేలే అంటూ ముందుకు పోతాడా!! సుంకాల పోరులో అంతిమంగా పరాజితులు వినియోగ దారులే. ఏ దేశం ఎంత పన్ను పెంచితే ఆ మేరకు భారం భరించాల్సిందే. వస్తువుల కొనుగోలు తగ్గించుకుంటే అది ఒక విషవలయంలా మారుతుంది.చివరకు కష్టజీవులనే బలి తీసుకుంటుందన్నది చరిత్ర చెప్పిన సత్యం.

> ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.

గుజరాత్‌లో క్షీణిస్తున్న ప్రభుత్వ విద్య



గుజరాత్ పాఠశాలలకు సంబంధించి బీజేపీ ప్రభుత్వం ఇటీవల కాలంలో స్వయంగా అసెంబ్లీలో సమర్పించిన గణాంకాలు చాలా ఆందోళనాకరంగా ఉన్నాయి. ఆ గణాంకాల ప్రకారం 1,606 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని తెలుస్తోంది. అంటే ఒకటి నుండి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారు. బోధనతో పాటు, పాఠశాల నిర్వహణ బాధ్యత కూడా ఆ ఉపాధ్యాయుడే చూడాలి. అక్కడ 2022లో ఏకోపాధ్యాయ పాఠశాలలు 700. ఇవి ఏడాదిలోనే రెట్టింపు కంటే ఎక్కువయ్యాయి. గుజరాత్‌లో ప్రభుత్వ విద్య క్షీణతను అర్థం చేసుకోవడానికి ఈ గణాంకాలు చాలు.

విద్యారంగాన్ని అత్యంత వేగంగా పూర్తిగా ప్రయివేటీకరిస్తున్న రాష్ట్రం గుజరాత్. వరుస బీజేపీ ప్రభుత్వాలు గవర్నమెంట్ పాఠశాలలను నాశనం చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతున్నాయి. లక్షలాది మంది పేదలకు నిలయమైన భారత్‌లాంటి దేశంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం. మన దేశంలో పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో ఒకటి-అందరికీ అత్యంత నాణ్యత, అనువైన సౌకర్యాలు కలిగిన విద్యావకాశాలను అందించడం. కానీ పైన చెప్పుకున్న అసమానతలు అత్యంత తీవ్రంగా పెరుగుతున్న గుజరాత్‌లో పాఠశాల విద్య ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గుజరాత్‌లోని పాఠశాలల్లో 19 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారిక రికార్డులు తెలియచేస్తున్నాయి. దేశంలోకెల్లా అతి తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతున్న రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. అందువల్ల, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి దారుణంగా ఉంది. గుజరాత్ ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో 5,223 స్కూళ్లను మూసివేస్తున్నట్లు 2000 సంవత్సరంలో ప్రకటించింది. వారు దాన్ని వేగంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వవిద్య నుండి గుజరాత్ ప్రభుత్వం పూర్తిగా వైదొలుగుతున్నదని ఈ సంకేతాలన్నీ తెలియచేస్తున్నాయి.

దేశవ్యాప్తంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేసే 'అసర్ నివేదిక 2024' ప్రకారం, గ్రామీణ గుజరాత్‌లోని ప్రతి ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకదానికి నీటి కొరత ఉంది. పావువంతు బడుల్లో మరుగుదొడ్లు లేవు. సగానికి పైగా పాఠశాలలకు విద్యుత్ లేదా కంప్యూటర్ సౌకర్యాలు లేవు. చాలా స్కూళ్లు సింగిల్ రూమ్ లేదా సురక్షితం కాని భవనాల్లో నడుస్తున్నాయి. ఇక విద్య నాణ్యత విషయానికి వస్తే ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మూడోతరగతి చదువుతున్న పిల్లల్లో డెబ్బై నాలుగు శాతం మందికి రాయడం రాదనే దిగ్భ్రాంతికరమైన గణాంకాలను కూడా ఆ నివేదిక తెలియచేస్తున్నది. ఐదవ తరగతికి చేరుకున్న విద్యార్థుల్లో 54 శాతం మంది, ఎనిమిదవ తరగతిలో 24 శాతం మంది విద్యార్థులకు రాయడం రాదు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉండటం వల్ల, గుజరాత్‌లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు సంస్థలకు పంపవలసి వస్తోంది.గుజరాత్‌లో పదవ తరగతి కూడా పూర్తి చేయకుండానే పాఠశాలలను వదిలి వెళ్తున్న పిల్లల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. 2014లో దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు మొదటి తరగతిలో చేరారు. కానీ వారిలో 10 లక్షల 50 వేల మంది మాత్రమే పదవ తరగతికి చేరుకున్నారు. బీజేపీ ప్రభుత్వం గుజరాత్‌ను 6.5 లక్షలకు పైగా పిల్లలు తమ పాఠశాల విద్యను కూడా పూర్తి చేయలేని రాష్ట్రంగా మార్చింది. మొదటి తరగతిలో చేరిన ముగ్గురు పిల్లల్లో ఒకరు మాత్రమే కనీసం ప్లస్ టూ వరకు చదువుతున్నారు. గుజరాత్‌లో బడి మానేసిన పిల్లల రేటు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ.

కానీ ఈ దయనీయమైన ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం కోల్పోయి తమ పిల్లలను ప్రయివేటు విద్యా సంస్థల్లో చేర్పించేవారు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారో చూద్దాం. ఇటీవల గుజరాత్‌లోని సూరత్‌లో ప్రయివేటు విద్యాసంస్థలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని ఫీజు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో తమ కుమార్తెకు సగటు నాణ్యమైన విద్య కూడా లభించదని, తల్లిదండ్రులు ఆమెను ప్రయివేటు పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది. రోజువారీ కార్మికులుగా, వారు తమ కుమార్తె ఫీజును సకాలంలో చెల్లించడానికి అవసరమైన డబ్బును ఏర్పాటు చేసుకోలేకపోయారు. కొద్ది నెలల క్రితం మరో విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడనే వార్తలు కూడా వెలువడ్డాయి. భారతదేశంలో అత్యల్ప వేతనాలు ఉన్న రాష్ట్రాలలో గుజరాత్ మొదటి స్థానంలో ఉందని కూడా గుర్తుంచుకోవాలి. 2022లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, కేరళలో ఒక భవన నిర్మాణ కార్మికుడు రోజుకు రూ.837 వేతనం సంపాదిస్తాడు. అయితే గుజరాత్‌లో ఇది కేవలం రూ.296 మాత్రమే. వ్యవసాయ, వ్యవసాయేతర ఉపాధి విషయంలో కూడా ఇదే పరిస్థితి. అంత తక్కువ ఆదాయం కలిగిన తల్లిదండ్రులకు, తమ పిల్లల స్కూల్ ఫీజులు భరించలేనంత ఎక్కువగా ఉన్నాయి. గుజరాత్‌లోని కాయకష్టం చేసుకుని బతికేవారు తమ పిల్లలను ప్రాథమిక సౌకర్యాలు లేని, అక్షరాలు కూడా నేర్పించలేని పాఠశాలలకు పంపడమా లేదా ఫీజులు చెల్లించలేని కారణంగా వారి పిల్లల చదువును ముగించడమా అనే రెండింటిలో ఒకదాన్ని ఎంచుకోవలసి వస్తున్నది. గుజరాత్‌లో అమలు చేస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విద్యా వ్యవస్థను జాతీయ విద్యా విధానం (ఎన్.ఇ.పి) ద్వారా దేశమంతటా వ్యాప్తి చేయడమే మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్


విప్లవ తాత్వికుడు, విముక్తి మార్గ దార్శనికుడు


తెలకపల్లి రవి

వర్ధంతి అంటే మరణానంతరం కూడా వర్ధిల్లే వారసత్వాన్ని సంస్మరించుకోవడం. ఆ మాట పూర్తిగా వర్తించే వ్యక్తి మార్క్స్. పందొమ్మిదో శతాబ్ది ప్రథమపాదంలో పుట్టిన ఆ మహామనీషి సిద్ధాంతాలు ఇరవయ్యవ శతాబ్దాన్ని అనన్య సామాన్యంగా మలచి, ఆ శతాబ్ది చివరలో చిందరవందరలు అధిగమించి 21వ శతాబ్దంలో పునరుజ్జీవం పొందడానికి కారణమైనాయి. అంతకుముందు నడిచింది పాలక వర్గాధిపత్య చరిత్ర. ఆయన భావ ధారతో మొదలైంది పాలకవర్గ ధిక్కార చరిత్ర. మార్క్స్ తత్వాలకూ, సూక్తులకూ పరిమితమైన తాత్వికుల స్థానాన్ని చరిత్ర నిర్మాతల సరసన చేర్చిన అఖండ మేధావి. ప్రపంచాన్ని పరిపరి విధాల నిర్వచించడం కాదు, మార్చాలంటూ విప్లవ శంఖం పూరించిన సాహస సైద్ధాంతికుడు. వాల్టేర్, రూసో, హెగెల్, లెస్సింగ్, హైనే వంటి మహా తాత్వి కులందరూ ఒక్కటిగా రూపుదాలిస్తే మార్క్స్ అవుతాడని మోజెస్ హెస్ ప్రశంస చేసేనాటికి ఆయన వయస్సు కేవలం 23. ఆయన మరణించి ఇప్పటికి 140 ఏండ్లు గడిచిపోయినా మార్క్స్‌నూ మార్క్సిజాన్ని తలుచుకోకుండా ఒక్కరోజు కూడా గడవదు. అంతెందుకు? ఇప్పుడు అమెరికాలో ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చి వికృత విధ్వంస విధానాలు అమలు చేస్తుంటే విశ్లేషకులు మార్క్స్ 18 బ్రూమియర్ ఆఫ్ లూయీ బోనపార్టీని తలుచుకుంటున్నారు. చరిత్ర ఒకసారి విషాదాంతంగా మరోసారి పరిహాసప్రాయంగా పునరావృతమవుతుందన్న ఆయన వ్యాఖ్యలను అమెరికా అధినేతకు అన్వయిస్తున్నారు.

చరిత్ర తర్కం

దేశ దేశాల్లో ప్రాచీనకాలపు వేదాంతులు మనుషుల గురించి చాలా తత్వాలు పాడారు. మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతిచోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని ఫ్రెంచి తత్వవేత్త రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాం తాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏకకాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమదోపిడీ, విలువ, వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడేవారిపై, జాలి పేదలపై సానుభూతి చాలామంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటివరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తేల్చిచెప్పేశాడు. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప' అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్ర కాంక్ష కూడా చూడగలిగాడు. భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ఏ విదేశీ మేధావి కన్నా ముందు సమగ్రంగా చర్చించిన వ్యక్తి ఆయనే! సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవ స్థల పరిణామ క్రమాన్ని జమిలిగా చూడాలని గ్రహించాడు గనకనే తర్కాన్ని, చరిత్రనూ మేళవించగలిగాడు. అది అతితర్కం కాదు, అనునిత్యం అధ్యయనంతో ప్రతి పరిణామాన్ని పరిశీలిస్తూ పరిపూర్ణం చేసుకోవాల్సిన గతితర్కం. ఆయన చెప్పిన చరిత్రక్రమం రాజవంశాల అనుక్రమణిక కాదు, మానవాళి మజిలీలను మథనం చేసిన మహా ధ్యయనం. ప్రకృతిలో లాగే మానవ సమాజంలోనూ మార్పులొస్తాయని అందుకు శ్రమజీవులు చోదకశక్తులుగా వుం టారని చెప్పిన సారాంశం మార్క్సిజం. అయితే శ్రమదోపిడీ పాఠాలు వల్లె వేస్తేనో లేక బానిస సమాజం, భూస్వా మ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం, సోషలిజం అని ఒక పరంపరను జపిస్తేనో మార్క్సిజమై పోదు. మార్పు రానూ రాదు. ఆ మూల సూత్రాల ప్రాతిపదికన ఆయా దశల్లో శ్రమ దోపిడీ రూపాలు గాని పీడక వర్గ వ్యూహాలు గాని అర్థం చేసుకుని రాజకీయ బలంతో సంఘటిత శక్తితో ఎదిరించాలి. ఒక్కముక్కలో దీన్నే నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్య యనం అన్నారు. ఆచరణలో దాన్ని ఆచరణలో పెట్టి అనుకున్న విజయాలు సాధించడం, వచ్చిన విజయాలు నిలబెట్టు కోవడం నిరంతర సంఘర్షణ.



మన కాలపు దీపధారి

అంతులేని దారిద్ర్యాన్ని, అష్టకష్టాలనూ భరిస్తూనే మేధావిగా రచనలు చేయడమే గాక విప్లవకారుడుగా నిరంతరం పోరాడాడు గనకే మార్క్స్ చరిత్ర గమనంలో ప్రజల పాత్రను పసిగట్టగలిగారు. ఆయన 1883లో మరణిస్తే 1917లో అంటే తను పుట్టిన వందేళ్లకు ఆ విప్లవ సిద్ధాంతం లెనిన్ జయప్రదంగా అమలు చేశాడు. వర్గాలనే కూలగొట్టే ఇంత సమూలమైన మార్పు ఇంత త్వరితంగా వచ్చిన దాఖలా చరిత్రలో మరొకటి లేదు. అది మార్క్స్ బోధనల లెనిన్ వ్యూహాల ఔన్నత్యం. సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు, తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారు తున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమదోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పువుండదు.'మార్క్స్ ప్రతీకారం: ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక టైమ్ 2013లో ముఖపత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాల్లో అన్నిచోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది. పచ్చి మితవాద భావజాల ప్రతీఘాత దాడి, జాతీయ దురభిమానం, భావ ప్రకటనా స్వేచ్ఛపై అణచివేత ఇవన్నీ మార్క్స్ బోధనలను మరింత ముందుకు తెస్తున్నాయి. దేశ దేశాల్లో కమ్యూనిస్టులు, కార్మిక నాయకులు, ప్రజాస్వామికవాదులు, మానవతా మూర్తులు పోరాడుతున్నారు. ఉద్య మాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజాస్వామిక శక్తులు వీటిపై పోరాడుతూనే ప్రభుత్వాలు నిర్వహిస్తున్నారు. సైద్ధాంతిక ఘర్షణలు సాగిస్తున్నారు. కొత్త గుణపాఠాలు నేర్చుకుంటున్నారు. ఇందులో తప్పొప్పులు వుంటాయి. చిన్న పెద్ద విజ యాలూ వుంటాయి. ఎదురు దెబ్బలుంటాయి. కాని మహత్తర త్యాగాలూ వున్నాయి. చెక్కుచెదరని నిబద్ధతలు వున్నాయి. ఈసంక్లిష్ట క్రమాన్ని అవగాహన చేసుకోకుండా శత్రుశక్తులూ మిత్రులనుకునేవాళ్లు కూడా పోరాడే శక్తులను అవహేళన చేయవచ్చు గాని వాటితోనే చరిత్ర ఆగిపోదు.

నిజానికి మార్క్సిజం సైద్ధాంతిక జైత్రయాత్ర కొనసాగుతూనే వుంది. ఈ ముప్పైల్లో పుట్టుకొచ్చిన చరిత్రాంతం, కాలానికి అంతం, దూరానికి అంతం, మహా సిద్ధాంతాల అంతం, ఆధునికత అంతం, సత్యం అంతం అంటూ అంతు పట్టని అంతం సిద్ధాంతాలే సోదిలోకి లేకుండా పోతున్నాయి. మార్క్స్ బోధనలు మార్గదర్శకంగానే వున్నాయి. సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ దుష్ఫలితాలు ప్రతివారూ అనుభవిస్తున్నారు. అరగంటకో రైతు ఆత్మహత్య. నయా కంపెనీలు నరాలు తెగిపోయేలా సరికొత్త వెట్టిచాకిరి చేయించుకోవడం కనిపిస్తున్నది. ఉద్యోగాలు రాకపోగా వున్న వాటికే భద్రత లేకుండా పోతున్న తీరు మేధావులనే కలవర పెడుతున్నది. మొదట చెప్పినట్టు ట్రంప్ మలిపాలనలో దేశ దేశాలు ఈ మథనానికి గురవుతున్నాయి. ఇప్పుడు ఎలన్ మస్క్ బుల్లి కుమారుడు అమెరికా అధ్యక్షుని పక్కన కూర్చుని మీడియాకు ఫోజులిస్తున్నాడంటే విదేశాంగ మంత్రి రిటిరే, మస్క్ ట్రంప్ ముందే కీచులాడుకుంటున్నారంటే అంతకన్నా ఉదాహరణ ఏం కావాలి? వరప్రసాదంగా గోచరించిన నూతన సాంకేతిక నిపుణులు కూడా ఎ.ఐ దెబ్బకు విలవిల్లాడక తప్పడం లేదు. వీటిపై మరింత అధ్యయనం చేయడం మార్క్స్ అనుయాయుల కర్తవ్యం. ఉదాహరణకు సిపిఎం మహాసభ ముసాయిదా నయా ఫాసిజంగా పరిస్థితిని వర్ణిస్తే వెంటనే దాడి చేసిన మిత్రులూ శత్రులూ కూడా నిర్దిష్ట అధ్యయనం అనే సూత్రాన్ని విస్మరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాలంచెల్లిన మాటలే చెబుతున్నారని ఎగతాళి చేసేవారు వందేళ్ల కిందటి పదాలను భావాన్ని నేటి సందర్భానికి తగినట్టు అర్థం చేసుకోకుండా అలాగే వాడాలనడం మార్క్స్ శైలికే విరుద్ధం. ఆవిరి యంత్రం నుంచి కృత్రిమ మేధా కాలం వరకూ ఒకే మంత్రం వల్లెవేసే వారు ఈ అంశాన్ని గ్రహించలేరు.

అదే బాటలో...

గత ముప్పయేళ్లలో ప్రతికూల పరిణామాలు ఎవరూ కాదనరు. సోవియట్, తూర్పు యూరప్ దేశాల్లో పతనం గాని, దేశంలో బెంగాల్, త్రిపుర వంటి చోట్ల ఓటమి గాని వాస్తవాలే. ఆ ప్రభుత్వాలు వున్నప్పుడు సవాళ్లు లేవని, ఇప్పుడు సర్వం పోయిందని అనుకుంటే అవాస్తవికత అవుతుంది. మార్క్స్ జీవిత కాలంలోనే తొలి కార్మికవర్గ పాలనా వ్యవస్థగా పారిస్ కమ్యూన్ అవతరించి కూలిపోయింది. అయినా సోవియట్ విప్లవం ఆగలేదు. ఇప్పుడు సోవి యట్ లేకున్నా జరిగే పరిణామాలు ఆగడం లేదు. చరిత్ర గమనశీలమైందన్నదే ఆయన ప్రధాన బోధన. వివిధ రూపాల్లో పెట్టుబడిదారీ సంక్షోభాలు, కల్లోలాలూ విరుచుకు పడుతూనే వుంటాయని మార్క్స్ ఎప్పుడో చెప్పింది అడు గడుగునా చూస్తున్నాం. ఇప్పుడు కంపు ట్రంపు దుందుడుకు వ్యూహాలను టారిఫ్ యుద్ధాలనూ మతతత్వ మోడీల కార్పొరేట్ లొంగుబాట్లనూ అర్థం చేసుకోగలం. నయా ఫాసిస్టు తరహా శక్తులు ప్రజావ్యతిరేకులు పంజా విసురుతున్నా ప్రపంచంలో ప్రగతిస్ఫూర్తి గొడ్డుపోలేదు. మార్క్స్ అంటేనే ఒక ఆగని మార్చ్. మేము అమరులను తలుచుకోవడంతో ఆగిపోక వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడం కోసం పోరడతామని ఆయన అస్తమించిన సమయంలో ఆప్త మిత్రుడైన ఎంగెల్సు అన్నమాట ఇప్పటికీ పరమ సత్యమై నడిపిస్తుంది. మార్క్స్ అంటేనే మార్చ్. అహరహం అధ్య యనంతో అవిశ్రాంత కార్యాచరణతో త్యాగనిరతితో ఆ మహాప్రస్థానం కొనసాగించాల్సి వుంటుంది.

(నేడు కారల్ మార్క్స్ 142వ వర్ధంతి)

> సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు, తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారు తున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమదోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పువుండదు.'మార్క్స్ ప్రతీకారం: ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక టైమ్ 2013లో ముఖపత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాల్లో అన్నిచోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది.

> మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతిచోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని ఫ్రెంచి తత్వవేత్త రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాం తాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏకకాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమదోపిడీ, విలువ, వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడేవారిపై, జాలి పేదలపై సానుభూతి చాలామంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటివరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తేల్చిచెప్పేశాడు. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప' అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్ర కాంక్ష కూడా చూడగలిగాడు.

గురువులకు గుదిబండగా గురుకులాలు


గుడికందుల సత్యం
9849232515

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక కేజీ టూ పీజీ పేరుతో గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలను విస్తృతపరిచింది.రాష్ట్రంలో మొత్తంగా వివిధ సామాజిక తరగతుల వారిగా ఏర్పాటు చేసిన గురుకులాలు అన్ని కలుపుకుని 1080 వరకు ఉంటాయి. ఇందులో సుమారు ఆరులక్షల మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.20,897 మంది గురువులు బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దకాలం తర్వాత కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో 7800 మంది నూతన టీచర్స్‌ని నియమించింది. ఇంకా 6,500 వరకు ఉద్యో గాలు ఖాళీగా ఉన్నవి. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో 550 నుండి 600 మంది విద్యార్థులున్నారు. ఇప్పటివరకు తొంభై శాతం పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గురుకులాలకు సొంత భవనాల్లేక, అద్దె భవనాల్లో సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు, టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలను ఒకే సమూహంగా విశాల మైన స్థలంలో 2500 మంది విద్యార్థులు చదువుకునే వీలుగా నూతన భవనాలు నిర్మిస్తామని శంకుస్థాపనలు కూడా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మెనూ కూడా ఒకే విధంగా అమలు చేస్తామని చెబుతున్నది. ఇది ఆచరణలో సాధ్యం అవుతుందా? వేచి చూడాల్సిందే.

ఇదంతా నాణేనికి ఒకవైపు, మరోవైపు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు వర్ణనాతీతం. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రీడలు, పౌష్టికాహారం అందాలంటే పాలకులకు దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. అది లేకపోవడంతో ఆ భారమంతా కూడా గురువులు యోయాల్సి వస్తున్నది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకుని, ట్రైనింగ్ పొందిన టీచర్లతో బోధనేతర (బాధ్యతలు) డిప్యూటీ వార్డెన్, పాఠశాలల్లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, తదితర బోధనేతర పనులు అప్పగించడం, రాత్రిపూట స్టడీ అవర్స్ పేరిట తొమ్మిది గంటల వరకు, (స్టే) పేరుతో పాఠశాలల్లోని నిద్రించడం, ఆదివారం,సెలవు, పండగ రోజుల్లో కూడా వారికి అదనంగా విధులు నిర్వహించాలని చెప్పడంతో వారు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. కుటుంబానికి సరైన సమయం కేటాయించకపోవం, వారి పిల్లలతో ఏకాంతంగా గడిపే అవకాశం కూడా లేకపోవడంతో 'ఇదేం కొలువురా బాబో' అని బాధపడుతున్నారు. ఇది ఒక్క గురువులకే కాదు, విద్యార్థులకు సైతం శిక్షగానే ఉంటోంది. విద్యార్థులకు చదువు చాలా ముఖ్యమైనదే కానీ దాంతో పాటు మానసిక వికాసం పెంపొందించే కార్యక్రమాలు లేకపోవడం వల్ల వారు కూడా భారంగా ఫీలవుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలల్లో ఉండాలని కఠిన నిబంధనలు పెడుతూ గురువులను, దాంతో పాటు విద్యార్థులను కూడా తీవ్ర ఒత్తిడిలోకి నెట్టివేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ డ్యూటీ ఉన్నప్పుడైతే వారి ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదేనని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. వంటవారు సరిగా పనిచేయకున్నా, పాలు పగిలినా, గ్యాస్ సిలిండర్లు అయిపోయినా, పైపులు లీకైనా, కూరగాయలు అపరిశుభ్రంగా ఉన్నా, నిత్యావసర వస్తువులు నాణ్యత లేకున్నా, టీచర్లే బాధ్యత వహించాల్సి వస్తున్నది. ఇతరులు చేసిన తప్పిదాల మూలంగా వంటలో చిన్న పొరపాటు జరిగినా, వాటర్ కలుషితంగా వచ్చినా సంబంధం లేని బోధన సిబ్బంది పైనే వేటు వేస్తూ, సస్పెండ్ కూడా చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. వార్డెన్ డ్యూటీ దినదిన గండంలా ఉంటుందని, రోజువారి స్టాకు రాయడం, తమకు సంబంధం లేని పనులతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టడీ అవర్ పేరిట రాత్రి తొమ్మిది గంటల వరకు స్కూల్లోనే డ్యూటీ చేస్తే ఇంటికి వెళ్లడానికి బస్సులు దొరక్క, రాత్రిపూట ఒంటరి ప్రయాణాలు చేయలేక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు.



మహిళా టీచర్ల పరిస్థితి మరింత దారుణం. రాత్రి తొమ్మిది గంటలకు ఒంటరి ప్రయాణాలు చేయడం, ఇంట్లో, బయట వేధింపులకు గురవుతూ, నెలసరి సమయంలో కూడా సెలవుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బోధన సిబ్బందికి బోధనేతర పనులు అప్పజెప్పడం ఏంటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కఠినమైన నిబంధనల మూలంగా కొంతమంది మానసిక ఒత్తిడికి గురై గురుకుల ఉద్యోగానికి స్వస్తి పలుకుతున్నారు. ఇతర పాఠశాలల మాదిరిగానే ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమయం మార్చాలని చాలారోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే పర్మినెంట్ వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించాలని, శిక్షణ పొంది బోధించే టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించవద్దని , కేరళ తరహాలో మహిళలకు పీరియడ్ సెలవులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయులు, సంఘాలు ఏండ్లకొద్దీ వేడుకుంటున్నప్పటికీ వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయం. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిం చాలంటే టీచర్లపై ఒత్తిడి పెంచడం కాదు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పర్మినెంట్‌గా పాఠశా లలకు, కళాశాలలకు కేటాయించాలి. భోజన సిబ్బందితో పాటు బోధనేతర సిబ్బందిని కూడా నియమించడం ద్వారా గురువులపై ఒత్తిడి తగ్గించాలి. అలా చేస్తే విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యను బోధించే అవకాశం ఉంటుంది.ఆ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గురువులు కోరుతున్నారు.

> ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలల్లో ఉండాలని కఠిన నిబంధనలు పెడుతూ గురువులను, దాంతో పాటు విద్యార్థులను కూడా తీవ్ర ఒత్తిడిలోకి నెట్టివేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ డ్యూటీ ఉన్నప్పుడైతే వారి ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదేనని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. వంటవారు సరిగా పనిచేయకున్నా, పాలు పగిలినా, గ్యాస్ సిలిండర్లు అయిపోయినా, పైపులు లీకైనా, కూరగాయలు అపరిశుభ్రంగా ఉన్నా, నిత్యావసర వస్తువులు నాణ్యత లేకున్నా, టీచర్లే బాధ్యత వహించాల్సి వస్తున్నది. ఇతరులు చేసిన తప్పిదాల మూలంగా వంటలో చిన్న పొరపాటు జరిగినా, వాటర్ కలుషితంగా వచ్చినా సంబంధం లేని బోధన సిబ్బంది పైనే వేటు వేస్తూ, సస్పెండ్ కూడా చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

తెలంగాణను బీఆర్ఎస్ తుప్పు పట్టించింది



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ తుప్పు పట్టించిందని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆ తుప్పును వదిలిస్తూ ముందుకెళుతున్నట్టు తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్‌లో కార్మికుల ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచికానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ రావడం కాదని, అసెంబ్లీలో చర్చలకు రావాలని సవాల్ విసిరారు. డీలిమిటేషన్ అనేది లిమిటేషన్ ఫర్ సౌత్ అని విమర్శించారు. గురువారం నాడిక్కడ తుగ్లక్ రోడ్ 23వ అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. పాలనకు అలవాటు పడ్డ అధికారులు, రాత్రికి రాత్రే వ్యవస్థనే సెట్ చేయాలంటే? కుదరదని, అలా చేస్తే ఒక్కసారిగా సిస్టమంతా కొలాప్స్ అవుతుందని చెప్పారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ఏ ఒక్క పాలసీని రూపొందించలేదని అన్నారు. తాను టూరిజం, రెవెన్యూ ఇలా అనేక పాలసీ రూపకల్పనలో బిజీగా ఉన్నట్టు చెప్పారు. ఇక చరిత్రలో ఎవరూ చేయలేని... ఎస్సీ వర్గీకరణ, కుల గణన, రూ. 2 లక్షల వరకు రుణమాఫీలను చేసి చూపినట్టు తెలిపారు. 2029 ఎన్నికలకు వెళ్లేప్పుడు ప్రజలే ఈ విషయాలన్నీ గమనిస్తారని అన్నారు. లీడర్ రేవంత్ చెప్తే చేస్తాడు, చెప్పినవి చేశాడు కదా అని వాళ్లే మనకు అండగా నిలుస్తారని చెప్పారు.

ఏనాడైనా మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులపై ప్రశ్నించారా...?

తెలంగాణ అభివద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. నిధులు, ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే వాళ్ల సొంత రాష్ట్రాల సమస్యలను లేవనెత్తాలి. ఆయా రాష్ట్రాలకు అండగా నిలవాలి. కానీ మన మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం రాష్ట్రానికి సంబంధించిన అంశాలేమీ పట్టించుకోరు' అని విమర్శలు గుప్పించారు.

కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారు?. మూసీ, త్రిబుల్ ఆర్, మెట్రో ఇలా ఎన్నో ప్రాజెక్టుల విషయంలో కేంద్రంతో ఆయన ఏమైనా మాట్లాడారా?. మెట్రో విషయంపై కేంద్రంతో ఆయన ఎందుకు మాట్లాడటం లేదు?.' అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి... ప్రధాని మోడీతో మాట్లాడి అనుమతులు తెప్పిస్తే, రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర అభివద్ధికి బీజేపీ అడ్డుపడుతుందని చెప్పడానికి కేంద్ర మంత్రుల తీరే నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో అప్పు ఉంది కాబట్టే ఆ అప్పుపై తాను మాట్లాడుతున్నట్టు చెప్పారు. రూ.7లక్షల అప్పు ఉన్న విషయాన్ని ప్రజలకు చెప్పకపోతే ఎలా అని ప్రశ్నించారు.

నేనేంటో హైకమాండ్‌కు తెలుసు...

తానేంటో పార్టీ హైకమాండ్‌కు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబంతో తనకు సాన్నిహిత్యం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టివేశారు. అవసరమైతే ఖర్గే, రాహుల్ గాంధీలతో మాట్లాడి... తనకు కావాల్సింది తెచ్చుకునే సామర్థ్యం ఉందన్నారు. 'ఎవరో ఏదో అనుకుంటున్నారని నేను పట్టించుకోను. గాంధీ కుటుంబంతో మీరు, అందరూ అనుకునే దానికంటే ఎక్కువే సాన్నిహిత్యం ఉంది. నేనెవరో తెలియకపోతే పీసీసీ చీఫ్ నన్ను సీఎంని ఎలా చేస్తుంది?. కలిసిన ప్రతిసారీ ఫొటోలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఫొటోలు ఉంటేనే వారితో సాన్నిహిత్యం ఉందనుకోవడం తప్పు' అని అన్నారు.

దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కుట్రను తిప్పికొడతాం

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ చేస్తోన్న కుట్రను తిప్పికొడతామని, ఇందుకు కావాల్సిన కార్యాచరణ చేపడతామని తెలంగాణ సీఎం. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది నియోజకవర్గాల పునర్విభజన కాదని, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే బీజేపీ ప్రయత్నమని విమర్శించారు. ఈ పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు.. చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈ నెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానించారు. ఈ లేఖను ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం గురువారం నాడిక్కడ రేవంత్ రెడ్డికి అందజేసింది. ఈ భేటీలో డీఎంకే ప్రత్యేక ప్రతినిధి ఎకెఎస్ విజయన్, డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, డీఎంకే ఎంపీలు ఏ.రాజా, ఎన్.ఆర్. ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూలు ఉన్నారు. అయితే 2026 తరువాత చేపట్టే జనగణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా... కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎం స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జేఏసీ) చేరేందుకు అంగీకారం తెలపాలని సీఎంను కోరారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు జేఏసీలోకి తెలంగాణ కాంగ్రెస్ తరపున ఒక ప్రతినిధిని నియమించాలని లేఖలో సూచించారు.

బీజేపీది హిడెన్ ఎజెండా...

హిందీ జాతీయ భాష ఏమీ కాదని, దేశంలో ఎక్కువ మంది మాట్లాడుతున్న భాష మాత్రమేనని సీఎం న్నారు. అటువంటి హిందీ భాషను దేశ ప్రజలపై రుద్దడంలో బీజేపీది రహస్య ఎజెండా అని వ్యాఖ్యానించారు. మూడు భాషల విధానాన్ని సీఎం రేవంత్ తప్పుబట్టారు. 'అసలు హిందీ జాతీయ భాష ఏంటి? మీరు అనుకుంటే సరిపోతుందా? హిందీ అనేది దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష. ఆ తర్వాత అత్యధికంగా తెలుగు, బెంగాల్ మాట్లాడుతారు. మీరు హిందీ మాట్లాడతారు కదా? అందరూ అదే మాట్లాడాలి అంటే ఎలా?. అందుకే హిందీ భాషను మనపై రుద్దడంలో ఏదో రహస్య ఎజెండానే ఉంది' అంటూ మండిపడ్డారు.

ఎమ్మెల్సీతో విజయశాంతికి న్యాయం..

ఎమ్మెల్సీతో విజయశాంతికి సముచిత న్యాయం చేసినట్టు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు ఆమె ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. పార్టీ గెలుపుకోసం క్యాంపెయిన్ చేశారని, నిబద్ధతతో ఎంతో కాలంగా కష్టపడి పని చేశారని గుర్తు చేశారు. అందుకే ఆమెకు ఎమ్మెల్సీ ఇచ్చినట్టు చెప్పారు. మరోవైపు మహిళా రిజర్వేషన్ల అమలులోనూ ఆమెకు ఎమ్మెల్సీ ఇవ్వడం సరైందిగా భావిస్తున్నట్టు తెలిపారు. పదవుల విషయంలో తాను ఈక్వేషన్స్ చూడనని సీఎం స్పష్టం చేశారు. 'నేను అధికారంలోకి వచ్చాక పార్టీ డీసీసీలు, అనుబంధ సంస్థలకు చెందిన 37 మందికి చైర్మెన్ పదవులు ఇచ్చాం.' అని చెప్పారు.

ఓన్ ట్యాక్స్ రెవెన్యూలో తెలంగాణ నెంబర్ వన్...

ఓన్ ట్యాక్స్ రెవెన్యూ కలెక్షన్లలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ద్రవ్యోల్బణం 1.3కి తగ్గిందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగం 8.8 శాతం నుంచి 6.1 కు తగ్గించినట్లు వివరించారు. ఈ లెక్కలు సోషల్ ఎకనామిక్ సర్వే, కేంద్ర ప్రభుత్వ గణాంకాలని తెలిపారు. సీఎంగా తెలంగాణకు భారీ పెట్టుబడులు తెచ్చానని గుర్తు చేశారు. డీలిమిటేషన్‌తో యూపీలో పార్లమెంట్ సీట్లు 80 నుంచి 120 పెరిగితే, తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే పెరుగుతాయన్నారు.

అంటే.. యూపీలో 40 సీట్లు పెరిగితే, తమిళనాడులో 21 సీట్లు మాత్రమే పెరుగుతాయని, ఇలా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. తెలంగాణలో వినూత్నంగా రైజింగ్ తెలంగాణ "భారత్ సమ్మిట్" పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామాతో పాటు సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమ్మిట్ నిర్వహించాలి అంటే కేంద్ర ప్రభుత్వం "పొలిటికల్ క్లియరెన్స్" ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. అందుకోసమే విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌తో భేటీ అవుతున్నట్టు వెల్లడించారు.

దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గిస్తే సహించం

దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాన్ని సహించబోమని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. 'మేం (దక్షిణాది రాష్ట్రాలు) దేశానికి ఎంతో సేవ చేశాం. దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. మాపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటాం' అని స్పష్టం చేశారు. బీజేపీ కుట్రలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా ఇప్పటికే నిర్ణయించిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డిలకు సూచించినట్టు వెల్లడించారు. తాము నిర్వహించే సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నామని, ఆయన సమావేశంలో పాల్గొని అక్కడ వెల్లడైన అభిప్రాయాలను కేంద్రమంత్రి వర్గం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

సల్మాన్ ఖుర్షిద్‌తో సీఎం భేటీ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే తెలంగాణ రైజింగ్ ఇంటర్నేషనల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. తుగ్లక్ రోడ్‌లోని సీఎం అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షిద్, ఏఐసీసీ శాశ్వత ఆహ్వానితులు గురుదీప్ సింగ్ సప్పల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో ఎంపీలు మల్లు, చామల, అనిల్ కుమార్ యాదవ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి నాయుడు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు పాల్గొన్నారు. సుమారు అరగంట పాటు రైజింగ్ తెలంగాణ సమ్మిట్ పై ఈ మీటింగ్‌లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరే దిశలో ఎదురయ్యే అంశాలు, సమ్మిట్ ఏర్పాటుపై మంతనాలు చేశారు.

బూర్గులకు సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తొలి సీఎం బూర్గుల రామకృష్ణారావు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లో ఆయన చిత్రపటానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సీఎంగా, రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా, సాహితీవేత్తగా, బహు భాషావేత్తగా బూర్గుల బహుముఖ ప్రజ్ఞ కనబర్చారని కొనియాడారు. ఈ ప్రోగ్రాంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా నిలవండి :విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

రాబోయే 25 ఏండ్లలో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడిక్కడ కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణతో తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జై శంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం ద్వారా అమ్మడాన్ని వెంటనే ఆపాలని యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలోని ఈ 400 ఎకరాల భూమిని టీఎస్ఐఐసీ ద్వారా మార్చి 8 నుంచి 15వ తేదీ మధ్య వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ సంస్థలకు ఈ భూములు అమ్మడం ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. దాంతో భూముల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వేలం వేయాలనుకున్న ఆయా భూముల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంతో విలువైన భూములను కలిగి ఉందని, ఆ భూముల్లో ప్రధానంగా పురాతన కాలం నాటి పెద్ద పెద్ద కొండలు చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయని తెలిపారు. యూనివర్సిటీ భూములను వేలం ద్వారా విక్రయించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు సంక్షేమ ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు ప్రధానంగా ప్రభుత్వ భూములను అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు. భూముల పరిరక్షణకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆనాటి చారిత్రాత్మక సాక్ష్యాలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక కేంద్రంగా ఉందని గుర్తు చేశారు. ప్రధానంగా రాకాసి కొండలు, పెద్దపడ్ గుట్టలు ఉన్నాయని, వాటిని ఇప్పటికీ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్లపరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భూములు అమ్మితే చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం దశలవారీగా పోరాటం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆలోచన విరమించుకుని యూనివర్సిటీ భూములను పరిరక్షించేందుకు ముందుకు రావాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో వ్యక్తి దారుణహత్య

- అనంతరం చోరీకి పాల్పడిన దుండగుడు
- రూ.40 వేల నగదు, లిక్కర్ బాటిళ్ల చోరీ
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-షాబాద్


(ఫైల్)

మద్యం దుకాణంలో చోరీకి వచ్చిన దుండగుడు పర్మిట్ రూమ్‌లో నిద్రిస్తున్న వ్యక్తిని హత్య చేసి, కొంత నగదు, లిక్కర్ బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల కేంద్రంలోని శ్రీ దుర్గా వైన్స్ షాప్ పక్కనున్న కూల్ పాయింట్‌లో పనిచేస్తున్న భిక్షపతి అలియాస్ ప్రవీణ్ (35) అక్కడే నిద్రించేవాడు. కాగా, ఎప్పటి లాగానే పని ముగించుకొని బుధవారం రాత్రి పర్మిట్ రూమ్‌లో పడుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి పక్కనే ఉన్న వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడు. వైన్స్ వెనకాల ఉన్న గోడకు రంధ్రం చేసి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.40 వేల నగదుతో పాటు, లిక్కర్ బాటిళ్లు, షాపులో ఉన్న సీసీ కెమెరా డివైజ్‌ను ఎత్తుకెళ్లాడు. దీన్ని గమనించిన భిక్షపతి దుండగుడిని అడ్డుకున్నాడు. దాంతో చేతిలో ఉన్న ఇనుపరాడుతో భిక్షపతి తలపై దుండగుడు కొట్టడంతో తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శంకర్‌రెడ్డి, సీసీఎస్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రమణారెడ్డి, డాగ్ స్క్వాడ్, క్లూ టీం బృందాలతో నిందితుని ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- 400 ఎకరాల వేలం ప్రక్రియను నిలిపేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. భూములను విక్రయించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాల భూమిని వేలం ప్రక్రియ వేయడాన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలో హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని ఈనెల ఎనిమిది నుంచి 15 వరకు వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. టీజీఐఐసీ సంస్థ ద్వారా కార్పొరేట్ సంస్థలకు ఈ భూములను విక్రయించి రూ.18 వేల కోట్లు సమీకరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేసిందనీ, విద్యార్థుల తిరుగుబాటుతో ఆ నిర్ణయాన్ని విరమించుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పేరుతో కాంగ్రెస్ పేద విద్యార్థులు చదువుతున్న వర్సిటీ భూములను లాక్కుని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే చర్యలను మానుకోవాలని కోరారు. ప్రభుత్వమే కోర్టుకు వెళ్లి భూములను విక్రయించేలాగా అనుకూల తీర్పు తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. పక్షులున్నాయనీ, వృక్ష జాతులున్నాయనీ, పర్యావరణం, సాంస్కృతిక వాతావరణం కలిగిన ఆ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తే జీవవైవిధ్య దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అభివృద్ధి కోసం భూములను కొనసాగించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెనక్కి తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రభుత్వం అని చెప్పి ప్రభుత్వ విద్యాసంస్థల భూములను ఎలా విక్రయిస్తుందని ప్రశ్నించారు.

విద్యార్థుల శ్రేయస్సు కోసం, వారి పరిశోధనలు జరుపుకోవడానికి ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ అమ్మకానికి పెట్టడం సరైంది కాదని తెలిపారు.ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్లకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలి : పీడీఎస్‌యూ విజృంభణ

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర అధ్యక్షులు రాయిసిడం బాపూరావు, ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ పేద అణగారిన వర్గాల విద్యార్థులు చదువుకునే వర్సిటీ భూములను లాక్కోవడమంటే వారిని విద్యకు దూరం చేయడమేనని విమర్శించారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపేయాలి

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల విక్రయాన్ని నిలిపేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వర్సిటీ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. హెచ్‌సీయూ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నెంబర్ 25 కింద 2,300 ఎకరాల స్థలాన్ని పరిశోధన, విద్యారంగ అభివృద్ధికి కేటాయించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని వేలం వేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న 400 ఎకరాలను స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి మార్కెట్ విలువ కంటే చాలా తక్కువకు కేటాయించిందని పేర్కొన్నారు. అయితే తగిన అభివృద్ధి చేయడంలో ఆ కంపెనీ విఫలమవ్వడంతో ఆ భూములను ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల ద్వారా తిరిగి పొందిందని వివరించారు. ప్రస్తుతం ఈ భూమిని రూ.18 వేల కోట్ల (అంచనా విలువ)కు 2025 మార్చి 8 నుంచి 15 తేదీల మధ్యన వేలం వేస్తున్నట్టు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. వర్సిటీలోని పర్యావరణ, అకడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగిన ఇటువంటి స్థలాన్ని ప్రయివేట్, కార్పొరేట్ శక్తులు స్వార్థ ప్రయోజనాలకు ధారాదత్తం చేయడమే అవుతుందని విమర్శించారు. విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రస్ఫుటం చేస్తున్నదని తెలిపారు. ఒక వైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రయివేటీకరణను, సంపదను మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం విమర్శిస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్సిటీ భూముల వేలాన్ని ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నదని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలనీ, ఈ భూములను వర్సిటీకి కేటాయించి విద్య, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

విరామ వ్యూహం

డిఫెన్స్‌లో బీఆర్ఎల్పీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను బీఆర్ఎస్ సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఏకవచనంతో సంబోధించడం శాసనసభలో పెద్ద దుమారాన్నే లేపింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో స్పీకర్ సభను 11.35 నిమిషాలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు తిరిగి సభ ప్రారంభమైంది. ఆ నాలుగు గంటల విరామ సమయంలో శాసనసభ లాబీల్లో పెద్ద తతంగమే జరిగింది. మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డితోనూ ఈ అంశంపై చర్చించారు. మంత్రి శ్రీధర్‌బాబు జరిగిన ఘటనను ఢిల్లీలోని సీఎంకు పూసగుచ్చినట్టు వివరించినట్టు తెలిసింది. మరోవైపు ఇటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎల్పీనేత కేసీఆర్‌తో మాట్లాడి సలహాలు తీసుకున్నారు. జగదీశ్‌రెడ్డిని ఒక మెట్టు దిగాలని కేసీఆర్ సూచించినప్పటికీ...ఆయన దానికి అంగీకరించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సభ వాయిదా పడ్డ తర్వాత జగదీష్‌రెడ్డిపై చర్యలు తీసుకుంటారా? లేదా? అధికార పార్టీ ఏం చేయబోతున్నది. దాన్ని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొబోతున్నది. అసలు ఆయా ఛాంబర్లో ఏం చర్చిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ వ్యూహాలకు ఎలా పదును పెడుతున్నారు అనేది శాసనసభ లాబీల్లో ఉత్కంఠగా మారింది. స్పీకర్‌పై జగదీష్‌రెడ్డి వ్యక్తిగతంగా కామెంట్ చేయడంపై అధికార పార్టీ సీరియస్‌గా తీసుకుంది. అయితే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయాలా? వద్దా? అనే విషయంలో కాంగ్రెస్ మాత్రం ప్లాన్‌గానే నడిపిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌పై గవర్నర్ ప్రసంగ కాపీలను చించివేశారనే కారణంగా వేటేసిన విషయం విదితమే. వారిని సస్పెండ్ చేసిన సమయంలో బీఆర్ఎస్ సర్కారు చెప్పిన కారణాలను కూడా హస్తం పార్టీ పరిశీలించింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ సస్పెన్షన్ కలిసొచ్చింది. దీంతోపాటు జగదీష్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యల పుటేజ్ పరిశీలించింది. పక్క ఆధారాలతో జగదీష్‌రెడ్డిపై చర్యలకు కాంగ్రెస్ పార్టీ పూనుకున్నది. సభలో సస్పెనన్లు ఉండవన్న హామీ నేపథ్యంలో పలుకోణాల్లో చర్చించామని చెబుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి హెచ్చరికలు జారీ చేస్తూనే...జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సెషన్ వరకు సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యలపై ఆ పార్టీ అంతర్మథనం చెందినట్టు తెలిసింది. బీఆర్ఎస్ కూడా ఓ మెట్టు దిగాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ విషయంపై క్లారిటీ కోసం ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఫోన్ చేసి అభిప్రాయాన్ని తీసుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. జగదీశ్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యలపై కేసీఆర్ సీరియస్ అయినట్టు తెలిసింది. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని సూచించారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ ప్రసాద్‌కుమార్ వద్దకు వెళ్లి క్షమాపణలు కోరుతామంటూ రాయబారం నడిపారు. సభలో ఏకవచన వ్యాఖ్యలు చేసి...లోపల సారీ చెప్పడమేంటనే అధికార సభ్యులు తప్పుపట్టారు. జగదీశ్‌రెడ్డి కూడా ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేశారని అధికార కాంగ్రెస్ భావించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్జన భర్జనల మధ్య సభ తిరిగి ప్రారంభమైంది. కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డిని పూర్తిగా సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఈ క్రమంలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతుందన్నారు. తమ పార్టీకి చెందిన సభ్యులు పూర్తిగా సస్పెండ్ చేయాలంటూ కోరినా ప్రభుత్వం మాత్రం ఆయన్ను ఈ సెషన్ వరకు మాత్రమే సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. దానికి స్పీకర్ ఆమోదం తెలిపారు. ఈ సెషన్ వరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ అల్వాల్ మండలం తిరుమలగిరి విలేజ్ లోతుకుంటలో ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. కంటోన్మెంట్‌లోని జనరల్ భూమి రికార్డ్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానిదిగా నమోదు కాగా, ప్రయివేటు వ్యక్తులు తమదని చెప్పడంతో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వందకు పైగా ఎకరాలున్న ఈ భూమిలో ఎలాంటి కట్టడాలకూ అనుమతులివ్వరాదని అధికారులకు కమిషనర్ సూచించారు. గండిమైసమ్మ మండలం దుండిగల్ విలేజ్‌లోని బుబ్బుఖాన్ చెరువు దిగువున వున్న లింగం చెరువు కాలువ పరిసరాలను పరిశీలించారు. బుబ్బుఖాన్ చెరువు అలుగు, తూముల నుంచి వరద నీరు వెళ్లకుండా నాలను కబ్జాచేసి నిర్మాణాలు జరిగాయని, దీంతో వరద ముంచెత్తుతోంది స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నాలా సమస్యను పరిష్కరించాలని కోర్టు ఆదేశాల నేపథ్యంలో మీరంతా కలిసికట్టుగా నిర్ణయానికి రావాలని, స్థానికులకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు కమిషనర్ సూచించారు. అనంతరం హఫీజ్‌పేట దగ్గర ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. టీడీఆర్ కింద లబ్దిపొంది ప్రభుత్వ భూమిని కబ్జా చేశారా అనే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో పలుచోట్ల పలువురు స్థానిక సమస్యలే కాకుండా వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు కబ్జాల బారి నుంచి తమ భూములు, ఇండ్లను కాపాడుతున్న వైనానికి కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

- ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ.. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రతి ఏడాదీ విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందన్నారు. గడిచిన పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యారంగాన్ని అభివృద్ధి పరుస్తాం, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన మాటను అమలు చేయడం లేదన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఆజాంజాహీ మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ



నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ నగరంలోని ఆజాంజాహీ మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై గురువారం జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తన కార్యాలయంలో పలు దళిత, ప్రజాసంఘాల, కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, జేఏసీ కన్వీనర్ కొణతం కృష్ణ, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పెరుమళ్ళ లక్ష్మణ్, ఆజాంజాహీ మిల్లు కార్మికులు, కన్వీనర్ ఆకేన వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మెన్ వడ్డేపల్లి రామచందర్ వరంగల్ నగరంలో పర్యటించినప్పుడు కార్మిక భవనం కూల్చివేతపై విచారణ జరిపించాలని తాము వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. విచారణలో భాగంగా పలువురు కార్మికులు, నాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని తహసీల్దార్‌కు వివరించారు. 75 ఏండ్లుగా కార్మికుల సమావేశాలు, సభలకు వేదికైన కార్మిక భవనాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేసి కూల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ భవనాన్ని కబ్జా చేసిన నరేష్ రెడ్డిని, కూల్చిన ఓం నమశ్శివాయలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సింగిరెడ్డి యశోద, హరి నారాయణ, గుత్తికొండ రవి, పల్లకొండ సుధాకర్, కొంపల్లి ప్రవీణ్, ఆరోగ్యం, సందీప్, విజయ్, బాబు, నర్సింగం, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల్లో పోస్టాఫీసుల ఏర్పాటు

- సీఎస్‌కు సీపీఎమ్‌జీ పీవీఎస్‌రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ భవనాల్లో పోస్టాఫీసుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. గురువారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన సీఎస్‌తో భేటీ అయ్యారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుందని వివరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు తొలి ప్రాధాన్యతగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేయూత పథకం ద్వారా 24.56 లక్షల మందికి రూ.926.36 కోట్ల పెన్షన్ల సొమ్మును గ్రామీణ పోస్టాఫీసుల ద్వారా చెల్లించామని వివరించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రైతులకు మద్దతు ధరగా రూ.516.21 కోట్లు, పనికి ఆహారం పథకం ద్వారా రూ.186.97 కోట్ల సొమ్మును లబ్దిదారులకు అందచేశామని తెలిపారు. ఇవికాకుండా పీఎమ్ కిసాన్ యోజన సహా అనేక ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో పోస్టాఫీసులు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఈ విజ్ఞప్తిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి త్వరలో ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

13 రోజులు గడుస్తున్నా.. టీవీవీపీలో 13 వేల మందికి జీతాలేవి?

- చెల్లించలేదనడం వాస్తవం కాదా? : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్చి నెలలో 13 రోజులు గడిచినా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని 13 వేల మందికి ప్రభుత్వం ఫిబ్రవరి నెల జీతాలు ఇవ్వలేదని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. అబద్ధాలకు, అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నది సీఎం కండ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఆరోగ్య శాఖలోనే కాదు, పోలీసు శాఖలోనూ ఇదే దుస్థితి ఉందని తెలిపారు. పెంచిన జీతాలు, అలవెన్సుల మాట దేవుడెరుగు. ఉన్న జీతాలు ఇప్పటికీ రాక హోంగార్డులు ఆవేదన చెందుతున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనే అబద్ధాన్ని, అవకాశం ఉన్న చోటల్లా ప్రచారం చేసుకునే సీఎంకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల ఆవేదన అర్థం కావడం లేదా? దుష్ప్రచారంతోనే ఏడాదిన్నర గడిపారు. ఇంకెంత కాలం వెళ్లదీస్తారు.? అని నిలదీశారు. టీవీవీపీ డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సహా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, హోంగార్డులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఈ సభ నీ సొంతం కాదు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఈ సభ నీ సొంతం కాదు. మా అందరి తరఫున అక్కడ కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే' అంటూ బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సభను అట్టుడికించాయి. కాంగ్రెస్ సభ్యులంతా లేచి జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. బీఆర్ఎస్ సభ్యులు కూడా లేచి అరవడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. ఆ సమయంలోనూ 'సభను ఆర్డర్‌లో పెడితేనే నేను మాట్లాడుతా. ఆ బాధ్యత మీదే' అని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించడం అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. ' స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తారా? వీవాంట్ సస్పెండ్..వీవాంట్ సస్పెండ్' అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సభ్యులు తీవ్రతను పెంచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల పరస్పర అరుపులతో సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ 11:35 నిమిషాలకు ప్రకటించారు. తర్వాత తిరిగి మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో తిరిగి సభ ప్రారంభమైంది. ఆ తర్వాత జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సెషన్ వరకు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఏం జరిగిందంటే..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై సభలో బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి లేస్తూనే తన మాటలతో ఎదురుదాడికి దిగారు. చాట్ జీపీటీ, ఏఐ టెక్నాలజీ ఆధారంగా గవర్నర్ ప్రసంగం తయారు చేసినట్టుందని దెప్పిపొడిచారు. తెలుగులో ట్రాన్స్‌లేషన్ మక్కీకి మక్కీలా ఉందనీ, కొన్ని వాక్యాలు అర్థం కాకుండా, ప్రారంభానికి, ముగింపునకు పొంతన కుదరకుండా, వాస్తవాలు లేకుండా ఉండటం ఆశ్చర్యకరంగా అనిపించిందన్నారు. గవర్నర్ ప్రసంగం మనస్సు పెట్టి కాకుండా మొక్కుబడిగా తయారు చేసినట్టు ఉందనీ, మనస్సు కవి ఆత్రేయ ఉంటే కాపీని చూసి ఆత్మహత్య చేసుకునేటోడని దెప్పిపొడిచారు. గవర్నర్‌తో 15 నెలల పాలనపై 36 నిమిషాల్లో 360 అవాస్తవాలు మాట్లాడించారని విమర్శించారు. ప్రసంగ కాపీ చూసి గవర్నర్ మనస్సు గింజుకుంటున్నట్టుందనీ, అందుకే మనస్సు పెట్టి కాకుండా మొక్కుబడిగా చదివి వెళ్లిపోయారని అన్నారు. ఊర్లల్లో తిరుగుతుంటే ఎండిపో తున్న పొలాలు కనిపిస్తున్నాయన్నారు. సభలో నీళ్ల గురించి మాట్లాడాలని రైతులు కోరుతున్నారన్నారు. అవకాశమొస్తే మాట్లాడుతానని హామీనిచ్చాననీ, గవర్నర్ ప్రసంగంపై పార్టీ తరఫున మాట్లాడే అవకాశం తనకు కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. ఈ సమయంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు కేసీఆర్ ఎక్కడ అని అరిచారు. ' ఎక్కడో దూరంలో లేరు. మీ ముఖ్యమంత్రి కంటే దూరం లేరు. దగ్గర్లోనే ఉన్నారు. రన్నింగ్ కామెంట్ ఆపేయండి. ఎక్కువ మాట్లాడకుండా మూస్కోండి.... రైతులు, గొర్రెల కాపర్ల గురించి మాట్లాడుతుంటే ఎందుకు భయపడుతున్నారు...' అని వ్యాఖ్యానించారు. ఎన్కటికి ఓ ఊర్ల ఏతుల వెంకటయ్య ఉండేవాడనీ, తన దగ్గర బర్లు లేకపోయినా ఉన్నట్టు చెబితే.. సర్పంచి ఎక్కడివని నిలదీస్తే... "పోయిన బర్రె దొరికితే..చచ్చింది లేసొస్తే...అత్తగారు ఇస్తమన్నది ఇస్తే...నేను ఒకటి కొనుక్కుంటే నాలుగు బర్లు కావా?" అన్నడంట అని కథ వివరించారు. గవర్నర్ ప్రసంగం గట్లనే ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేశారా? రైతుబంధు ఇచ్చారా? ఈజీఎస్ కార్మికులకు రూ.12 వేలిచ్చారా? ఆటో కార్మిక సోదరులకు రూ.12 వేలు ఇచ్చారా? రూ.2500 మహాలక్ష్మి అక్కజెల్లెళ్లకు ఇచ్చారా? రైతులకు బోనస్ ఇచ్చారా? తులం బంగారం ఇచ్చారా? స్కూటీలిచ్చారా? రెండు లక్షల ఉద్యోగాలిచ్చి సందుక కింద పెట్టారా? ప్రజల కు ఏం చేశారు అధ్యక్షా" అంటూ ప్రశ్నలను సంధించారు.

రూ.21 వేల కోట్ల రుణమాఫీ కండ్లకు కనిపించడం లేదా? : విప్ ఆది శ్రీనివాస్

వెంటనే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు.. ఆ స్కూళ్లో చదువుకున్న వాళ్లందరికీ అట్లనే కనిపిస్తుందని విమర్శించారు. 'రాష్ట్రంలో బ్యాంకుల్లో రూ.2 లక్షల లోపు పంటరుణాలున్న 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.21 వేల కోట్లను మాఫీ చేసింది కండ్లకు కనిపించడం లేదా? అని నిలదీశారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు జీరో విద్యుత్ బిల్లు ఇస్తున్న విషయం కనిపించడం లేదా? మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల రుణాలిస్తున్న విషయం తప్పా? రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నది వాస్తవం కాదా?' అంటూ ప్రశ్నలతో ఎదురుదాడికి దిగారు.

10 ఏండ్లలో మీరు చేయనిది..15 నెలల్లో ఒక్కొక్కటిగా చేస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పదేండ్ల కాలంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే..తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 15 నెలల్లో ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బదులిచ్చారు. 'ఉద్యమ సమయంలోనూ, 2013 ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఇచ్చిన హామీలను కేసీఆర్ అమలు చేశారా? దళితున్ని సీఎం చేయకుంటే తల నరుక్కుంటానన్నాడు.. నరుక్కుండా? దళితులకు మూడెకరాల భూమిచ్చి బోర్లు వేయిస్తనన్నడు...అది చేసిండా? తమ పార్టీకి చెందిన దళిత నేత భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఉంటే..కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో కొన్నట్టు కొని ప్రతిపక్ష హోదా లేకుండా కేసీఆర్ చేసిండు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించిండా? ఎందుకు మాట్లాడుతున్నరు' అని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోపడుతున్నదనీ, ప్రతి నెలా ఉచిత కరెంటు ద్వారా పేదలకు ఏడెనిమిది వేల రూపాయలను ఆదా చేస్తున్నామని వివరించారు. బీసీ కులగణన చేపడితే..కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు పాల్గొనలేదు? ఇప్పుడు ఈ మాటలేంది? అని ప్రశ్నించారు.

స్పీకర్ వర్సెస్ జగదీశ్ రెడ్డి

సబ్జెక్టుపై డీవీయేషన్ కాకుండా గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలని సభ్యులకు సూచిస్తూ జగదీశ్‌రెడ్డికి స్పీకర్ మైకు ఇచ్చారు. 'ప్రసంగంలో లేని ఒక్కటైనా మాట్లాడానా? సభలో ఉండమంటే ఉంటా..పొమ్మంటే పోతా. ఏందిది?' అని జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని..స్పీకర్‌ను బెదిరించడం సరిగాదనీ, జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తాము మాట్లాడుతుంటే వ్యంగ్యంగా నవ్వడం జగదీశ్ రెడ్డికి తగదన్నారు. అలా వ్యంగ్యంగా నవ్వితేనే ప్రజలు అక్కడ కూర్చో బెట్టారని చురకలు అంటిం చారు. 'జగదీశ్వర్‌రెడ్డి అసహనానికి గురికాకండి..సహనంతో మాట్లాడండి. పదేండ్లు మంత్రిగా కూడా చేశారు. సభాసాంప్రదాయాలను తప్పుదోవ పట్టించడం మంచిది కాదు' అని స్పీకర్ అభ్యర్థించారు. 'అధ్యక్షా. ఏ సభా, సాంప్రదాయాలకు విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే నేను మాట్లాడుతా...' అంటూ జగదీశ్‌రెడ్డి కూర్చున్నారు. మళ్లీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా..'సభను ఆర్డర్‌లో పెడితేనే మాట్లాడుతా..నేను ఏం విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే మాట్లాడుతా' అని మొండికేశారు. 'నా విషయంలోనే. నన్ను ప్రశ్నించడమే సభా, సాంప్రదాయాలకు విరుద్ధం' అని స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. 'అస్సలే కాదు అధ్యక్షా. ఈ సభ మనందరిది. ఈ సభలో అందరికీ హక్కులున్నాయి. మా అందరి తరఫున కూర్చోబెట్టిన పెద్దమనిషిగా మాత్రమే అక్కడ మీరు కూర్చున్నారు తప్ప ఈ సభ నీ సొంతం కూడా కాదు. సభలో అందరికీ సమానమైన హక్కులుంటాయి.' అంటూ స్పీకర్‌నుద్దేశించి వివాదాస్పద, ఏకవచనంతో వ్యాఖ్య లు చేశారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్‌కు జగదీశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. క్షమాపణలు చెప్పాల్సిన తప్పేం చేశాడంటూ బీఆర్ఎస్ సభ్యులు లేచి అరిచారు. అదే సమయంలో స్పీకర్ చైర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులందరూ ముందుకెళ్లారు. హరీశ్‌రావు మాట్లాడు తూ..సభ కాంగ్రెస్ పార్టీకో..ఒక ప్రభుత్వానికో సబంధించింది కాదు... ప్రతిపక్ష సభ్యులకు కూడా సమాన హక్కులుంటాయని మాత్రమే జగదీశ్‌రెడ్డి అన్నారనీ, దాంట్లో తప్పేముందని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. సభలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతుండటంతో సభను పావు గంట వాయిదా వేస్తున్నట్టు 11: 35 నిమిషాలకు స్పీకర్ ప్రకటించారు.

క్షమాపణలు చెప్పకుంటే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి : విప్ అడ్లూరి లక్ష్మణ్

స్పీకర్ చైర్‌లో ఉన్న దళితున్ని పట్టుకుని జగదీశ్‌రెడ్డి అహంకారంతో బెదిరించడం సరిగాదనీ, ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పట్టుబట్టారు. క్షమాపణలు చెప్పకుంటే సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్పీకర్‌పై పేపర్ విసిరాడనే నెపంతోనే దళిత ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సభ్యత్వాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్పీకర్‌ను అవమానించిన, ఎదురు ప్రశ్నించిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని ఎందుకు రద్దు చేయకూడదు అని అడిగారు. మొదటి నుంచీ దళితుల పట్ల ఆయన చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సభా సాంప్రదాయాల ప్రకారం సభను నడపాలి : తలసాని

బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..సభాసాంప్రదాయాల ప్రకారం స్పీకర్ సభను నడపాలని కోరారు. అధికార పార్టీకి చెందని ఇద్దరు సభ్యులు మాట్లాడుతుంటే తామెవ్వరమూ జోక్యం చేసుకోలేదన్నారు. అధికార పక్షం నుంచి చేతులు ఎవరు లేపితే వారికి మైకు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. విరుద్ధ అంశాలుంటే నోట్ చేసుకుని తర్వాత దానిపై మాట్లాడాలని సూచించారు. మందబలం ఉందని రెండు, మూడు నిమిషాలకోసారి లేచి మైకు అడగొద్దని అధికార పార్టీ సభ్యులకు చురకలు అంటించారు. అధికార పక్షం నుంచి మాట్లాడిన ఇద్దరు సభ్యులు కూడా గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడారా? మంత్రి వెంకటరెడ్డి అలాగే మాట్లాడారా? అని ప్రశ్నించారు.

సొరంగంలో ప్రమాదకర పరిస్థితి

రెస్క్యూ టీమ్‌లతోపాటు యంత్రాలు, రోబోలతో తవ్వకాలు

- మట్టిని తవ్వుతూ బయటకు పంపుతున్న రోబోలు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద స్థలం వద్ద రోజు రోజుకూ ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతోంది. కార్మికులను గుర్తించి వెలికితీయాలన్న తపనతో రెస్క్యూటీమ్‌లు పని చేస్తున్నాయి. అయితే, పైకప్పు పడిపోయే ప్రమాదముందని అధికారులు ఆందోళన చెందు తున్నారు. అతి జాగ్రత్తగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు కదులుతున్నారు. మనుషులు, యంత్రాలు (రోబోలు) కలిసి మట్టిని తవ్వడం.. కార్మికులను గుర్తించడం, తవ్విన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి పంపే పనిలో ఉన్నారు. సింగరేణి బొగ్గు గని ప్రాంతాలలో ఉపయోగించే టెక్నాలజీని వాడుతున్నారు.

రోబోలు తవ్విన మట్టికి మించి పై నుంచి మట్టి పడుతోంది. మరోవైపు ఊట నీటిని ఎప్పటికప్పుడూ బయటకు పంపుతున్నారు. కార్మికుల ఆచూకీ కోసం 24గంటలూ పని చేస్తుండగా.. అదే క్రమంలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. గంటకు 5 క్యూబిక్ మీటర్ల మట్టిని బయటకు పంపుతున్నప్పటికీ అంతకుమించి మట్టి వచ్చి చేరుతున్నది. అటానమస్ హైడ్రాలిక్ పవర్ రోబోలు, కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. డి-1, డి-2, డీ-3 ప్రదేశాలలో తవ్వకాలకు ఉబికి వస్తున్న నీరు ఆటంకంగా మారింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండుసార్లు రోబోలను సొరంగంలోకి పంపారు. మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో రోబోలు మట్టిని తవ్వి బెల్ట్ మీదకి వేస్తుండటంతో మరో రెండ్రోజుల్లో కార్మికుల ఆచూకీ తెలిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.సహాయక చర్యలపై గురువారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్‌లో డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఉన్నతాధికారులతో సమీక్షించారు. సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్లను 24 గంటలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్టు వివరించారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో నిమగ్నమై ఉన్నట్టు తెలిపారు. ప్రమాద ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్న డి-1, డి-2 ప్రాంతాల్లో సింగరేణి ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నట్టు చెప్పారు. టన్నెల్ బోరింగ్ మిషన్ భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్టు తెలిపారు. డి-1, డి-2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపినట్టు చెప్పారు. సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ర్యాట్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్ బృందాలు పాల్గొంటున్నాయి.



విద్యా వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగం ప్రమాదంలో పడింది. తెలంగాణలో 18 వేల ప్రాథమిక పాఠశాలలుండగా, 4,400 బడుల్లో 10 మందికంటే తక్కువ విద్యార్థులున్నారు. 1,800 స్కూళ్లల్లో జీరో విద్యార్థులున్నారు. శేరిలింగంపల్లి మండలంలో 1.10 లక్షలు, కుత్బుల్లాపూర్ మండలంలో 1.07 లక్షల మంది విద్యార్థులుండగా, రాష్ట్రంలోని 12 జిల్లాల్లో లక్షలోపున్నారు. బడులున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న చోట బడుల్లేవు. ప్రభుత్వం తక్షణం విద్యా వ్యవస్థను పునవ్యస్థీకరించాలి. పరిస్థితి ఇలాగే ఉంటే నాలుగైదేండ్లలో రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగవుతాయి" అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. చొరవ తీసుకుని ఎన్‌రోల్ చేయక పోతే బడిని మూసేస్తామంటూ జీరో విద్యార్థులున్న చోట ఆయా గ్రామ పంచాయతీలకు నోటీసులివ్వాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పేర్లతో బడులను కట్టడాన్ని ఆయన తప్పు పట్టారు. ఉన్న బడులను రక్షించేందుకు ముందు చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు..మన బడి పేరుతో చేపట్టిన పాఠశాలల మరమ్మతుల పథకం మధ్యలో ఆగిపోయిందని గుర్తు చేశారు. వాటిని పూర్తి చేసేందుకు రూ.800 కోట్ల వరకు ఖర్చవుతాయనీ, సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవాని విజ్ఞప్తి చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం వల్ల విద్యారంగం పూర్తిగా ప్రయివేటీకరణకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ క్రమంలో బ్యూరోకాట్లు, ప్రజాప్రతినిధులతో పాటు ముఖ్యులందరూ ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల్ని చేర్పించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో తామే స్వయంగా వైద్యం చేయిం చుకోవాలి. అప్పుడే ఈ రంగాలపట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అభి ప్రాయ పడ్డారు. కార్పొరేట్ పోటీని తట్టుకుని అవి నిలబడుతాయనీ, సర్కార్ అ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రెండు కార్పొరేట్ విద్యా సంస్థల్లోనే లక్ష మంది విద్యార్థులు చదువుకుంటున్నారనీ, అందులో 1,000 మందికి కూడా ర్యాంకులు రావడం లేదని గుర్తు చేశారు. ఆ రెండు సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్న విషయాన్ని దాచి పెడుతున్నారని వివరించారు. ఈ విషయాలపై సర్కార్ సరైన ప్రచారం చేస్తే, విద్యార్థుల తల్లిదం డ్రులు సర్కార్ బడుల వైపు మళ్లుతారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న మంత్రి పొన్నం.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడీలో పెట్టేం దుకు తమ ప్రభుతం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తన నియోజ కవర్గమైన హుస్నాబాద్‌లోని నవాబ్‌పేట హైస్కూల్లో 50 మంది పిల్లలకు 10 మంది టీచర్లు న్నారని గుర్తు చేశారు. రాజకీయాలకతీతంగా ఈ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. సభాపతి స్థానంలో ఉన్న బండప్రకాష్ జోక్యం చేసుకుంటూ... ఈ అంశంపై శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బా బుతో తాను స్వయంగా చర్చించాననీ, సమయం చూసుకుని చర్చ చేపడుతామని తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

రాష్ట్రంలో పని చేస్తున్న దాదాపు రెండు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని నర్సిరెడ్డి కోరారు. ప్రస్తుతం చెల్లిస్తున్న జీతాలతో వారి జీవితాలు బాగుపడేలా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీ తదితర ప్రభుత్వ విద్యా సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లిస్తున్న జీతాలకు, వారి వ్యయాలకు తేడా ఉందని చెప్పారు. దినదిన గండంగా బతుకువెళ్లదీస్తున్న వారి ఉద్యోగ, ఆరోగ్య భద్రతకు సర్కార్ చర్యలు తీసుకోవాలని కోరారు.

హైకోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలి



- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ముషీరాబాద్

కనీస వేతనాల జీఓల విడుదల గురించి హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని పాలడుగు భాస్కర్ ఆమోదిస్తూ కర్తవ్యాన్ని ప్రవేశపెట్టి మాట్లాడారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లోని 5 రంగాలకు సంబంధించి 2021లో ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌ను వెంటనే గెజిట్ చేయాలని హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మిగిలిన 68 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో కనీస వేతనాలను సవరించాలని కోరారు. కరువుభత్యం పాయింట్ల రేట్లు కూడా అన్‌స్కిల్డ్ వర్కర్ రూ. 12/, హైలీస్కిల్‌కు రూ. 26.55 ప్రతిపాదించారు. వీటిపై యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయని, గత ప్రభుత్వం కూడా యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ కాలయాపన చేస్తున్నదని తెలిపారు. దీనిపై అన్ని సంఘాలూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ.. హైకోర్టులో పిల్‌నెం.14 ఆఫ్ 2023లో కేసు వేయగా.. చట్టం ప్రకారం వేతనాలు సవరించాలని 2023 అక్టోబర్‌లో తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. అలాగే, 2021లో 5 రంగాలకు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్స్‌ను గెజిట్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయలేదని, దీనిమీద కంటెస్ట్ కేసు ఫైల్ చేశారని తెలిపారు. దాంతో 4 వారాల్లో 5 జీవోలను గెజిట్ చేయాలి.. లేదా ప్రభుత్వ ఉన్నతాధికారి పర్సనల్‌గా కోర్టుకు హాజరు కావాలని 2025 మార్చి 3న కోర్టు ఆదేశించిందని చెప్పారు. ఏప్రిల్ 11కు కేసు వాయిదా వేశారని, ఈ లోగా ప్రభుత్వం అమలు చేయాల్సి ఉందని తెలిపారు. సవరణ చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం 5 ఏండ్లకు ఒకసారి పెంచాల్సి ఉందన్నారు. కానీ 2006-12 మధ్యకాలంలో ఉమ్మడి రాష్ట్రంలో చేసిన సవరణలు తప్ప మళ్లీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్మానాల అమలుకు అన్ని సంఘాల తరఫున మార్చి 22న చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇవ్వాలని, బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించాలని తీర్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, ఎస్వీ రమ, జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, కూరపాటి రమేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కె. బోస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అనురాధ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఎం.బాబాయి, జి.తిరుపతయ్య, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచితాలతో నిరుపయోగం

ముంబయి : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణమూర్తి మరోసారి నోరు పారేసుకున్నారు. వారానికి 90 గంటలు పని చేయాలని ఇటీవల వ్యాఖ్యలు చేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకొని అబాసు పాలైన ఆయన.. తాజాగా ఉచితాలు నిరుపయోగమని అన్నారు. ముంబయిలో జరిగిన 'టైకాన్ ముంబయి 2025'లో నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సృష్టించే ఉద్యోగాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కానీ ప్రజలకు పంచే ఉచితాలతో ఉపయోగం ఉండదన్నారు. ఔత్సాహికవేత్తలు మరిన్ని వ్యాపారాల సృష్టిపై దృష్టి సారించాలన్నారు. వినూత్న కంపెనీలు ఏర్పాటు చేస్తే ఏదో ఒక రోజు పేదరికం మాయమవుతుందన్నారు. ఏ దేశమూ పేదలకు ఉచితాలు ఇవ్వడం వల్ల విజయవంతం కాలేదన్నారు. ఉద్యోగాల వల్లే పేదరిక సమస్య పరిష్కారమవుతుందన్నారు.

ఘనంగా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- హైదరాబాద్

టీఎక్స్ ఆస్పత్రి సీఓఓ శ్రీకాంత్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలను టీఎక్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ దీపక్ రాజు, రామిరెడ్డి రవీందర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్స్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరిపారు.



బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, మాజీ శిశు సంక్షేమ డైరెక్టర్ సుశీల రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

మోడీ పాలనలో పెరిగిపోతున్న అవినీతి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్.బోస్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలో మోడీ పాలనలో అవినీతి రోజు రోజుకు పెరిగిపోతుందని, ఆ విషయం ప్రజలు గ్రహిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాలకు పారిపోయిన అవినీతిపరులు, మోసకారులు ఏండ్ల తరబడి గడుస్తున్న వారిని స్వదేశానికి తీసుకురావటం మోడీతో ఇప్పటి వరకు కాలేదన్నారు. వారిపై ఏలాంటి చర్యలు తీసుకోకపోవటం దురదృష్టకరమన్నారు. మన దేశ పౌరులను అమెరికా నుండి సంకేళ్ల లేకుండా మన దేశ విమానంలో తీసుకొస్తే దేశ ప్రతిష్ట, ఆ దేశం నుండి అవమానభరితంగా తిరుగు ప్రయాణం కట్టిన భారత పౌరులకు ఆత్మగౌరవం మిగిలేదని, ఈ చర్యతో మోడీ ఏ పాటి దేశభక్తుడో తేటతెల్లమవుతున్నదన్నారు. కనీసం ఇప్పటికైనా మోడీ పనికి మాలిన మాటలను ఆర్భాటంగా ప్రకటించటం మాని, ప్రజలను మోసం చేయటం నిలిపివేయాలని సూచించారు.మోడీ మోసాలను ప్రజలంతా అర్థం చేసుకొని దేశాన్ని దుష్టపాలన నుండి కాపాడుకోవాలని ప్రజలను కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: శుక్రవారం సాయంత్రం :06.31 గం.

సహర్: శనివారం ఉదయం :05.12 గం.

మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఏ.పద్మా, వై.వరలక్ష్మి

నవతెలంగాణ-అంబర్‌పేట

మహిళల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తుందని ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఏ.పద్మా, వై.వరలక్ష్మి అన్నారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ముషీరాబాద్ భారత్‌నగర్, అంబర్‌పేట కృష్ణనగర్‌లో జెండా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఏ. పద్మా వై. వరలక్ష్మి మాట్లాడుతూ సంఘం 1981లో ఏర్పడిన నాటి నుంచి దేశవ్యాప్తంగా సాధారణ మహిళలను సమీకరించి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ భద్రత ఉపాధి కల్పించాలని



పని ప్రదేశాలో వేధింపులను అరికట్టాలని, మద్యం, మారక ద్రవ్యలు, గంజాయి నియంత్రిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శభనా, ఉష, రజియా, పద్మా, పార్వతి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలి

చేనేత వర్గాలు చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు



నవతెలంగాణ-ముషీరాబాద్

చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని చేనేత వర్గాలు చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. గురువారం చేనేత వర్గాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ చిక్కా దేవదాసు మాట్లాడుతూ చేనేత మగ్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అవమానపరిచారని తక్షణమే క్షమాపణలు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చేనేతకు రూ.2వేల కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టి తక్షణమే అమలు చేయాలని, ప్రకటించిన 33 కోట్ల రుణమాఫీ వెంటనే అమలయ్యే విధంగా జీవో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018 ఏప్రిల్ 17న టెస్కో మనుగడలో ఉండగానే కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, సుదీర్ఘ కాలంగా సొసైటీలు డైరెక్టర్లు పాలకవర్గాలతో కళకళలాడిన సంస్థను పాలకులు ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మత్స్యకార, వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని అవన్నీ కొనసాగుతున్నప్పుడు చేనేత, నేత కార్మిక సహకార సంఘాలపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. చేనేత వర్గాలకు పూర్తి మద్దతు తెలిపిన తీన్మార్ మల్లన్న చేనేత వర్గాలకు పూర్తి అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్సీ సమావేశాల్లో చేనేత సమస్యలపై మాట్లాడుతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్ల గీత, కూరపాటి సుమలత, చింతకింది సుజాత, బొమ్మ నరేందర్, తదితరులు పాల్గొన్నారు

యూజీసీ నూతన సంస్కరణలను వ్యతిరేకించండి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ నూతన సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలలో గవర్నర్ల ద్వారా నేరుగా వీసీల నియామకాలను చేపట్టడం అంటే యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని హక్కులను కాలరాయడమేనని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. గురువారం పీడీఎస్‌యు రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో యుజీసీ నూతన సంస్కరణలకు వ్యతిరేకంగా వివిధ యూనివర్సిటీలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. పీడీఎస్‌యు జాతీయ కార్యవర్గ సభ్యులు ఈ.విజయ్ కన్నా మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు యూజీసీ అభివృద్ధి నిధులు ఫెలోషిప్‌లో వివిధ రీసెర్చ్ ప్రాజెక్టులకు



నిధులు కేటాయించి విద్యార్థులకు తోడ్పాటు అందించేదని కానీ గత పదేండ్ల బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫెలోషిప్‌ల కోత పెట్టిందని యూనివర్సిటీలో అభివృద్ధికి బడ్జెట్‌ను కేటాయించకుండా పేద దళిత గిరిజన వర్గాల విద్యార్థులను యూనివర్సిటీ క్యాంపస్‌లోకి రాకుండా అడ్డుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముస్లీం సుల్తానా రాష్ట్ర నాయకులు కే.గణేష్, మందుల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



● బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి అవినీతి, అరాచకాలపై విచారణ జరిపి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీకి బీసీ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు చేసింది. బుధవారం హైదరాబాద్ లక్డికాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, రేషన్ మాఫియాలతో కుమ్మక్కై, నెలకు దాదాపు రూ.10 లక్షల దాకా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల ఓ మహిళ మెడలో నుంచి బంగారం చోరీకి గురైందని, ఆ రికవరీ మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేసి కోర్టు ద్వారా బాధితులకు ఇవ్వాలి కానీ ఆయన దుర్బుద్ధితో కోర్టులో రూ.70 వేలు మాత్రమే డిపాజిట్ చేసి మిగతాది లంచంగా తీసుకొని బాధితులకు ఫోన్ పే ద్వారా రూ.50 వేలు ఒకసారి, రూ.30 వేలు మరొకసారి వేసి మమ అనిపించారని, మరొక మహిళకు సైతం రూ.50 వేలు ఫోన్ పే చేసినట్లు తెలిపారు. ప్రధాన పత్రికలలో ఆధారాలతో సహా కథనాలు వచ్చినా జిల్లా ఎస్పీ, ఐజీ అతనిపై చర్యలు తీసుకోవడం లేదని, అందుకే ఎస్ఐ అరాచకాలపై డీజీపీకి ఫిర్యాదు చేశామన్నారు. ఇసుక, రేషన్ దందా అన్నిట్లలో ఆయనకు నెలకు వాటాలు ముట్టాల్సిందేనని, పెబ్బేరులో మార్నింగ్ వాక్ కార్యక్రమానికి వెళ్తే అనేకమైన ఫిర్యాదులు ఎస్సైపై వచ్చాయన్నారు. చట్టం ప్రకారం మహిళ నిందితులను పట్టుకుంటే 24 గంటలలోపు పంపించాల్సింటుందని, కానీ ఈ ఎస్ఐ ఏకంగా 8 రోజులు స్టేషన్‌లోనే ఉంచారని, కనుక ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకొని ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాఘవేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్ గౌడ్, రేనట్ల మల్లేష్, ముత్యాల వినోద్ సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో ఘనంగా హెూలీ సంబరాలు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ బేగంబజార్‌లో హెూలీ పండుగను పురస్కరించుకుని బేగంబజార్ హెూలీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మార్వాడీలు, ఉత్తర భారతీయులు, గుజరాతీలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని హెూలీ ఉత్సవాలను ఆనందంగా జరుపుకున్నారు. సహజసిద్ధమైన ఆర్గానిక్ గులాల్ రంగులతో ఒకరిపై ఒకరు రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాలి సమాజ్ భవనం నుండి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్ అంతటా కొనసాగింది. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ, ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. హెూలీ ఉత్సవాలతో బేగంబజార్ ప్రాంతం మొత్తం రంగుల మయమైంది. మార్కెట్‌లో సందడి నెలకొనడంతో పండుగ వాతావరణం తారాస్థాయికి చేరింది. ఈ హెూలీ



సంబరాల్లో కుక్క రాజ్ కచ్చాడా, మనీష్ బాటి, అవినాష్ దేవుడా, ఠాగూర్ సోలంకి, అరవింద్ బాటి, హనుమాన్ సోలంకి, గజానంద్ దేవుడా, ధీరజ్ పరివార్, కుషాల్ బాటి, రాజేష్, గోవింద్ పనువార్లతో పాటు వ్యాపారుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగర ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగుల పండుగ హెూలీ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, హెూలీ మన సమాజంలో ఐక్యత ను, ప్రేమను, స్నేహాన్ని ప్రతిబింబించే పండుగని అన్నారు. హెూలీ రంగుల పండుగని, ఈ పండుగ అందరికీ సంతోషాన్ని, ఆరోగ్యాన్ని, శాంతిని కలిగించాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు హెూలీ వేడుకలను జాగ్రత్తగా, సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల మధ్య ప్రేమను చాటిచెప్పే ఉత్సవం

హెూలీ పండుగ శుభాకాంక్షలు : కమిషనర్ ఇలంబర్తి

హెూలీ పండుగను పురస్కరించుకొని నగర ప్రజలకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి శుభాకాంక్షలు తెలిపారు. హెూలీ పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకమైనదని, ఇది రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిందని, హెూలీ పండుగ ప్రజల మధ్య ఆనందాన్ని, ఐక్యతను, ప్రేమను చాటిచెప్పే ఉత్సవంగా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. హెూలీ పండుగ ఆనందం, ఉల్లాసం, సామరస్యానికి సంకేతంగా, కొత్త శుభారంభానికి సూచికగా జరుపుకుంటారని అన్నారు. ప్రజలు సురక్షితంగా, ఆనందంగా హెూలీ వేడుకలను జరుపుకోవాలని, పర్యావరణానికి హాని చేయని రంగులను ఉపయోగించాలని సూచించారు.

సంస్కృతాంధ్ర భాషా పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి

నవతెలంగాణ కల్చరల్

సంస్కృత ఆంధ్ర భాషల్లో సమ పాండిత్య ప్రతిభ కల వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు జాతికి శాశ్వత సాహిత్య సంపద అందించారని తెలంగాణ పౌర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మెన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదిక లో ఎందరో మహానుభావులు మధుర స్మృతులులో భాగంగా భాషా శాస్త్ర పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను చరిత్రలో మరుగు పడకుండా వారి గుర్తించిన జయంతి, సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విశ్వవిద్యాలయాలు లేదా సాహిత్య అకాడమీలు చేయాల్సిన పని గాన సభ జరుపుతూ నేటి తరాలకు అందించడం ముదావహం అన్నారు. అన్నమయ్య కీర్తనల తాళ పత్రాల నుంచి పరి స్కృతం చేసిన ప్రభాకర శాస్త్రి చిన్న వయస్సులోనే ప్రావీణ్యత పొందారని వివరించారు.



ప్రజలకు ఆటంకం లేకుండా అంగడి నిర్వహించాలి

● జీహెచ్ఎంసీ అధికారులకు గోషామహల్ సమగ్రాభివృద్ధి కమిటి వినతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంలోని జుమ్మే రాత్ బజార్‌లో ప్రతి గురువారం నిర్వహిస్తున్న అంగడి (సంత)లో వ్యాపారాలు చేసే వారు స్థానిక ప్రజల రాకపోకలకు కలిగిస్తున్న ఆటంకాలను నివారించేలా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గోషామహల్ సమగ్రాభివృద్ధి కమిటి కన్వీనర్ పి.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటి ఆధ్వర్యంలో స్థానికంగా ఆయా బస్తీల ప్రజలను, విద్యా సంస్థల అభిప్రాయాలను సేకరించింది. బస్తీల ప్రజలు, విద్యార్థులు పేరెంట్స్, అధ్యాపకులకు రోడ్డుకిరువైపుల క్రమబద్ధీకరణ లేకుండా చేస్తున్న అంగడి రోజు వ్యాపారుల తీరువల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం జరుగుతున్నదని కమిటి పరిశీలనలో తేలింది. అందువల్ల జీహెచ్ ఎంసీ సెంట్రల్ జోన్ కమీషనర్ జే.అనురాగ్ జోక్యం చేసుకొని పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గ సమాగ్రాభివృద్ధి కమిటి ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. అధికారులను కలిసిన వారిలో కన్వీనర్ పి.నాగేశ్వర్, సభ్యులు కే.జంగయ్య, బీ.సత్యనారాయణ తదితరులున్నారు.

చెరువులలో చేపలు పట్టుకునే హక్కును కల్పించాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

జీవో నెంబర్ 343 అమలుపరుస్తూ చెరువులలో చేపలు పట్టుకునే హక్కును కల్పించాలని రజక ఫిషర్మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మెన్ ఆమనగంటి సైదులు అన్నారు. శనివారం మార్చి 15న కళాభవన్ సుంద రాయ భవన్ బాగ్‌లింగంపల్లిలో జరుగు రజకుల జన శంఖారావం ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ చేతుల మీదగా గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 343 అమలుపరుస్తూ చెరువు లలో చేపలు పట్టుకునే హక్కును కల్పించాలని వారు కోరారు. రజక ఫిషర్మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాజీవ్, రజక రాష్ట్ర అధ్యక్షుడు నేర్నాకంటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

ఎస్సీ,ఎస్టీ,బీసీలకు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం ఏపీ భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఓబీసీ డిమాండ్లపై బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సభా అధ్యక్షత తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ వహించగా సభ సమన్వయకర్తలుగా ఆంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలని ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తీసుకురావాలని, ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నేడు ఓబీసీల మీద దృష్టి సారించిందని ప్రధాని నరేంద్ర మోడీ ఓ బీసీల పక్షపాతని మోడీతోనే ఓబీసీలకు న్యాయం జరుగుతుందని నేడు ఉద్యమం పతాక స్థాయికి చేరిందని ఈ దశలో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పితాని ప్రసాద్, రాజ్ కుమార్, శ్రీనివాసరావు, భోగి రమణ, శశి భార్గవి, బొమ్మని కోటేశ్వరరావు, రాజశేఖర్, సుభాష్ యాదవ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు



ప్రొ.జోత్స్నకు గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు

నవతెలంగాణ-అంబర్‌పేట

కాచిగూడకు చెందిన తెదేపా జాతీయ అధికార ప్రతినిధి ప్రొ. తిరునగరి జోత్స్న ప్రతిష్టాత్మక టాప్-20 గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ 2025 అవార్డును అమెరికాలోని వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హెల్‌లో అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళా నాయకత్వం, వారి సంకల్పం, శక్తీకరణను ప్రోత్సహించే దిశగా 13వ వార్షిక అమెరికన్ మల్టీ ఎథ్నిక్ కమిషన్ (ఏఎంఈసీ) కాంగ్రెస్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేసింది. ఈ అవార్డు తనకు గౌరవాన్ని ఇవ్వడమే కాకుండా తెలుగు మహిళల బలాన్ని, ప్రతిభను, నాయకత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప గుర్తింపుగా భావిస్తున్నానని ప్రొ.జోత్స్న అన్నారు. తెదేపా మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ బలమైన వేదికను అందించి ప్రోత్సాహిస్తున్నందుకు తెదేపా అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు తన కృతజ్ఞతలు తెలిపారు.



డయాలసిస్ సెంటర్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో డయాలసిస్ సెంటర్‌లో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నజియా నౌషీన్ సిద్ధిఖా, ఆర్ఎంఓ డాక్టర్ కాంతి కిరణ్ , డాక్టర్ శ్రీలత, డ్యూటీ డాక్టర్ ఇమ్రాన్, డయాలసిస్ సెంటర్ ఇన్చార్జి కేశవ్, ఫెసిలిటీ మేనేజ్మెంట్ ఇన్‌చార్జిలు ఎం.సదానంద్, వై.శ్రీనివాసులు, ప్రసన్న, మహేష్, షీరిన్, అశ్రిత, సెంటర్ ఎగ్జిక్యూటివ్ సుభాషిణి పాల్గొన్నారు.



17 నుంచి లెప్రసీ సర్వే..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

లెప్రసీ సర్వేను ఈనెల 17 నుంచి ప్రారంభమవుతుందని ఇసామియా బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహక తెలిపారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు లెప్రసీ సర్వే, కుష్టి వ్యాధిని గుర్తించడం, వ్యాధి లక్షణాలపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ పీఎంవో శ్రీనివాస్ రెడ్డి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఎంసీహెచ్ కాలనీలో స్థానిక నాయకుల ప్రజలతో కలిసి అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులను సిబ్బందిని పిలిపించి రోడ్ ప్యాచ్‌వర్క్ పనులు వెంటనే పూర్తి చేయాలని, స్వచ్ఛమైన మంచినీటిని కాలనీ ప్రజలకు అందించాలన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు రావడంతో సంబంధిత సిబ్బందిని పిలిపించి విద్యుత్ దీపాలని వెంటనే బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, దుర్గ, విద్యుత్ సిబ్బంది సాయి, స్థానిక బస్తీ ప్రజలు బీఆర్ఎస్ సీనియర్ నాయ కులు రంగు సతీష్ గౌడ్, యూసుఫ్ బాబా, రహీం, జాంగిర్, తదితరులు పాల్గొన్నారు.



సాంప్రదాయబద్ధంగా వివాహాలు జరిపిస్తాం

తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

సాంప్రదాయబద్ధంగా వివాహాలు జరిపిస్తామని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీ థియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ హాజరై మహిళను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేని అటూ ఏమీ లేదన్నారు. నేటి సమాజంలో మహిళలు ఎంతగానో అభివృద్ధి చెందారని అన్ని రంగాలలో విస్తృతంగా రాణిస్తున్నారన్నారు. ఉగాదిని పురస్కరించుకొని మూడు నుంచి ఐదు పెండ్లి చేసిన వారికి మ్యారేజ్ బ్యూరో ఉత్తమ రత్న అవార్డుతో సత్కరిస్తామన్నారు. అన్ని కులాల వరకు సాంప్రదాయ బద్దంగా సంబంధాలు చూసి పెళ్లిండ్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివతేజ పూస, రాష్ట్ర కోశాధికారి ఐల రవీందర్ గౌడ్ మహిళా అధ్యక్షురాలు భాగ్యమ్మ అడ్వైజర్ ఈశ్వర్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు ముదిరాజ్ శ్యామ్ రావు సెక్రెటరీ రవీందర్ గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'సమాజంలో మార్పునకు అత్యంత కీలకమైన వ్యక్తులు ట్రైనర్లు'

తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సమాజంలో మార్పుకు అత్యంత కీలకమైన వ్యక్తులు ట్రైనర్లు అని, ప్రతి రంగంలో నాణ్యత గల ట్రైనర్ అవసరం ఎంతో ముఖ్యమని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదర్ గూడలోని హెూటల్ సెంట్రల్ పార్క్‌లో 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' పేరుతో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ అనుమతితో ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికేట్‌లను ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శిక్షణలో భాగంగా ప్రతి శిక్షకులకు వారి శిక్షణ కార్యక్రమాల ద్వారా సగటు వ్యక్తుల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తద్వారా తరువాతి తరానికి సమర్థవంతమైన శిక్షకులను తయారు చేయడమే ప్రధాన లక్ష్యంతో ఉండాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కలకత్తా నుంచి వచ్చిన నిపుణులు డా.నంది గౌతమ్, డా. వంగీపురం శ్రీనాథచారి, డా.రవిచంద్ర, డా.శ్రీపూజ వంటి ప్రాముఖ్యత గల వారితో ఉపన్యాసాలు ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు జగదీశ్వరరావు, నాయకులు వేణుగోపాల్, డా. సిద్ధుల రవి, లక్ష్మణ్ కుమార్, సదాశివ రెడ్డి, బాలసుబ్రమణ్యం, లక్ష్మీ సౌజన్య, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.



ఈసీఐఎల్ కంపెనీ చైర్మెన్‌ను కలిసి ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ కంపెనీ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్‌ను గురువారం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, సీఎస్‌ఆర్ ఫండ్స్ గురించి వారు చర్చించారు. అలాగే ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల అభివద్ధి, సీసీ కెమెరాలు, అభివద్ధికి నిధుల కోసం చర్చ జరిగింది. అలాగే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, మొదలైన విషయాలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మహేష్ గౌడ్ ,బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో భారీగా బదిలీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీలో వివిధ జోన్లు, డివిజన్లలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పవులురు బదిలీ అయ్యారు. 11 మందిని బదిలీ చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి గురు వారం ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ ఇంజనీర్‌తోపాటు సూపరిం టెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్‌లలో లాంగ్ స్టాండిగ్‌తోపాటు పరిపాలనా కారణాలతో జీహెచ్‌ఎంసీలో బదిలీలు చోటుచేసుకున్నాయి. ఎల్బీనగర్, ఖైరతాబాద్, హయత్‌నగర్ జోన్లతోపాటు హెడ్‌ఆఫీసులో పనిచేస్తున్న పలువురిని బదిలీ చేశారు. బదిలీ అయినవారు వెంటనే విధుల్లో చేరాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న చిల్కానగర్

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్, అన్ని రంగాలలో అభివృద్ధిలో దూసుకెళ్తూ గ్రేటర్‌లోని అన్ని డివిజన్‌లకు ఆదర్శంగా నిలుస్తున్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చిల్కానగర్ డివిజన్‌లోని వలు అభివద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని పార్కుల్లో, గ్రేవ్ యార్డ్‌లలో మౌలిక సదుపాయాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని గ్రేవ్ యార్డ్‌ల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లోని అన్ని పార్కులకు ఎమ్మెల్యే సహకారంతో అభివద్ధి, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, బాలాజీ ఎంక్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కుమ్మరి సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

చర్లపల్లి : శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాచారం డివిజన్ పరిధిలోని శ్రీ రామ్ నగర్ లో బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా



ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను గురువారం వారి కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండాలి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు శాంక్షన్ చేయాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్.. వీలైనంత త్వరలో తన దృష్టికి తీసుకువచ్చిన పనులన్నింటికీ నిధులు కేటాయించి పూర్తి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, గీత ప్రవీణ్ ముదిరాజ్, శిరీష సోమ శేఖర్ రెడ్డి , పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-కాప్రా

ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గ్లకోమా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈసీఐఎల్ చౌరస్తా నుంచి రాధికా చౌరస్తా, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరుకు సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం గ్లూకోమా వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు డాక్టర్ అశోక్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి అన్ని వయసుల వారికి గ్లకోమా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. భారతదేశంలో ప్రతి పదిమందిలో ఒకరు గ్లకోమాతో బాధపడుతున్నా వారిలో అవగాహన లేకపోవడంతో ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తున్నారన్నారు. గ్లకోమాను ప్రారంభదశలో గుర్తించగలిగితే చికిత్స సాధ్యమన్నారు., కంటిలో వచ్చే రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ కార్పొరేటర్, కుషాయిగూడ, లయన్స్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు, సంస్థ డైరెక్టర్ మహేష్ , ఎస్సై ఏ.రవీందర్ , పోలీస్ సిబ్బంది, డాక్టర్ సందీప్, సొలిస్ ఆస్పత్రి సిబ్బంది సుబ్బారావు, విజయలక్ష్మి, లక్ష్మి నీరజ, సుజీత్, విక్రమ్, శ్రీకాంత్ యువతీ,యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాక్ ను విజయవంతం చేసినందుకు డాక్టర్లుకు సిబ్బందికి యాజమాన్యం ధన్యవాదములు తెలిపింది.



రైతు సంఘం నాయకులను విడుదల చేయాలి

- జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి డి.జి. నరేందర్ ప్రసాద్



నవతెలంగాణ - జవహర్ నగర్

రైతు సంఘం నాయకుల ముందస్తు అరెస్టులను త్రీవంగా ఖండిస్తున్నామని, అరెస్ట్ చేసిన రైతు సంఘం నాయకులను బేషరతుగా విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి డి.జి. నరేందర్ ప్రసాద్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం కనకయ్యలను అరెస్టు చేయడం అన్యాయ మన్నారు. రైతుల సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేయాలని వారం రోజుల ముందు ధర్నా పర్మిషన్ కోసం సంబంధిత పోలీసు అధికారులకు అర్జీ పెట్టుకున్నప్పటికీ పర్మిషన్ ఇవ్వకుండా రద్దు చేశారని చెప్పారు. వెంటనే అరెస్ట్ చేసిన వారందరిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డి జంగయ్య, సీనియర్ నాయకులు సిహెచ్ దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

శరీర అవయవాలలో కిడ్నీలు ప్రధానం

నవతెలంగాణ-ఘట్కేసర్



శరీర అవయవాలలో కిడ్నీలు ప్రధానమని వాటిని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని బీజేపీ మేడ్చల్ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. వై యస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వరల్డ్ కిడ్నీ దినోత్సవం కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కొమ్మిడి మహి పాల్ రెడ్డితో కలిసి పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదునిక సమాజంలో ఆహారపు అలవాట్లు,అన్ని రకాల కాలుష్యాల వల్ల మనిషిలో అత్యంత ముఖ్యమైన మూత్రపిండాలు విఫలం అవుతుం డడం చూస్తుంటే మానవాళి మనుగడకు సవాల్ గా కనబడుతున్నదని తెలిపారు. గతంలో 50 సంవత్సరాలకు పైబడిన వ్యక్తులకు ఈ మూత్ర పిండాల ముప్పు ఉండేదని, కానీ నేడు పుట్టిన బిడ్డ నుంచి 20 సంవత్సరాల యువకులు ఈ పెను బూతానికి బలైపోతున్నారని తెలిపారు. బీపీ,షుగర్ వంటి వ్యాధులు,శారీరక శ్రమ చేసే వారు ఇష్టారీతిన మందుల వాడకం వల్ల మూడు, నాలుగేండ్ల వ్యవధిలోనే మూత్ర పిండాలు పూర్తిగా చెడిపోయే స్థితికి చేరుకుంటున్నాయని చెప్పారు. సమస్య పట్ల అవగాహన కలిగి ఉండి,ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పక టెస్ట్ లు చేయించుకోవడం,ఆరోగ్య కరమైన జీవన విధానం,క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల ఈ సమస్యకు కొంతలో కొంత అరికట్టగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ, డాక్టర్ ప్రసాద్, డయాలసిస్ ఇన్‌చార్జీ రామ్ రెడ్డి, నాయకులు రాజశేఖరరెడ్డి, అనిల్ పాల్గొన్నారు

నందనవనం పార్క్‌ను కబ్జా నుంచి కాపాడండి

- దాడికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఆనంద్ నగర్ కాలనీ వాసులు



పార్క్‌ను కాపాడాలని కాలనీ వాసులతో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ స్థానిక అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్



ఆధారాలను మీడియాకు చూపిస్తున్న కొండల్ ముదిరాజ్

నవతెలంగాణ-జవహర్ నగర్

ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన పార్క్ ను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, కబ్జాదారుల నుంచి పార్క్ స్థలాన్ని కాపాడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 15 డివిజన్ ఆనంద్ నగర్ కాలనీలో సర్వే నెంబర్ 510 లో 17 గుంటల ప్రభుత్వ భూమిలో మున్సిపల్ శాఖ నందనవనం పార్కును ఏర్పాటు చేసి సుమారు 44 లక్షల మున్సిపల్ నిధులతో పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసింది. అయితే బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 20 మంది బౌన్సర్లు, 20 మంది మహిళలతో కలిసి జేసీబీ తో అక్కడికి వచ్చి మున్సిపల్ వారు ఏర్పాటు చేసిన నందనవనం సూచిక బోర్డును కాల్చివేసి, అక్కడ ఉన్న సామాగ్రిని ధ్వంసం చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వచ్చి అడ్డుకోవడంతో సమస్య సద్దుమణిగింది. పార్క్ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కమిషనర్ వసంతకు వినతి పత్రం అందజేశారు.



ప్రాణాలైనా అర్పిస్తాం పార్క్ స్థలాన్ని కాపాడుకుంటాం

ప్రాణాలైనా అర్పిస్తాం నందనవనం పార్క్ స్థలాన్ని కాపాడుకుంటామని ఆనంద్ నగర్ కాలనీ వాసులు అంటున్నారు. ఇట్టి భూమి తనదని, తాను కొనుగోలు చేసానని బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ అంటూ ప్రజలపైకి రౌడీలను పురమాయించి బెదిరిస్తున్నాడని కాలనీ వాసులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఎవరు అమ్మారు. ఎవరు కొన్నారని ప్రశ్నిస్తున్నారు. ఇట్టి స్థలంలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా అక్రమ ఇంటి పన్నులు సృష్టించి కోర్టులను కూడా తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇండ్లు లేకున్నా ఇంటి పన్నులు ఎలా ఇచ్చారో మున్సిపల్ అధికారులే చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్ హయంలోనే పార్క్ కబ్జాకు గురైంది : కాంగ్రెస్ పార్టీ స్థానిక అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్.

నందనవనం పార్కు బీఆర్‌ఎస్ హయంలోనే కబ్జాకు గురైతే కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపాడారని మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రోద్భలంతోనే బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నందనవనం పార్కులో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నందనవనం పార్కును కబ్జా చేద్దామని బౌన్సర్లు రావడంతో ప్రాణాలకు తెగించి మహిళలు అడ్డుకోబోగా వారిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడికి గురైన ఆడ బిడ్డలను జవహర్ నగర్ మాజీమేయర్ మేకల కావ్య పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. నందనవనం పార్కు కబ్జాకు గురికాకుండా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడద్దని మనోధైర్యం కల్పించారు. బీఆర్‌ఎస్ స్థానిక అధ్యక్షుడు కబ్జాలకు పాల్పడుతుంటే బీఆర్‌ఎస్ పెద్దలు ఏమి చేస్తున్నారని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి తమ నిజాయితీని నిరూపించు కోవాలని తెలిపారు. నాలుగు ఏండ్లుగా నందనవనం పార్కులో ఆనంద నగర్ కాలనీవాసులు సేద తీరుతుంటే కబ్జా చేద్దామని బౌన్సర్లతో ప్రభుత్వ ప్రాపర్టీలను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజక వర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ సహకారంతో పార్కును కబ్జాకు గురికాకుండా కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడుగు వేణు, కూతాడి ముఖేష్, వినయ్ కుమార్, మిట్టు యాదవ్, ప్రభాకర్ కాలనీవాసులు పుష్పలత ఐరమ్మ లతా, జయ, రత్న బాలమణి, శ్వేత, భవాని, సరిత, మౌనిక, రవీందర్ రెడ్డి, సందీప్, రాంబాబు, దేవేందర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ భూమి మాదే అని పక్కా ఆధారాలు ఉన్నాయి : కొండల్ ముదిరాజ్, న్యాయవాది రాంమూర్తి.

నందనవనం కు కేటాయించిన భూమి తమదేనని మా వద్ద పక్కా ఆధారాలు పేపర్లు ఉన్నాయని బీఆర్‌ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, న్యాయవాది బొమ్మెర రాంమూర్తి మీడియా సమావేశం లో తెలిపారు. ఈ స్థలాన్ని ఐజాక్ ప్రభాకర్ దగ్గర 2004 లో కొనుగోలు చేశానని చట్టపరంగా అన్ని దస్తావేజులు ఉన్నాయన్నారు. ఈ స్థలానికి ఇంటి పన్ను, విద్యుత్ బిల్లు, నల్లా బిల్లుతో సహా అన్ని ఉన్నాయనారు. రాజకీయ కక్ష్య సాధింపు చర్యలో చేస్తున్న కుట్ర అని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ పార్క్ కు స్థలాన్ని కేటాయించారని అంటున్నారని, అట్టి ఆర్డరును హైకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. పోలీస్ ప్రొటెక్షన్ తదితర దస్తావేజులు, ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందన్నారు. మా వద్ద పేపర్ పరంగా అన్ని ఆధారాలు ఉన్నాయని వాటిని మున్సిపల్ కార్యాలయంలో, స్థానిక పోలీసులకు అందజేస్తామని అన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే మా మిద బురద జల్లుతున్నారని మేము ఇదంతా న్యాయ పరంగా ఎదుర్కొంటామన్నారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదు



ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. నందనవనం పార్క్ లో జరిగిన సంఘటన లో పాల్గొన్న వారిపై జవహర్ నగర్ పోలీసులకు పిర్యాదు చేశాం. సుమారు 40 వేల రూపాయల ప్రభుత్వ ఆస్తికి నష్టం జరిగింది. ఇంటి పన్నుల విషయంలో విచారణ జరిపిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పార్క్ స్థలాన్ని కాపాడి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ వసంత

చీర కట్టులోన స్త్రీ అందాలు

- మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మెన్ శ్రీ కాసం నమశ్శివాయ

నవతెలంగాణ-సిటీబ్యూరో



చీర కట్టులోన స్త్రీ అందాలు అని మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మెన్ శ్రీ కాసం నమశ్శివాయ అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ వారు హైదరాబాద్ నగరం లో ప్రప్రథమంగా సారీ డాపింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం హైదరాబాద్ వనస్థలిపురం లోని మాంగళ్య షాపింగ్ మాల్ లో చెన్నై నగరానికి చెందిన ప్రముఖ సారీ డాపర్ కవిత ఆధ్వర్యంలో మొదటి సారిగా కార్యక్రమం నిర్వహించారు . చీర కట్టు ఎలా ఉండాలి ఆ నైపుణ్యం సవివరంగా వివరించారు ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరం లోని ఫ్యాషన్ డిజైనర్స్ బ్యూటీ పార్లర్ ప్రముఖులు ఎంతో ఆసక్తిగా గమనించి మాంగళ్య యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాంగళ్యషాపింగ్ మాల్ చైర్మెన్ శ్రీ కాసం నమశ్శివాయ డైరెక్టర్‌లు కాసం శివ,పుల్లూరు అరుణ్ ,తోనూపునూరి అరుణ్ తదితరులు పాల్గొన్నారు



పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలి

- బీజేపీ యువమోర్చ నాయకులు శేషాంక్ సింగ్.

నవతెలంగాణ - జవహర్ నగర్

పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాదించాలని బీజేపీ యువ మోర్చా సీనియర్ నాయకులు శేషాంక్ సింగ్ అన్నారు. ఈ నెల 21నుంచి పదవ తరగతి బోర్డు ఎగ్జామ్స్ ప్రారంభం అవుతున్న సందర్భంగా గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాజీనగర్ ఫైరింగ్ రేంజ్ వద్ద ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుద్ధి గ్రహణ శక్తి పెంచడానికి మెడిటేషన్, యోగ చేయడం ఎంతో అవసరం అన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాల పేరు, తల్లిదండ్రులు, గురువుల కు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ బీజేపీ యువ మోర్చా సీనియర్ నాయకులు రామకష్ణ నాయుడు, బీజేవైఎం సీనియర్ నాయకులు తులసిరామ్, జితేందర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



కాలనీలలో కాప్రా కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-కార్పొరేటర్

కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి డివిజన్‌లోని ఆర్ కె ఎన్ క్లేవ్, రెడ్డి కాలనీలలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. అయా కాలనీల ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రధాన సమస్యలు తాగునీరు, భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కొషిచేస్తానని.. అనంతరం నూతన రోడ్ల నిర్మాణం పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చారు. నిరంతరం ప్రజాసేవకు తాపత్రయపడతానని తెలిపారు. ఆర్‌కే ఎన్ క్లేవ్, రెడ్డి కాలనీల ప్రతినిధులు కార్పొరేటర్‌కు ధన్యవా దములు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు తక్షణమే వేతనాలివ్వాలి

నవతెలంగాణ - పోచారం



పోచారం మున్సిపాలిటీలో విలీనమై గ్రామపంచాయతీ కార్మికులకు రెండు నెలల మున్సిపల్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య, ఎన్ సబిత కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పోచారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలీనం చేసినప్పటి నుంచి గ్రామ పంచాయతీల వేతనాలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అలాగే సబ్బులు, కొబ్బరి నూనె, బట్టలు, చెప్పులుకు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ప్రతి నెలా ఐదో తేదీ లోపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల నుంచి వేతనాలు రాకపోతే ఏం తింటారు.. పిల్లలకి స్కూలు ఫీజులు, డ్వాక్రా గ్రూపులలో అప్పులు ఎలా కడతారు.. కుటుంబం పోషణ ఇలా గడుస్తుందని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల చట్టం ప్రకారం ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఈ ఎస్ఐ, పి ఎఫ్ పండగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు చలగొండ అరుణ, బిక్షపతి, జంగయ్య, కష్ణ, కనకరాజు, లింగం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు

మంచినీటి సమస్యను పరిష్కరించండి

కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు వినతిపత్రం అందజేసిన ఎలిఫాంట్ కాలనీ వాసులు



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ ,గోధుమకుంటా గ్రామంలోని ఎలిఫాంట్ కాలనీలో గత రెండు సంవత్సరాల నుంచి మంజీరా నీరు రావడం లేదని, కాలనీకి మంజీరా నీరు వచ్చేలా చూడాలని కోరుతూ కాలనీ వాసులు కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి మంచి నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంచాల కిరణ్, జ్యోతి, ప్రవీణ్ కుమార్, ఎలాసాని బాలరాజ్ యాదవ్ ,ప్రవీణ్ ,కోటేశ్వరరావు ,శ్రీనివాస్ ,సునీల్ , హరీష్ ,నాగ భూషణ్ , వనజ ,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షల వెల్లువ





నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం వారి నివాసంలో మాజీ కార్పొరేటర్ గోళ్ళూరి అంజన్న, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి కనకరాజ్ గౌడ్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్ రావు నగర్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, సీనియర్ నాయకుడు వంజరి ప్రవీణ్ కరిపే తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను బీఆర్‌ఎస్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ అధ్యక్షుడు కరిపే ప్రవీణ్ వంజరి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

శామీర్ పేట నూతన ఎంఈఓగా ఆర్. కమలాకర్



నవతెలంగాణ-శామీర్ పేట

ఉమ్మడి శామీర్ పేట మండల నూతన ఎంఈఓగా బొమ్మరాసిపేట జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ ఆఫీసర్ ఆర్ కమలాకర్ నియామకమయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారిచేశారు. అయితే గత నెల 28న శామీర్ పేట ఎంఈఓ జె వసంతకుమారి పదవి విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడిన సంగతి తెలిసిందే.

'దోమల నివారణకు చర్యలు చేపట్టాలి'



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట జర్నలిస్ట్ కాలనీ సమీపంలో బస్తీలలో దోమల బెడద తీవ్రంగా ఉందని నివారించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి గురువారం వినతిపత్రం అందించారు. స్థానిక చెరువులు కుంటలలో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్కలను తొలగించాలని, అలాగే బస్తీలలో ఫాగింగ్ చేయించాలని ఆయన కోరారు. ప్రధానంగా మున్సిపల్ ఆఫీసు నుండి శ్రీ రామ కుంట పార్కుకొరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. జర్నలిస్టు కాలనీ బండారి లేఔట్ లో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున మరోసారి పిచికారీ చేయించాలన్నారు.

శక్తి ద పవర్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో ఉమెన్స్ డే



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాజేశ్వరి వృద్ధుల అనాథ ఆశ్రమంలో గురువారం శక్తి ద పవర్ అఫ్ ఉమెన్స్ (ఎంపవరింగ్ యూత్ అండ్ ఉమెన్ విత్ ఎడ్యుకేషన్) వారి ఆధ్వర్యంలో ఉమెన్స్ వేడుకలు నిర్వహించారు.కాంగ్రెస్ ఆల్విన్ కాలనీ డివిజన్ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్.. వృద్ధాశ్రమంలో అందరితో కలిసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం శక్తి' ద పవర్ అఫ్ ఉమెన్స్ వారు, పట్వారి శశిధర్ కలిసి వారికి పండ్లు, బిస్కెట్స్‌రైస్ బాగ్స్ అందజేశారు. దుర్గ,సుజాత,వెంకట్ లక్ష్మి, రాధికా, శాంతి, లావణ్య, అపర్ణ,నైమ, యాదమ్మా, నిరూప, మీనా, శాంతబాయ్, ఉష, బాబ్జి, నర్సింహా,రాజన్న,సతీష్,అర్జున్,రామన్న,వీరేష్ మరియు టీం పట్వారీ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే...





నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) 129 డివిజన్ కార్యదర్శి పసుల అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారం 129 డివిజన్ లోని సమస్యలపై ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పసుల అంజయ్య మాట్లాడుతూ.. డివిజన్ లో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, రైతు భరోసా, పంట రుణాలు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డివిజన్ లో మురికి కాలువలు, సీసీ రోడ్లు, వీధిలైట్లు సరిగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి డివిజన్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ 129 డివిజన్ కార్యదర్శులు పసుల అంజయ్య , ఆర్ స్వాతి , కృష్ణ సాయి , మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను త్వరితగతిన పూర్తి చేయండి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నిజాంపేట్‌లో వార్డు ఆఫీసర్లతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై ఆరా



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అనధికారిక లేఔట్ల ప్లాట్స్ క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు ఆఫీసర్లతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై ఆరా తీసి , ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ ఏ విధంగా చేస్తున్నారు అని తెలుసుకున్నారు. మొబైల్ యాప్ ద్వారా అప్లికేషన్ నెంబరు , పేరు , మొబైల్ నెంబర్ మొదలగు వివరాల ద్వారా ఇన్‌స్పెక్షన్ చేసి రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ కాపీలను వీలైనంత తొందరగా అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాని వలన ప్రజల్లో నమ్మకం కలిగి మిగితా వారు కూడా రుసుము చెల్లించడానికి ముందుకొచ్చే అవాకారం ఉందన్నారు. అప్లికేషన్లను క్రమబద్ధమైన మాపింగ్ చేసి ప్రతి ఒక్క వార్డు ఆఫీసర్ నిర్ణీత వ్యవధిలో నిర్దేశించిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్టయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందని దరఖాస్తుదారులకు వార్డు ఆఫీసర్లు తెలపాలని, ఆ దిశగా జిల్లాలోని మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ క్రమంలో ప్రతిరోజు క్రమబద్ధీకరణ దరఖాస్తుల పై పురోగతిని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు కారణాలు తెలపాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ లో వచ్చే ఫిర్యాదులను కూడా పరిగణలోకి తీసుకొని సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాంకేతిక సమస్యలద్వారా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలు చేసే ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కార్పొరేషన్ పరిధిలో యూనిఫామ్ టాక్స్ పద్ధతిని అమలు పర్చడానికి కృషి చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కంచె నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ షబ్బీర్ అలీ , బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్, మున్సిపల్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ కాస్ట్, అధిక వడ్డీ సమస్యలను పరిష్కరించండి

- కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌కు అసోసియేషన్ ప్రతినిధుల వినతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ కాలనీ ఫోర్త్ ఫేజ్ వెంచర్ 2కు సంబంధించి ఫైనల్ కాస్ట్, అధిక వడ్డీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌ను జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 లోని ఫ్లాట్స్‌కు హౌసింగ్ బోర్డ్ అధికారులు ఫైనల్ కాస్ట్ విషయంలో అధికంగా రేటు నిర్ణయిస్తున్నారన్నారు. అదే విధంగా వడ్డీ సైతం అధికంగా వేస్తూ తమను ఆందోళనకు గురి చేస్తున్నారని చెప్పారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో బండి రమేష్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను మంత్రి దష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డి దష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.దీంతో నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల సౌకర్యార్థం సరిహద్దు బోర్డులు ఏర్పాటు

- ఏసీపీ హనుమంతరావు, సీఐ నరసింహ రాజు



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ప్రజల సౌకర్యార్థం, స్థానికులకు పోలీస్ స్టేషన్ సరిహద్దుల గురించి అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో బాలానగర్ సీఐ నరసింహ రాజు పోలీసు స్టేషన్ అధికార పరిధిలను సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం బాలానగర్ ఏసీపీ హనుమంతరావు చేతుల మీదుగా ఐడీపీఎల్ కూడలిలో ఈ బోర్డులను ప్రజల అవసరార్థం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాంనారాయణ, సరళ, ఏఎస్ఐ ప్రభాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ "ఈ బోర్డుల ఏర్పాటుతో ప్రజలకు తమ ప్రాంతం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలుస్తుందని, దీనివల్ల వారు తమ సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ "ప్రజలకు పోలీస్ స్టేషన్ పరిధి గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. దీనివల్ల నేరాలు తగ్గుతాయని, ప్రజలకు పోలీసులకు మధ్య సంబంధాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు. ఈ బోర్డులపై పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, వీధులు, కూడళ్ల వివరాలతోపాటు పోలీస్ స్టేషన్, అధికారుల ఫోన్ నెంబర్లు సమకూర్చమన్నారు. ఈ బోర్డులు చాలా ఉపయోగకరంగా ఉంటాయని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య



నవతెలంగాణ - బాలానగర్

మనస్తాపానికి గురైన వృద్ధుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి రాజుకాలనీలో చోటు చేసుకుంది. బాలానగర్ సీఐ టి. నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జుల కేశవరావుకు(65)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గుజ్జుల సతీష్ కుమార్ ప్రయివేటు కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. అయితే కేశవ రావు కొన్నేండ్ల క్రితం ప్రయివేటు కంపెనీలో పని చేస్తుండగా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనలో పాక్షికంగా కంటి చూపు కోల్పోయాడు. ఇటీవల మెహదీపట్నం సరోజిని ఆస్పత్రికి తీసుకు వెళ్లి ఆపరేషన్ చేయించారు. మరి కొన్ని రోజుల తరువాత పక్షవాతానికి గురై చూపు పూర్తిగా పోయింది. కేశవరావు మనోవేదనకు గురి అవుతూ భార్యతో తన బాధను చెప్పుకుంటూ ఉండే వాడు. తండ్రి బాధను చూడలేక మరోసారి సరోజిని ఆస్పత్రి వైద్యులకు కొడుకు చూపించగా రెండో కన్ను ఆప రేషన్ చేస్తే 25 శాతం చూపు రావచ్చని వైద్యులు సలహా ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో ఆపరేషన్ చేయిద్దామనుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సతీష్ డ్యూటీకి వెళ్ళి పోయాడు. భార్య కూడా పని మీద బయటకు వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరని భావించిన కేశవరావు సాయంత్రం 5 గంటల సమ యంలో ప్లాస్టిక్ తాడుతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటి నుంచి వచ్చిన భార్య.. భర్త ఎంతకు తలుపు తీయక పోవడం కిటికీలోంచి చూసింది. ఫ్యాను కు విగత జీవిగా వేలాడుతూ కనిపించాడు. ఆమె రోదిస్తూనే కుమారుడికి సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న అతను బాలానగర్ పోలీసులకు సమాచారం అందించాడు. సతీష్ ఫిర్యాదు మేరకు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు.. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



నవతెలంగాణ - కూకట్ పల్లి/ బాలానగర్

వివేకానంద డివిజన్ లో, పలు అభివృద్ధి పనుల కోసం, నిధులు కేటాయించాలని కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను, తోటి కార్పొరేటర్లతో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు కలిసి వినతి పత్రం అందించారు. ఇక మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలపై కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ లో ఉన్న స్మశాన వాటిక నిధులు మంజూరు చేయాలని, అదేవిధంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్, నాగార్జున కాలనీ, భరత్ నగర్ కాలనీ లోని ఎల్ఐజీ తదితర బస్తీల్లో కాలనీలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అత్యవసరంగా ఉండే అభివృద్ధి పనులకు నిధులు ముందుగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



నవతెలంగాణ - బాలానగర్

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడానికి వారి విప్లవాత్మక భావజాలాన్ని గుర్తుచేసేందుకు ఎస్ఎఫ్ఐ కూకట్ పల్లి మండలం ఆధ్వర్యంలో గురువారంభారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువకులు భారీగా పాల్గొని జైభగత్ సింగ్ నినాదాలతో ర్యాలీ కదన భేరి మోగించింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ "భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు చూపిన త్యాగాలు, వారు చూపిన మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయం మైనదన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే విధంగా వీరి స్ఫూర్తిని మనం అనుసరించాలన్నారు.ఈ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ కూకట్‌పల్లి మండల అధ్యక్షుడు నందీశ్వర్, కార్యదర్శి సుబ్బు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, ప్రయివేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఎస్ఎఫ్ఐ కట్టుబడి ఉంటుందని వారు స్పష్టం చేశారు. విద్యార్థులు సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాజవాదం సిద్ధాంతాలను పాటిస్తూ సమాజ మార్పు కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత, జిల్లా కమిటీ సభ్యులు శ్రీమాన్, కూకట్ పల్లి మండల్ కమిటీ సభ్యులు మహేందర్, ఆనంద్, మహేష్, ఆశిష్ రక్షిత్, మహేశ్వర్, వాసు, ప్రణయ్, కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు వేసినందుకు బస్తీ వాసుల ధన్యవాదాలు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ బస్టాండ్ చౌరస్తా నుంచి దయానందనగర్ వెళ్లే మార్గంలో నూతనంగా సీసీ రోడ్డు వేసినందుకు ఎమ్మెల్యే కె.పి వివేకానందకు, స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి, సంబంధిత అధికారులకు బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానికులు మాట్లాడుతూ... గత 4 సంవత్సరాలు నుంచి ఈ రోడ్డు వేయడానికి కొంతమంది అడ్డంకులు సృష్టించారని. ఎట్టకేలకు నాయకుల చొరవతో... అధికారుల సహకారంతో సీసీ రోడ్డును ఏర్పాటు చేసుకున్నట్టు జై శ్రీరామ్ నగర్, దయానందనగర్, పాండుబస్తీ, సంతోష్ నగర్, రావుల స్వామి నగర్ తదితర బస్తీ వాసులు హర్షం వ్యక్తంచేశారు. రోడ్డు ఏర్పాటు విషయంలో స్థానికులందరూ ఐకమత్యంగా ఉండి సీసీ రోడ్డును ఏవిధంగా అయితే సాధించుకున్నామో... అదేవిధంగా అండర్ గ్రౌండ్ సమస్య ను కూడా పరిష్కరించుకోవాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

'ప్రగతి నగర్ స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించండి'



నవతెలంగాణ-నిజాంపేట్

ప్రగతి నగర్ లో స్మశాన వాటికలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ అధ్యక్షుడు ఉప్పు జస్వంత్ గురువారం కమిషనర్ సాబీర్ అలీకి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు స్మశాన వాటిక సమస్యలపై జస్వంత్ వివరించారు. స్మశాన వాటికలో నోటీసు బోర్డులు. అంత్యక్రియల చార్జీల గురించి సమాచారం బోర్డు. నీటి పనులు. వాచ్ మెన్. అంత్యక్రి యలకు సంబంధించిన సంప్రదింపు ఫోన్ నెంబర్లు. మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఏర్పాట్లు చేయాలని కోరారు. స్మశాన వాటికలో సమస్యలు ఏవి ఉత్పన్నమైనా మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ జయరాజును సంప్రదించాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ ని కలిసిన వారిలో డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సాయికుమార్, ఎలీషా, మణికంఠ సాయి, మహేష్ ఉన్నారు.

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి

- హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భారత దేశ స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్డు లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థులకు పరీక్షల సన్నదం కోసం పరీక్షల కిట్ (జామెట్రీ బాక్స్, ప్యాడ్, పెన్నులు) ను , క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె మాట్లాడుతూ మన్యం ప్రజలలో విప్లవ బీజాలు నాటి ప్రజలను చైతన్య పరిచి స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనేలా చైతన్య పరిచిన మహానుభావుడు అల్లూరి అని అన్నారు. పరీక్షల కిట్ అందించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. అల్లూరి సీతారామరాజు 22 ఏండ్ల చిన్న వయసుల్లోనే మన్యం ప్రజలను కలుపుకుని బ్రిటీష పాలనను ఎదిరించిన గొప్ప యోధుడన్నారు. సాయుధ పోరాటం ద్వారా మాత్రమే భారతదేశానికి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి లభిస్తుందని నమ్మి తెల్లదొరల పైకి విల్లు ఎక్కుపెట్టిన ధీరుడన్నారు. అతి చిన్ని వయసులోనే బ్రిటిషర్లను 2 ఏండ్లు కంటిమీద కునుకు లేకుండా చేసి గడగడలాడించిన అల్లూరిని తుపాకులతో కాల్చి చంపుతున్నా వందేమాతరం అనే నినదించిన గొప్ప మహానీయుడు అన్నారు. అయన జీవితం ఎంతో మందికి ఆదర్శప్రాయం అని అన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి, ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్పొరేటర్.. విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ సాయి కుమార్ , వారి సిబ్బంది క్షత్రియ సేవ సమితి జాయింట్ సెక్రటరీ భూపతిరాజు, రామకృష్ణంరాజు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు సుధీర్ వర్మ, సుధాకర్ రాజు, ప్రశాంత్ వర్మ, గౌతం వర్మ, శివాజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా ఆమెను వారి నివాసంలో, కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద నగర్ డివిజన్ మహిళా నాయకురాళ్ల తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కూల్చిన స్థలం కబ్జాకు యత్నం

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్,



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

బాలానగర్ కో- ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పేజ్ -2 గాంధీనగర్ పారిశ్రామిక వాడలో 400 గజాల స్థలంలో ఉన్న " ఒహర్ హెడ్ వాటర్ ట్యాంక్ కూల్చిన స్థలమును బోర్డులో ఉన్న కొందరు సభ్యులు మరికొందరితో కుమ్మక్కై స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు వి హరినాధరావు ఆరోపించారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్ లోని ఏఐటీయుసీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ గతంలో కూడా పారిశ్రామిక వాడలో కార్మికుల ప్రయోజనార్థం మౌలిక సదుపాయాలు అయినటువంటి హాస్పిటల్ పార్క్ కు వదిలిన 9.5 ఎకరాల స్థలంలో అప్పటి చైర్మన్లు, బోర్డ్ సభ్యులు అందరు కలిసి ప్లాట్ నెంబర్ 114 నుంచి ప్లాట్ నెంబర్ 132, ఒక ప్రయివేటు కాలేజీ వారికి అప్పనంగా కేటాయించినట్టు తెలిపారు. పత్రికా ముఖంగా బాలానగర్ సీఐ , చైర్మన్ , సంబంధిత అధికారులకు తెలియజేస్తూ.. 400 గజాల స్థలము అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కార్మికుల అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలో సుమారు 20,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని.. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కోరారు.



బాపూజీ పాఠశాలలో ఘనంగా హెూలీ సంబరాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

జగద్గిరిగుట్ట పరిధి వెంకటేశ్వర నగర్‌లో గల బాపూజీ హై స్కూల్‌లో హెూలీ పండుగ పురస్కరించుకొని గురువారం పాఠశాల గ్రౌండ్స్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు హెూలీ సంబరాల్లో మునిగితేలారు.రంగురంగుల కలర్లు పూసుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి పండగ విశిష్టత తెలియజేసేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మన తెలుగు పండుగల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులను అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, రేణుక, జగదీష్, సదానందం, సత్యనారాయణ,కరుణాకర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాస్ క్రౌన్ వేదికగా స్కై బ్లాస్ట్ పేరుతో హెూలీ సంబురాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అత్యంత ఎత్తైన భవనంపై హెూలీ జరుపుకోవడం అంటే అదొక విభిన్నమైన అనుభూతి. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన టవర్ కోకాపేట్‌లోని 60 అంతస్తుల సాస్ క్రౌన్ వేదికగా "స్కై బ్లాస్ట్" పేరుతో హైదరాబాద్‌లోనే అత్యున్నత హెూలీ వేడుక ఘనంగా జరిగింది. హెూలీ అంటే సాధారణంగా గ్రౌండ్ లెవల్‌లో జరుపుకునే పండుగ కానీ ఈసారి సాస్ క్రౌన్ ఈ సంబరాలను ఆకాశంలో జరిపి అందరికీ కొత్త అనుభూతిని అందించింది. టాప్ ఫ్లోర్, స్కై డెక్, ఈవెంట్‌లో ప్రతి అంశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం నేల మీదే కాదు, ఆకాశంలోనూ హెూలీ జరుపుకోవచ్చు అని నిరూపించిన వేడుక ఇది. సాస్ క్రౌన్ పై "స్కై బ్లాస్ట్ హెూలీ" మరపురాని అనుభూతిని అందించింది. సాస్ క్రౌన్ సిటీ వ్యూ తో పాటు, లగ్జరీ ఫెస్టివల్, ప్రయివేటు పార్టీ అనుభూతి అందరికీ కొత్త అనుభూతిని అందించాయి. హెూలీ అంటే రంగులు, సంగీతం, ఉత్సాహం.. కానీ ఈసారి ఆకాశాన్ని తాకేలా హెూలీ సెలబ్రేట్ చేసింది సాస్ క్రియన్. రంగుల మెరుపులతో హైదరాబాద్ స్కైలైన్ మిలమిల మెరిసిపోయింది.

ఈసీఐఎల్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతి పట్ల సీఎండీ సానుకూలం

- ఎంపీ,ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈసీఐఎల్ సీఎండీని కలిసిన వాకర్స్ అసోసియేషన్



నవతెలంగాణ - చర్లపల్లి

Take notice that the above named Plaintiff filed the above suit against you and others for Partition & Separate Possession and for Declaration to declare the Development Agreement cum General Power of Attorney dated 07.06.2019, bearing document no. 6204 of 2019, is null and void not binding on the plaintiff and for correction of revenue records, in respect of the land admeasuring Ac.1-31 Gts, in Sy.Nos.391 Situated at Puppalguda Village, Gandipet Mandal (earlier Rajendranagar Mandal), Ranga Reddy District. The above suit is stand posted to 01.04.2025 for your appearance. Therefore, you are directed to appear in person or through advocate on 01.04.2025 at 10:30 AM, before this Hon'ble Court. Failing which, the matter will be heard and decided in your absence by setting you ex-parte.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s.M.Mahesh, G.Priyanka &Rajnandani Advocates
Office at Plot No.332-B. Road No.82, Jublieehills, Hyderabad. Mobile : 9391019754
COUNSEL FOR THE PLAINTIFFS.

ఉస్మానియా ఆస్పత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉస్మానియా ఆస్పత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు నెఫ్రాలజీ విభాగం అధ్వర్యంలో నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెడెంట్ డాక్టర్ రాకేష్ సహాయ, నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ, విభాగం వైద్యులు, నెఫ్రాలజీ విభాగం ఆర్‌ఎంఓలు, నర్సులు, ఇతర వైద్యులతో కలిసి ఆస్పత్రి ఓపీ భవనం నుండి సూపరింటెడెంట్ ఛాంబర్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా హాజరైన యువ వైద్యులు, ప్రజా చైతన్య వాక్, కిడ్నీ క్విజ్ నిర్వహించారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు, ఇంటర్న్ విద్యార్థులకు కిడ్నీ సమస్యల పై అవగాహన కల్పించారు. భారతదేశంలో కిడ్నీ వ్యాధి చాలా సాధారణమైందని సూపరింటెడెంట్ డాక్టర్ రాకేష్ సహాయ అన్నారు. ఏటా దాదాపు 2 లక్షల మంది భారతీయులు కిడ్నీ వైఫల్యానికి గురవుతున్నారన్నారు. మూత్రపిండాల వ్యాధికి ప్రమాద కారకాలు మధుమేహం, హైపర్‌టెన్షన్, పెయిన్ కిల్లర్స్ వాడకం, స్థానిక ఔషధాల వాడకమే ప్రధాన కారణమని చెప్పారు.ముందస్తుగా గుర్తించడానికి పరీక్ష అవసరమన్నారు. మూత్ర పిండాల పనితీరును అంచనా వేయడానికి యూరిన్ అల్బుమిన్, క్రియేటినిన్ అని పిలువబడే రక్త పరీక్ష వంటి సాధారణ పరీక్షలను ఉపయోగించవచ్చునని సూచించారు.

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ, బడంగ్‌పేట్



విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప అన్నారు. గురువారం రిథమ్, లార్డ్స్ విద్యా సంస్థలు మొదలుకొని 20 సంవత్సరాలు ముగించుకున్న సందర్భంగా లార్డ్స్ యాజమాన్యం చైర్మెన్ సిద్ధల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డి, లార్డ్స్ డైరెక్టర్ శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైకాలజిస్ట్ సిహెచ్ శేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలను పెంచే విధానం గురించి తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధాకర్ బండారి మాట్లాడుతూ పిల్లలకు మంచి పౌష్టికారం అందిచాలని మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉంచేలా చూడాలని సూచించారు. లార్డ్స్ చైర్మెన్ సిద్ధల బీరప్ప మాట్లాడుతూ స్కూల్ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే 300 మంది విద్యార్థులకు పై అడ్మిషన్స్ అయ్యాయని, లార్డ్స్ స్కూల్ ఎంచుకున్నందుకు అందరి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీల సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ,బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న పలు నూతన కాలనీలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ బాలాపూర్ మండలం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతికి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శేఖర్ యాదవ్ కాలనీ వాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కొత్త కాలనీలో రోడ్లు, డ్రయినేజీలు, విద్యుత్, మంచినీటి సమస్యలు ఉన్నాయని వాటినీ పరిష్కారం చేసి ప్రజలను ఆదుకోవాలన్నారు. అదే విధంగా పలు కాలనీలో పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆట స్థలాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వటం జరిగిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కారం చేయటంలో అధికారులు పట్టించుకోవటం లేదని మండి పడ్డారు. వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని కాలనీల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు యాదగిరి, అనురాధ, శశికళ, అమృత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

అక్షిత ఫౌండేషన్ చైర్మెన్ రాపాక సన్నీ కుమార్‌కు మాతృ వియోగం



నవతెలంగాణ, బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామానికి చెందిన అక్షిత ఫౌండేషన్ చైర్మన్ రాపాక సన్నీ కుమార్ కు గురువారం మాతృ వియోగం జరిగింది. అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు పేద ప్రజలకు మానవతా హృదయంతో సేవ చేస్తున్న సన్నీ కుమార్ తల్లి రాపాక విజయ లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సన్నీ కుమార్‌కు మాతృ వియోగం జరుగటంతో పలువురు విజయ లక్ష్మి మృత దేహాన్నికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆయన కుటుంబానికి ఓదార్చి సంతాపం ప్రకటించారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ, బడంగ్‌పేట్



ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ అర్చిడ్ కాలనీలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో సీసీ కెమరాల పాత్ర ఎంతో కీలకమైనట్లు తెలిపారు. దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ఎస్సై సైదులు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, సీసీ కెమెరాల దాత సయ్యద్ అఫ్జల్ అహ్మద్, కమిటీ సభ్యులు సయ్యద్ శకీబ్, మహమ్మద్ కలిమ్, మోయిజ్, నాయిం, అహమ్మద్, అనీస్, ఖయ్యుం ఇగ్బాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా 5కే రన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్బీనగర్‌లోని గ్లెని గల్స్ అవేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించినట్టు హాస్పిటల్ సీఓఓ డాక్టర్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి లింగోజిగూడ కార్పొరేటర్ శ్రీ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 5కే జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ మనిషికి కిడ్నీలు చాలా ముఖ్యమైనవి అని వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటే మనిషికి జీవితం సాఫీగా సాగు తుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. యూరాలజీ డాక్టర్ నవీన్ పూల నెఫ్రాలజీ డాక్టర్ ప్రభు చరణ్, ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యులు వారు మాట్లాడు తూ మనిషి ముఖ్యమైన అవయాలలో కిడ్నీలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. కిడ్నీ ప్రధానమైన పని రక్తాన్ని శుద్ధి చేసి మూత్రాన్ని తయారు చేయడం ఇలా రక్తంలోనే వ్యర్థాలను అదనపు ద్రవాలను బయటికి పంపు తాయని ఇదొక్కటే కాదు రకరకాలుగా కిడ్నీలు మనకు మేలు చేస్తాయన్నారు. ఆస్పత్రి సీఓఓ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా చూసుకోవాలని కిడ్నీ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయని సమస్యలను నివారించడానికి అప్పుడప్పుడు హెల్త్ చెకప్ చేసుకోవాలని సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి నందు రూ.999లకే కిడ్నీ హెల్త్ ప్యాకేజీని ప్రవేశ పెటడం జరిగిందని డయాబెటిస్, బీపీ, కాలేయ వ్యాధులను 40 ఏండ్లు పైబడిన వారు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. హాస్పటల్ డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య నిత్య ప్రయోగ శిలి, విలక్షణ దర్శకుడు

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోల్



సినీ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య నిత్య ప్రయోగ శిలి విలక్షణ దర్శకుడని ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఫెడరేషన్ జాతీయ నిర్వాహక అధ్యక్షుడు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీని వాసగుప్త అన్నారు. మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందుకున్న సందర్భంగా నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం డాక్టర్ పీసీ ఆదిత్యను శ్రీనివాసగుప్త ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ నిత్య ప్రయోగశిలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్యను మరో అత్యున్నత పురస్కారం వరించిందన్నారు. భువనేశ్వర్ ఒడిస్సా కు చెందిన ప్రముఖ సేవా సంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వారు దర్శకుడు పీసీ ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి మహా త్మా గాంధీ స్మారక విశిష్ట వ్యక్తిగా అవార్డును ప్రకటించారని ఈ విశిష్ట పురస్కారాన్ని ఆదిత్యకు సత్కరించి మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందజేసి అభినందించారు. గత 30 ఏండ్లుగా సినీ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి ఎందరో నూతన కళాకారు లను ప్రోత్సహిస్తున్నటువంటి ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అందించి ఎన్నో అవార్డులు అందుకోవాలన్నారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్న ఆదిత్య స్పందిస్తూ ఆ విశ్రాంతి సినీ ప్రయాణంలో మరికొంతమంది నూతన నటీనటుల్ని సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ దిల్‌సుఖ్‌నగర్



యువజన కాంగ్రెస్ నేత, ప్రజా సేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆర్‌కెపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ నేతలు శ్రేణులు ప్రముఖులు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆర్‌కెపురం డివిజన్ వాసులు తనకు ఆశిస్సులు అందజేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నేతలే కాకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం తన అదృష్టమన్నారు. సేవాభావంతో డివిజన్‌లో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పలువురి ఆశిస్సులు అందాయని ఆయన అభిప్రాయపడ్డారు. చిలుక ఉపేందర్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పీసీసీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డి, గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఆర్ కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, డైరెక్టర్‌లు రాజు నాయక్, శ్రీశైలం, గట్ల రవీంద్ర, తలాటి రమేష్, లక్ష్మి, జ్ఞానేశ్వర్ యాదవ్, కిరణ్ కుమార్, పెద్దపూర సైదులు, శేఖర్ ముదిరాజ్, శ్రీధర్, భవానీ ప్రసాద్, శ్రవణ్, అశోక్, విజయ్ రేణుక, సంతోష తదితరులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఉపేందర్ రెడ్డి తన జన్మదిన వేడుకలు సందర్భంగా పలువురు మహిళలకు ఆయన చీరెలు పంపిణీ చేశారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్‌పెడుతున్న షీ టీమ్స్

● ఒక్క నెలలో 187 మంది పోకిరీల ఆటకట్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో



చుట్టూ సీసీ కెమెరాలు, హై టెక్నాలజీ, ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్లు ఉన్నా.. పోకిరీల ఆగడాలు తగ్గడం లేదు.. అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే షీ బృందాలు పట్టుకుంటాయని భయంవున్నా ఆకతాయిల్లో నిర్లక్ష్యం ధోరణే కన్పిస్తోంది. దాంతో మహిళలు, అమ్మాయిలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ఒకటికి పది సార్లు ఆలోచిస్తున్నారు. కొందరు పోకిరీలు రోడ్లు, బస్టాండ్‌ల వద్ద వేధింపులకు గురిచేస్తుంటే, ఇంకొందరు కాలేజీలు, పనిచేసే కార్యాలయ్యాల్లో రెచ్చిపోతున్నారు. చివరకు దేవాలయాల వద్ద కూడా వదలడం లేదు. వెకిలిచేష్టలకు పాల్పడుతున్నారు. పోకిరీల ఆగడాలను కట్టడి చేసేందుకు రాచకొండ షీ బృందాలు ప్రత్యేక నిఘా వేశాయి. ఈ క్రమంలో గత నెలరోజుల్లోనే 187 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు.

రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో..

పోకిరీల ఆగడాలు అధికం కావడంతో బాధితులు కొందరు రాచకొండ షీ బృందాలను సంప్రదించారు. మరికొందరు సోషల్‌మీడియా ద్వారా 85తోపాటు ఫోన్ల ద్వారా వేధింపులకు పాల్పడిన 28మందిపై బాధితులు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా నేరుగా 128మందిపై బాధితులు షీ బృందాలకు ఫిర్యాదు చేశారు. గత నెల 1 నుంచి 28 వరకు 241 పిర్యాదులు రావడంతో రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 187 (మేజర్స్-122 ,మైనర్స్-65) మందిని షీ టీమ్స్ పట్టుకున్నాయి. ఈవ్ టీజర్లకు రాచకొండ క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో 108 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామని విమెన్ సేఫ్టీ వింగ్ డి.సి.పి శ్రీమతి టి. ఉషా విశ్వనాథ్ తెలిపారు. 14మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 71 పెట్టీ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రేమ, పెండ్లి పేరుతో మోసం చేసిన యువకుడు

ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న యువతికి అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చనువు పెంచుకున్నాడు. ఆ తర్వాత యువతి పెళ్లి చేసుకోమని అడిగితే, అతని కుటుంబ సభ్యులు ఒప్పుకోవడం లేదని, దాంతోను తాను పెండ్లీచేసుకోవడం సాధ్యంకాదని చెప్పాడు. అంతేకాకుండా ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. చివరకు మోస పోయానని గ్రహించిన యువతి షీ బృందాలకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన షీ బృందాలు నిందితునిపై క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

పెండ్లి చేసుకోవాలంటూ తోటి ఉద్యోగిణిని వేధింస్తున్న వ్యక్తి అరెస్టు

ఓ అమ్మాయి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీం లీడర్‌గా పనిచేస్తోంది. ఆమెతో పాటు పనిచేసే ఓ యువకుడు ఉద్యోగపరంగా ఏదైనా ప్రాబ్లం వచ్చినప్పుడు తరచుగా యువతిని అడిగేవాడు. ఇదే అదనుగా బావించిన నిందితుడు ఆమెకు ఫోన్ కాల్స్ చేసి తాను ప్రేమిస్తున్నానంటూ చెప్పాడు. యువతి నిరాకరించినా పెండ్లీ చేసుకుంటానంటూ ఇబ్బందులకు గురిచేశాడు. బాధితురాలు ఎంతచెప్పినా పట్టించుకోలేదు. రోజురోజుకు వేధింపులు అధికం కావడంతో బాధితురాలు షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. అన్ని కోణాల్లో విచారించిన పోలీసులు నిందితునిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, జైలుకు పంపించారు.

ఫోన్ మాట్లాడకపోతే ఇంటి దగ్గరికి వచ్చి గోడవచేస్తా...

ఒక మహిళకు అదే ప్రాంతంలో నివసించే ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడినది. తరచుగా ఆమెతో మాట్లాడుతుండేవాడు. చనువు పెంచుకుని ఆమెఫోన్ నెంబర్ సేకరించాడు. ఆ తర్వాత ఇబ్బందికరంగా మాట్లాడడంతో సదురు మహిళ దూరంపెట్టింది. దాంతో కోపం పెంచుకున్న నిందితుడు ఆమెను అసభ్యంగా దూషిస్తూ, మానసికంగా వేధించడం మొదలు పెట్టాడు. అంతటితో ఆగకుండా ఆమె ఫోన్ మాట్లాడకపోతే ఇంటి దగ్గరికి వచ్చి గొడవ చేస్తానని బెదిరించేవాడు. భయాందోళనకు గురైన బాధితురాలు షీ బృందాల దృష్టికి తీసుకెళ్లింది. కేసునమోదుచేసుకున్న వారు నిందితుడిని జైలుకు పంపించారు.

పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ గత నెల 1 నుండి 28 వరకు 98 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. దాదాపు 17970 మందికి మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్సు నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (12) మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించడం జరిగింది.

ముందుకొచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- రాచకొండ సీపీ జీ. సుధీర్ బాబు

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని రాచకొండ సీపీ ఐజీ సుధీర్ బాబు తెలిపారు. బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సీపీ తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, వారిని,వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని వివరించారు. సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

నకిలీ స్వదేశీ కరెన్సీ తయారు ముఠా అరెస్ట్..

ఏడుగురి అరెస్టు, రూ.11 లక్షల 50వేల ఫేక్ నగదు స్వాధీనం, ఒక కారు, 7 సెల్ ఫోన్లు, 4 లక్షల ఒరిజినల్ నగదు స్వాధీనం

నవతెలంగాణ-హయత్‌నగర్



ఆర్థిక ఇబ్బందులతో సులభంగా డబ్బు సంపాదించడం కోసం హైదరాబాదులో నకిలీ కరెన్సీ తయారుచేసి గుజరాత్‌లో కమిషన్ బేసిక్ మీద ఒరిజినల్ కరెన్సీ మార్పిడి చేసిన వ్యక్తులను ఎల్‌బినగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి నిజాంపేటకు చెందిన మాణిక్యరెడ్డి ఇతను గత కొంతకాలంగా ఇబ్బందులతో మారడంతో ఆన్‌లైన్ ద్వారా వివిధ మార్గాలను అన్వేషించి అన్వేషించి సులభంగా డబ్బు సంపాదించే మార్గాన్ని కనుగొని చివరకు గుజరాత్ అహ్మదాబాద్‌లో నివాసం ఉండే సురేష్ అలియాస్ సురేష్ బాయ్ నీ కలిసి నకిలీ కరెన్సీ ఇచ్చి దానికి ఒరిజినల్ స్వదేశీ కరెన్సీని తీసుకునేవాడు. జనవరి నెలలో గుజరాత్‌కు వెళ్లి రూ. 11 లక్షల 50 వేల నకిలీ కరెన్సీ తీసుకొని సురేష్‌కు ఇచ్చి ఒక లక్ష ఒరిజినల్ నగదును అక్కడినుంచి తీసుకొని వచ్చాడు. అతని స్నేహితులైన నల్గొండ చెందిన మామిళ్ల జానయ్య, రంగారెడ్డి జిల్లాకు చెందిన బిలకంటి భరత్‌కుమార్, మహబూబ్‌నగర్ చెందిన జిల్లా వెంకటేష్, రంగారెడ్డి జిల్లాకి చెందిన దొంకని సత్యనారాయణ, పెద్ద అంబర్ పేటకు చెందిన గుండ్ల వెంకటేష్, విశాఖపట్నం చెందిన శివశంకర్ నకిలీ కరెన్సీతో పాటు నకిలీ బంగారాన్ని అమాయక ప్రజలలో గత కొంతకాలంగా ప్రజల్లో నకిలీ కరెన్సీని చలామణి చేస్తూ వీరు పబ్బం గడిపేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.11 లక్షల 50వేల నకిలీ కరెన్సీ, ఒక కారు, ఏడు సెల్ ఫోన్లు, నాలుగు లక్షల ఒరిజినల్ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 18వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీకి చెందిన అడ్వకేట్ రుద్రరాజ్ కుమార్ ఇంటర్ మీడియేట్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, మాజీ కార్పొ రేటర్ బండారి మనోహర్‌లు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము గౌడ్, గిరి తదితరులున్నారు. **నవతెలంగాణ, బడంగ్‌పేట్**

శివగంగ కాలనీకి హైడ్రా అధికారులు..



నవతెలంగాణ-హయత్‌నగర్

శివగంగ కాలనీకి గురువారం హైడ్రా అధికారులు కాలనీ వచ్చినట్లు కాలనీ అధ్యక్షుడు తొంట బాబు తెలిపారు. పార్కు స్థలం కబ్జా అయిందని వచ్చిన ఫిర్యాదుతో గురువారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శివ గంగ కాలనీకి వచ్చినట్లు తెలిపారు. శివం హిల్స్ కాలనీ వాసి అయిన చంద్రా రెడ్డి సుమారు 153గజాల స్థలాన్ని కబ్జా చేసినట్లు హైడ్రా అధికారికి కాలనీవాసులు తెలియజేశారు. కబ్జా చేసినట్లు వాస్తవమేనని చంద్రారెడ్డి అధికారుల ముందు ఒప్పుకున్నాడు. ఇదే స్థలాన్ని కబ్జా చేసినట్లు గతంలో జోనల్ కమీషనర్, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్, ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు వాపోయారు. శివ గంగ కాలనీ పేరు చెప్పుకొని లెటర్ ప్యాడ్లు తయారు చేయించి కాలనీలలో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని కాలనీవాసులు చంద్రారెడ్డిపై ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ అట్టి భూమి విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నకిరేకంటి వెంకటేష్ గౌడ్, సెక్రెటరీ సతీష్ రెడ్డి, దుర్గం నరసింహ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తూ హార్ట్ ఎటాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్



వాకింగ్ చేస్తూ హార్ట్ ఎటాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మన్సూరా బాద్‌లోని హరిణ వనస్థలిపురంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం వన స్థలిపురంలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివాసం ఉంటున్న నెట్టు వెంకటేష్ యాదవ్ (56), జాతీయ పార్కులో వాకింగ్ చేస్తూ ఉన్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం సుమారు మూడు కిలోమీటర్ల మేర వేగంగా వాకింగ్ చేసి కూర్చొని సేద తీరుతున్న సమయంలో ఒక్కసారిగా ఛాతి నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. తోటి వాకర్స్ చూసి సీపీఆర్ చేసిన ప్రయోజనం లేకపోవడంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జి భారత్ దీక్షిత్‌ని హోలీ పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యకర్యవర్గ సభ్యులు, బాలాపూర్ మాజీ సింగల్ విండో చైర్మెన్ కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉత్తర ప్రదేశ్‌లోని రాజధాని లక్నో ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంపిణీ చేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, నాయకులు డి సుధాకర్ రెడ్డి, మర్రి గోపాల్, కల్లెం వెంకట్ రెడ్డి, పోరెడ్డి దేవేందర్ రెడ్డి తదితరులున్నారు. **నవతెలంగాణ, బడంగ్‌పేట**

తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శం



నవతెలంగాణ, బడంగ్‌పేట్

తొలి తెలుగు కవిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శమని బాలాపూర్ మండల కురుమ సంఘం అధ్యక్షులు కొయ్యడ యాదయ్య అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో తొలి తెలుగు కవిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు తొలి తెలుగు కవిత్రి మొల్లమాంబ 585వ జయంతి వేడుకలను బాలాపూర్ మండల కుమరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పూర్వ కాలంలో సంస్కృతంలో రచించిన రామాయణంను తెలుగులోకి అనువదించి గొప్ప కవిత్రీ మొల్లమాంబ అన్నారు. నేటి మహిళా సమాజానికి మొల్లమాంబ ఆదర్శమని కొనియాడారు. మహిళలు చదువు లేని కాలంలోనే చదువుకొని తొలి తెలుగు కవిత్రిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న గొప్ప వారన్నారు. అనంతరం పేదలకు పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమరి సంఘం నాయకులు సిల్వేరు శ్రీశైలం, రాజ్ కుమార్, వెంకటేష్, దర్గా సురేష్, బాల్ రాజ్, నాగేష్, మహేందర్, శ్రీను, రమేష్, కిరణ్, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులపై చర్చకు సిద్ధమా

నవతెలంగాణ-హయత్‌నగర్



ఎమ్మెల్యే నిధులు, మన్సూరాబాద్ కార్పొరేటర్ నిధుల పై చర్చలకు సిద్ధమా అని బీఆర్‌ఎస్ నేతలు సవాలు వేసిరారు. గురువారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కేబీఆర్ ఫంక్షన్ హాల్ లో డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి 95శాతం అభివృద్ధి చేస్తే, బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కేవలం 5శాతం మాత్రమే అభివృద్ధి చేసి నానా రాద్ధాంతం చేస్తున్నారని కార్పొరేటర్ పై ఆయన మండిపడ్డారు. డ్రయినేజీ, సీసీ రోడ్లు కాదని అభివృద్ధి అంటే స్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్ పరిస్థితి మార్చే దమ్ముందా అని అన్నారు. ప్రజా ప్రతినిధి ఎవరైనా ప్రోటోకాల్ పాటించాల్సిదేనన్నారు. ఎల్బీనగర్‌లో ఉన్న పార్కుల అభివృద్ధి విషయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోసం ప్రోటోకాల్ పాటించి ఎమ్మెల్యే పార్కులు ప్రారంభించలేదని, కానీ ప్రోటోకాల్ విషయంలో కార్పొరేటర్ మాత్రం ప్రతి విషయానికి రాద్ధాంతం చేయడం సరికాదని హితవు పలికారు. జక్కిడి మల్లారెడ్డి మాట్లాడుతూ తమ ఎమ్మెల్యే అనారోగ్య సమస్యతో ఉన్నప్పుడు కార్పొరేటర్ ఏ ప్రోటోకాల్ పేరుతో అభివృద్ధి విషయంలో శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. ప్రోటోకాల్ విషయంలో కాదు.. నీ చర్చ దమ్ముంటే అభివృద్ధి విషయంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘు వీరారెడ్డి, జగదీష్ గౌడ్, వెంకన్న, నరసింహ గౌడ్, యాదగిరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ దీదీ

కోల్‌కతా అత్యంత పెద్ద గ్యారేజీలతో నిండిన నగరం. వాటిలోని ఒక ఆటో గ్యారేజీ దుకాణం అన్నింట్లోనూ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ గ్యారేజీ ప్రత్యేకత ఏమిటంటే 52 ఏళ్ల మహిళా మెకానిక్ సోనాలి మిస్త్రీ దాన్ని నడుపుతున్నారు. పగలూ, రాత్రి అవిశ్రాంతంగా పనిచేస్తూ ద్విచక్ర వాహనాలను మరమ్మతు చేస్తుంటారు. మొత్తం నగరంలో ఈ వృత్తిలో ఉన్న ఏకైక మహిళ ఆమే కావడం ఓ విశేషం. అందుకే అందరూ ఆమెను గౌరవంగా 'మెకానిక్ దీదీ' అని పిలుచుకుంటారు.

52 ఏండ్ల సోనాలి మిస్త్రీ... సమాజం మహిళలకు విధించిన నిబంధనలను సవాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహన మెకానిక్‌గా కోల్‌కతాలో గుర్తింపు తెచ్చుకున్నారు. 26 ఏండ్లుగా ఈ వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చేతిపనులలో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. మంచి మెకానిక్‌గా పేరు సంపాదించుకుని 'మెకానిక్ దీదీ'గా ప్రజల మనసుల్లో నిలిచిపోయారు.

పట్టుదలతో ముందుకు సాగి

సోనాలి తన భర్త నుండి మెకానిక్ పని నేర్చుకున్నారు. ఇప్పుడు ఆమె కోల్‌కతాలోని అన్వర్ షా రోడ్‌లో ఒక గ్యారేజీ నడుపుతున్నారు.



తను నేర్చుకోవడమే కాకుండా తర్వాతి తరానికి కూడా ఇందులో శిక్షణ ఇవ్వాలని ఆమె కలలు కంటున్నారు. పురుషాధిక్య రంగంలో సోనాలి ప్రయాణం 26 ఏండ్ల కిందట ప్రారంభమైంది. రెంచ్‌లు, యాక్సిల్ టూల్స్, సాకెట్లు, ఇతర పరికరాలతో ఫిడేలు వేయడంతో ఆమె తన పనిని ప్రారంభించారు. పేదరికం, కష్టాల మధ్య ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి నైపుణ్యం కలిగిన మెకానిక్‌గా మారారు.

యువతీయువకుల కోసం

నిరుపేద కుటుంబంలో పుట్టిన సోనాలి వైవాహిక జీవితం తర్వాత కూడా అదే పేదరికంతో పోరాడారు. భర్త శంకర్ నుండి మెకానిక్ పనులు నేర్చుకుని క్రమంగా ఆ వృత్తి పట్ల మక్కువను పెంచుకున్నారు. ప్రారంభంలో ఆమె ఇంటి పనులను, అటు వర్క్‌షాప్‌లో పనిని సమతుల్యం చేసుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. చివరికి సర్దుబాటు చేసుకున్నారు. భార్యభర్తలు కలిసి డబ్బు ఆదా చేసి అన్వర్ షా రోడ్‌లో సొంత గ్యారేజీని ప్రారంభించారు. తను సరిగ్గా చదువుకోలేకపోయినా సోనాలి తన పిల్లలకు మంచి విద్యను అందించాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు మెకానిక్‌లో తమ కెరీర్‌ను కొనసాగించడానికి ఆసక్తి ఉన్న యువతీయువకులకు పోషించగల శిక్షణా సంస్థను స్థాపించాలనేది సోనాలి కల. ఇలా ఆమె తన నైపుణ్యాలను తర్వాతి తరంతో పంచుకోవాలనుకుంటున్నారు. ఈ రంగంలో వారు విజయం సాధించడానికి అవసరమైన సహకారం అందించానుకుంటున్నారు.

ఓ మహిళగా కష్టమన్నారు

డాక్టర్ రుక్మిణి కృష్ణమూర్తి... భారతదేశపు తొలి మహిళా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త. చాలా మందికి ఫోరెన్సిక్ సైన్స్ (నేర పరిశోధన) అంటే ఏమిటో కూడా తెలియని సమయంలో ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. అప్పటి వరకు పురుషులకు మాత్రమే అవకాశం ఉన్న ఆ రంగంలోకి కుటుంబం వద్దంటున్నా ఎదిరించి మరీ అడుగు పెట్టారు. తన నైపుణ్యంతో ఎన్నో అంతుచిక్కని సమస్యలకు పరిష్కారం చూపి శభాష్ అనిపించుకున్నారు. మహిళలు ఏదైనా సాధించగలరు అని నిరూపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఛేదించి పట్టుదలతో ముందడుకు వేసి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచిన ఆమె పరిచయం...



రుక్మిణి స్నేహితుడు ఒకరు ఆమె కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఫోరెన్సిక్ పరిశోధన కోసం ఉపయోగించడంతో, ఆమెలో కూడా ఈ అంశం పై ఆసక్తి పెరిగింది. 1974లో బొంబాయిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సాధారణ రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరి 2008లో పదవీ విరమణ చేసేనాటికి సంస్థ డైరెక్టర్‌గా 8 ఏండ్లు విధులు నిర్వహించారు. 1974లో సంస్థలో చేరినప్పుడు ఆమె ఏకైక మహిళ అయినప్పటికీ, లాబొరేటరీ వీడి వెళ్లిపోయినప్పుడు మొత్తం సిబ్బందిలో 20 శాతం మహిళలు ఉండడం విశేషం. ప్రస్తుతం డాక్టర్ రుక్మిణి ముంబైలోని హెలిక్ అడ్వైజరీ లిమిటెడ్ చైర్‌పర్సన్, ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఈఓ) మాత్రమే కాక గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో అకడమిక్ కౌన్సిల్ సభ్యురాలు. ఆమె పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు ఫోరెన్సిక్ సైన్స్‌పై రెండు పుస్తకాలు కూడా రాశారు.

ఫోరెన్సిక్స్‌ను కెరీర్‌గా

రుక్మణి కృష్ణమూర్తికి రసాయన శాస్త్రంలో(కెమిస్ట్రీ) మాస్టర్స్ డిగ్రీ ఉంది. అప్పట్లో మూడు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోగా అన్నింటిలోను ఉద్యోగం వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లరికల్ ఉద్యోగం, ముంబైలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో టీచింగ్‌తో పాటు రీసెర్చ్ అసిస్టెంట్‌గా కూడా అవకాశం వచ్చింది. అయితే మొదటి నుండి ఫోరెన్సిక్ పరిశోధనలో ఆసక్తి ఉన్న ఆమె బొంబాయిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో చేరారు. ఆమె నాగ్‌పూర్‌లో ఎం.ఎస్సీ చేశారు. కుటుంబం నుండి వ్యతిరేకత ఉన్నప్పటికీ సోదరుడి మద్దతు, ప్రోత్సాహంతో చివరికి ఫోరెన్సిక్ లాబొరేటరీలో చేరారు.

మొదట్లో అనుమతించలేదు

'ఈ రంగంలో అమ్మాయిలు పనిచేయడం కష్టం, మీరెందుకు చేరాలనుకుంటున్నారు' అని అప్పటి ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ అడగ్గా తనకు ఈ రంగంలో ఆసక్తి ఉందని ఆమె స్థిరంగా బదులిచ్చారు. నియామక లేఖలో, ఆమెకు కేటాయించిన విధి నేరం జరిగిన ప్రదేశాన్ని, అవసరాన్ని బట్టి కోర్టును సందర్శించడం. కానీ డైరెక్టర్ మొదట్లో ఆమెను అనుమతించలేదు. ఎందుకని అడిగితే ఒక మహిళగా మీరు సైట్‌లను సందర్శించడం కష్టమని ఆయన అన్నారు. కానీ ఆమె పట్టుబట్టి యువ ఫోరెన్సిక్ శాస్త్రవేత్తగా నేర దృశ్యాలను సందర్శించడం ప్రారంభించారు. చిన్నతనం నుండి రుక్మిణి ఎంతో ధైర్యంగా ఉండేవారు. ఇంట్లో కూడా అబ్బాయిలతో సమానంగా అన్ని పనులు చేసేవారు. తర్వాతి కాలంలో రుక్మిణి మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆరు ప్రపంచ స్థాయి ఫోరెన్సిక్ ప్రయోగశాలలను స్థాపించారు.

ఫోరెన్సిక్ బృందంతో కలిసి





విధి నిర్వహణలో భాగంగా ఆమె చేపట్టిన మొదటి కేసు వరకట్న మరణం. ఈ కేసులో ఒక వ్యక్తి భార్యపై కిరోసిన్ పోసి తగలబెట్టడంతో, ఆ మహిళ అనుభవించిన బాధను ఊహించుకుని తాను చాలా బాధపడ్డారు. అలాగే ఫిబ్రవరి 13, 1976న జరిగిన భయంకరమైన మాతుంగ రైలు అగ్నిప్రమాద సంఘటనలో 24 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో ఆమె కూడా ఫోరెన్సిక్ బృందంలో ఉన్నారు. ఒక ప్రయాణీకుడు కిరోసిన్ డబ్బాతో ప్రయాణిస్తుండగా అందులోని కిరోసేన్ లీక్ అయ్యి, మరొక ప్రయాణీకుడు అశ్రద్ధగా కాల్చేసిన సిగరెట్ ముక్కను దానిపై విసరడంతో మంటలు చెలరేగినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ సంఘటన తర్వాత ఆ బృందం ఇచ్చిన సలహా ప్రకారం ప్రజా రవాణా వ్యవస్థలో పెట్రోల్, కిరోసిన్ వంటి మండే స్వభావం గల వస్తువులను తీసుకెళ్లడంపై ప్రభుత్వం నిషేధం విధించింది.



ముంబై బాంబు పేలుళ్ల కేసు

1993 ముంబై బాంబు పేలుళ్ల తర్వాత జరిగిన విధ్వంసాన్ని కళ్ళారా చూసిన ప్రత్యక్ష సాక్షి ఆమె. అప్పట్లో ముంబై ఫోరెన్సిక్ లాబొరేటరీ డిప్యూటీ డైరెక్టర్ పదవిలో ఉన్న ఆమె మరుసటి రోజు తన పని ప్రారంభించారు. బాంబు పేలుడు జరిగిన అన్ని ప్రదేశాల నుండి నమూనాలను సేకరించి మూడు నెలలు కష్టపడి సమగ్ర నివేదికను రూపొందించారు. దర్యాప్తు కోసం అనుసరించిన సాంకేతికత పద్ధతి అంతర్జాతీయ స్థాయిలో వుందని డాక్టర్ రుక్మిణి తన బృందానికి అభినందనలు తెలిపారు. 2000 తొలినాళ్ళలో జరిగిన స్టాంపు పేపర్ల కుంభకోణానికి సంబంధించిన అబ్దుల్ కరీం తెల్గి కేసులో డాక్టర్ రుక్మిణి కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. మూడేండ్లు శోధించి నేరస్తుడు ఉపయోగించిన కాగితం ప్రభుత్వ పత్రం కంటే భిన్నంగా ఉందని కనుగొన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు వారి పనితీరును ప్రశంసించింది. ఆ తర్వాత ఆమె అనేక హత్యా రహస్యాలను ఛేదించారు. అంతేకాదు ఎసిటిక్ అన్హైడ్రేట్ అమ్మకాలను నియంత్రించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషించారు.

సామాజిక సేవలో

ప్రస్తుతం రుక్మణి ప్లాస్టిక్ రహిత ప్రపంచం కోసం మద్దతు ఇచ్చే సంస్థలలో పని చేస్తున్నారు. అలాగే పేద పిల్లలకు విద్యను అందిస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వన్యప్రాణుల ఫోరెన్సిక్స్‌పై ఆమె అభిప్రాయం అడిగితే మన దేశంలో ఈ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియలలో ఆధారాలకు సంబంధించి మానవ ఫోరెన్సిక్ విశ్లేషణ అంటే ఏమిటో బాగా నిర్వచించబడిన ప్రమాణాలు ఉన్నప్పటికీ వన్యప్రాణుల ఫోరెన్సిక్ కేసులను పరిష్కరించడానికి అవసరమైన మోర్ఫోమెట్రీ, మాలిక్యులర్ లాంటి ఇతర పద్ధతుల ఆధారంగా జాతులు, వివిధ జంతు సమూహాలను గుర్తించడానికి సాంకేతికత ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

- యేచన్ చంద్ర శేఖర్,
8885050822

ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు

స్టార్‌లింక్ ఒప్పందాన్ని ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

స్పెక్ట్రమ్ కేటాయింపునకు జరిగిన ఏ ప్రయివేటు ఒప్పందమైనా అది దేశచట్టాలను ఉల్లంఘించినట్లే అవుతుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. భారతదేశంలోని లక్షలాదిమంది టెలికం వినియోగదారులను పణంగా పెట్టి ఉపగ్రహ స్పెక్ట్రమ్ వినియోగంలో ఆధిపత్యం చెలాయించేందుకు జియో, ఎయిర్‌టెల్, స్టార్‌లింక్‌లు ఒక కూటమిగా ఏర్పడుతున్నాయి. పైగా, ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను ప్రత్యేకంగా వ్యూహాత్మక వినియోగాలకే అంటే రక్షణ, ఇస్రో కార్యకలాపాలకు కేటాయించాల్సి వుంది. ఇది కేవలం స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించిన సమస్యే కాదు, ఒక దేశానికి వుండే ఆర్బిటల్ స్లాట్‌ల సంఖ్యకు సంబంధించిన సమస్య కూడా. కీలకమైన ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి ఎస్‌యు1.హెచ్ ఉపగ్రహాలను అనుమతించడమే కాదు, మన జాతీయ వనరులను మ్యాపింగ్ చేసుకోవడానికి, వాణిజ్యపరంగా విలువైన డేటాను సేకరించుకునేందుకు కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు, వాతావరణం, పంటల పరిస్థితి, అలాగే వ్యూహాత్మకమైన లేదా రక్షణ డేటా వంటి వాటిని సేకరించడమనేది మన జాతీయ, భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకం కాగలదు. ముఖ్యంగా ఇస్రో, ఇతర భారతీయ సంస్థలకు ఇలా చేయగల సత్తా వుంది. ఇటువంటి టెలికం సర్వీసులు దేశ రక్షణకు చాలా కీలకమైనవి. అమెరికా ఆధ్వర్యంలో రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చేందుకు, అలాగే ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న అమెరికా డిమాండ్లను అంగీకరించేలా చేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా బెదిరించిన విషయం మనకు తెలిసిందేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఒక అమెరికా కంపెనీ అధికంగా వ్యూహాత్మకంగా ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించడం, రోదసీ గుత్తాధిపత్యాన్ని సృష్టించడమంటే మన జాతీయ సార్వభౌమాధికారం, భద్రతపై రాజీపడడమేనని సీపీఐ(ఎం) విమర్శించింది.

'మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను'

వాషింగ్టన్ : షాంపైన్, వైన్ సహా అన్ని రకాల మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను హెచ్చరించారు. అమెరికా విస్కీపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాన్ని విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 'యూరోపియన్ యూనియన్ అధికారులు ప్రపంచంలోనే అత్యంత శత్రువులుగా వ్యవహరిస్తూ అవమానకరంగా పన్నులు వేస్తున్నారు. అమెరికాను దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యం. విస్కీపై యాభై శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణమే తొలగించకపోతే మేము కూడా ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వస్తున్న అన్ని రకాల వైన్స్, షాంపైన్లు, ఆల్కహాల్ ఉత్పత్తులపై త్వరలోనే 200 శాతం సుంకం వేస్తాం. అని పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల కోసం సీతమ్మ జపం

పాట్నా : బీహార్‌లో ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ బీజేపీ అప్పుడే మత రాజకీయాలకు తెర లేపుతోంది. హిందూ ఓట్లను తనకు అనుకూలంగా సంఘటితం చేసేందుకు సీతాదేవి ఆలయ పునరుద్ధరణ నినాదాన్ని అందుకుంది. మిథిల ప్రాంతంలోని సీతామర్హిలో ఈ ఆలయం ఉంది. దీనిని పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా దానిని ఎన్నికల అంశంగా మార్చేయాలని కమలదళం ప్రయత్నిస్తోంది.

ఎండుతున్న పంటలు

(మొదటిపేజీ తరువాయి)

బోర్లు వేసి లక్షల రూపాయలు అప్పుల పాలయ్యారని అన్నారు. మార్చి 16న సీఎం స్టేషన్ ఘన్‌పూర్‌కు వస్తున్న సందర్భంగా ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.కనకారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో రైతులకు, ప్రజలకు నీరందే పరిస్థితి లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును పట్టించుకోలేదని, రైతులను ఉద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా మాటలు చెప్పడం తప్ప పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేవాదుల ప్రాజెక్టుకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించి మొత్తం పనులు పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తొమ్మిది రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపి జిల్లాలో భూగర్భజలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే రైతాంగం పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, బొట్లశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, పుత్యనూరి ఉపేందర్, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలు జిల్లాల్లో పర్యటించిన సీపీఐ(ఎం), రైతు సంఘం బృందాలు

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో మండలంలోని ముదిమాణిక్యం, ఇటిక్యాల, నాథ్లపూర్, కోడాకల్ గ్రామాల్లో సీపీఐ(ఎం) బృందం ఎండిపోయిన వరి పంటలను పరిశీలించింది. సింగూరు ఎడమ కాలువ నీరు వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా బృందం సభ్యులు డిమాండ్ చేశారు. సిద్దిపేట మండలం చేర్యాల మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయ పల్లి, అర్జున్ పట్ల తదితర గ్రామాల్లో ఎండిన వరి పంటలను సీపీఐ(ఎం), రైతు సంఘం నాయకులు పరిశీలించారు. నాగపురి, సుభాష్ గూడెం గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం బృందం ఎండిపోయిన వరి చేనులను పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ముందు చూపు లేకపోవడం వల్ల దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో నింపకపోవడంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోర్లు అడుగంటి వరి పంటలు మొత్తం ఎండిపోయాయని అన్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి వరి పంటలు వేస్తే నోటికాడికొచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయి అప్పుల పాలైన పరిస్థితి ఉందన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. కల్వలపల్లి గ్రామంలో 160 ఎకరాల్లో వరి చేలు ఎండిపోయాయని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శ్రీశైలం తెలిపారు.

గొంతునొక్కే యత్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనని మాటల్ని అన్నట్టుగా చెప్పి అబద్ధాల ఆధారంగానే ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు ఆరోపించారు. దీనికి నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి మూటల విషయాలు చర్చకొస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా గురువారం నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన నిరసన తెలిపారు. అరిగిపోయి గ్రామఫోన్ రికార్డు మాదిరిగా సీఎం నుంచి మంత్రుల దాకా ప్రజాపాలన, ఇందిరమ్మ ప్రభుత్వం అఇ చెబుతున్నారనీ, కానీ, వాస్తవానికి వాళ్లది నియంతృత్వ ప్రభుత్వమని విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో పసలేని విషయాల మీద, అందులో చెప్పిన పచ్చి అబద్ధాల మీద తమ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభలో మాట్లాడటం మొదలుపెట్టిన ఆరు నిమిషాల లోపే ఉద్దేశపూర్వకంగానే ఇటు మంత్రులు, అటు కాంగ్రెస్ సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ప్రసంగానికి అంతరాయం కలిగించారని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, ఆరుగ్యారెంటీల వాగ్దానాల భంగంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తట్టుకోలేక నీతి బాహ్యంగా, నిస్సిగ్గుగా కేవలం అబద్ధాల మీద ఆధారపడి అనని మాటల్ని అనట్టు చిత్రీకరించి సస్పెండ్ చేశారని విమర్శించారు. ఆయన ఒక్క అన్ పార్లమెంటరీ మాట కూడా వాడలేదని తెలిపారు. స్పీకర్ తమకు తండ్రి లాంటివారనీ, అందరి తరపున అక్కడ ఉన్న తమరే హక్కుల్ని కాపాడాలని ఆక్రోశం వ్యక్తం చేశారని తెలిపారు. స్పీకర్‌ను ఎక్కడా అగౌరవపర్చలేదని స్పష్టం చేశారు. నియంతృత్వ పోకడలతో ఐదుగంటల పాటు సభను వాయిదా వేసి ఢిల్లీలో ఉన రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు ఈ చర్య తీసుకున్నారని విమర్శించారు. జగదీశ్‌రెడ్డిని వివరణ అడగకముందే, ఏం తప్పు చేశారో చెప్పకుండానే సస్పెండ్ చేశారని విమర్శించారు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేసి సభను సజావుగా నడిపేలా చూడాలి కేసీఆర్ తమకు ఆదేశించారని తెలిపారు. కేసీఆర్ గారి ఆదేశాలతో స్పీకర్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిని కలిసి జగదీశ్వర్ రెడ్డి ఇష్యూమీద అన్ని పార్టీల అభిప్రాయం తీసుకొని మూడ్ ఆఫ్ ది హౌస్ తెలుసుకోవాలని కోరామన్నారు. స్పీకర్ కార్యాలయంలో అన్ని పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తే ప్రతిష్టంభనను తొలగించడానికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పామన్నారు. స్పీకర్ మీద ఉన్న గౌరవంతో విచారం వ్యక్తం చేసి సభ సజావుగా జరగడానికి సహకరిస్తామని స్పీకర్‌కు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రికి చెప్పామని తెలిపారు. ఇవేమీ పట్టించుకోకుండా ఏకపక్షంగా బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ విగ్రహాన్ని సంకెళ్లతో బంధించిన ఒక నీచమైన ప్రభుత్వమన్నారు. 20 శాతం కమీషన్లను ఢిల్లీకి మూటలు పంపడం మీద ఉన్న దృష్టి రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలనే విషయంలో ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తమ పార్టీ సభ్యుడి గొంతు ఈరోజు నొక్కినందుకు తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకింత అనుభవిస్తుందనీ, భవిష్యత్తులో తప్పకుండా వారికి ప్రజాకోర్టులో శిక్ష పడుతుందని హెచ్చరించారు.

ఆర్ఎస్ఎస్ కోసమే జమిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించటంలో పలు న్యాయపరమైన చిక్కులు తీసుకొస్తాయనీ, పరోక్షంగా అధ్యక్ష తరహా పాలనకు దారి తీస్తుందని పలు ప్రశ్నలను, అనుమానాలను లేవనెత్తాయి. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఏకపక్షంగా నియమించటం కూడా ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. ఈయనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంచి సంబంధాలు కూడా ఉండటం గమనార్హం. ఆర్‌ఎస్‌ఎస్ చిరకాల వాంఛ అయిన హిందూ రాష్ట్రను దేశంలో తీసుకురావటానికి మోడీ సర్కారు ప్రయత్నాలు తీవ్రం చేస్తున్నది. ఈ ప్రక్రియ సాఫీగా సాగాలంటే సీఈసీగా తాము చెప్పినట్టు వినే వ్యక్తి ఉండాలని కేంద్రం భావించింది. ఇందులో భాగంగానే సీఈసీగా పదవి నుంచి దిగిపోయిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేశ్ కుమార్‌ను మోడీ తీసుకొచ్చారని విశ్లేషకులు అంటున్నారు. స్వతంత్ర రాజకీయ సంస్థగా ఉండాల్సిన ఎన్నికల సంస్థను కేంద్రంలోని మోడీ సర్కారు పలు సందర్భాలలో స్వేచ్ఛగా పని చేయనివ్వలేదనీ, పలు ఎన్నికల్లో ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా పని చేసిందని ప్రతిపక్ష పార్టీలు పలు సందర్భాలలో ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపులపై కూడా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది అసలైన ప్రజాతీర్పుపై ప్రభావాన్ని చూపుతుందని అంటున్నాయి. జమిలీ ఎన్నికలు జరపాలంటే రాజ్యాంగ సవరణలు అవసరం. ఇందుకు పార్లమెంటులోని ఉభయ సభల్లో కనీసం మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. దీనిని సూపర్‌మెజారిటీ అంటారు. అంటే.. లోక్‌సభలో 362 మంది, రాజ్యసభలో 167 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అయితే, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి అంత బలం లేదు. లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులే ఉన్నారు. అంతేకాదు, గతేడాది సెప్టెంబర్‌లో జమిలీ ఎన్నికల బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అదే ఏడాది డిసెంబర్‌లో పార్లమెంటు ముందుకు బిల్లును తీసుకొచ్చింది. లోక్‌సభలో 269 మంది అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఈ బిల్లుకు ఓటు వేశారు. దీంతో జమిలీ అసాధ్యమనీ, కావాల్సిన మెజారిటీని మోడీ సర్కారు సాధించలేకపోయిందని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి.

ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసింది. గత సంవత్సరం లోగోలో రూపాయి చిహ్నం దేవనాగరి లిపిలోనే ఉంది. 'ఈ సంవత్సరం దేవనాగరి లిపి కంటే తమిళానికే మేము ప్రాధాన్యత ఇచ్చాం' అని సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాగా ఈ ఏడాది తమిళానికి ప్రాధాన్యత ఇవ్వాలని అనుకుంటున్నామని డీఎంకే ప్రతినిధి సవరణన్ అన్నాదురై చెప్పారు. త్రిభాషా సూత్రంపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్రమవుతున్న తరుణంలో డీఎంకే ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ద్విభాషా సూత్రాన్ని (తమిళం, ఆంగ్లం) అనుసరిస్తున్న తమిళనాడు త్రిభాషా సూత్రాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. అంతేకాక త్రిభాషా విధానాన్ని సూచిస్తున్న జాతీయ విద్యా విధానాన్ని కూడా నిరసిస్తోంది. తమిళనాడు బడ్జెట్‌ను శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టబోతున్నారు. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు నేతృత్వంలోని బడ్జెట్ కమిటీ లోగో మార్పుపై నిర్ణయం తీసుకున్నదని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. 'మా భాషను, మా నాగరికతను పార్లమెంటులో కూడా అపహాస్యం చేస్తుంటే మేము దానిని రక్షించుకోవద్దా?' అని డీఎంకే నేత ఒకరు ప్రశ్నించారు. కాగా లోగోను మార్చాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమోదముద్ర వేశారు. తమిళనాడు ప్రభుత్వం మార్చిన రూపాయి చిహ్నానికి డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు రూపకల్పన చేశారు. ఆయన ప్రస్తుతం ఐఐటీ గౌహతి డిజైన్ విభాగానికి అధిపతిగా కొనసాగుతున్నారు.

ట్రంప్ మెహర్బానీ కోసమే..

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీ : స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో భాగస్వామ్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ప్రధాని మోడీకి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఒప్పందాలను ఎలన్ మస్క్ ద్వారా అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు అనుకూలంగా మలిచేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్నారని అన్నారు."అక్షరాలా 12 గంటల్లోనే ఎయిర్‌టెల్ , జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. దీంతో భారతదేశంలోకి స్టార్‌లింక్ సులభంగా ప్రవేశించగలిగింది. అయితే గత కొంతకాలంగా వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలన్నింటినీ పక్కకు పెట్టి ఈ ఒప్పందం చేసుకోవడం గమనార్హం. స్టార్‌లింక్ యజమాని ఎలమన్ మస్క్ ద్వారా ట్రంప్ దయ పొందేందుకు ప్రధాని మోడీ స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారనేది స్పష్టంగా తెలుస్తుంది" అని అన్నారు. కానీ చాలా ప్రశ్నలకు ప్రధాని మోడీ సమాధానమివ్వాల్సి వుందని స్పష్టంచేశారు. ఈ ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏమిటని ప్రధానిని ప్రశ్నించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కనెక్టివిటీని స్టార్ లింక్ లేదా భారతీయ భాగస్వాములైన ఎయిర్‌టెల్, జియో సంస్థలు నియంత్రిస్తాయా ? ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లు భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతిస్తారా? అయితే ఏ నిబంధనలపై అనే దానిపై ఆందోళన లేవనెత్తారు. స్టార్‌లింక్ ప్రవేశంతో భారతదేశంలో టెస్లా తయారీ ప్రణాళికలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? అని ప్రధాని మోడీని నిలదీశారు.

రేపటినుంచి ఒంటిపూట బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఒంటిపూట బడులు వచ్చేనెల 23 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని వివరించారు. అయితే పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే పాఠశాలల్లో మాత్రం ఈనెల 21 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఆదేశాలను అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను కోరారు. వచ్చేనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి.

నవచిత్రం

ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది



ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా

హీరో నాని వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు.
ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు.
ప్రీమియర్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాతలు ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

చాలా లేయర్స్ ఉన్నాయి

దీప్తి గంటా మాట్లాడుతూ, 'నాని, ప్రశాంతి స్క్రిప్ట్ విని ఓకే చేశారు. నేను ఆన్ సెట్ ప్రొడ్యూసర్‌గా జాయిన్ అయ్యాను. నేను స్క్రిప్ట్ మొత్తం చదివాను. డైరెక్టర్ జగదీష్ చాలా బాగా రాసుకున్నాడు. చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నీ బాగా కనెక్ట్ చేసుకున్నాడు. జగదీశ్ ఈ సినిమాని చాలా రీసెర్చ్ చేసి రాశాడు. అందుకే సినిమా చాలా నేచురల్‌గా వచ్చింది. పోక్సో చట్టం గురించి ఆయన చాలా డీటెయిల్ ప్రెజెంట్ చేశాడు. 'హిట్ 3' స్టేక్స్ చాలా పెద్దవి.. కానీ నాని ఈ సినిమా నచ్చకపోతే 'హిట్ 3' చూడొద్దని చెప్పడం మాకే షాక్ అనిపించింది. నేను, ప్రశాంతి.. డైరెక్టర్ శైలేష్ వంక చూశాం.(నవ్వుతూ) తనకి నమ్మకం ఉంది కాబట్టే ఆ మాటని కాన్ఫిడెంట్‌గా చెప్పారు. నేను 'మీట్ క్యూట్' డైరెక్ట్ చేసిన తర్వాత యుఎస్ వెళ్ళిపోయాను. ఈ సినిమా కోసం మళ్ళీ వచ్చాను. కొన్ని ఐడియాలు ఉన్నాయి. వాటిని స్క్రిప్ట్‌గా డెవలప్ చేయాలి' అని అన్నారు.

అది మాకు మంచి కాంప్లిమెంట్

'నాని, నేను ఇద్దరం కథ వింటాం. అయితే మా నమ్మకం అంతా నాని జడ్జిమెంట్ మీదే ఉంటుంది. ఆయన పెద్దగా లెక్కలేమీ వేయరు. ఒక కథ థియేటర్లో చూడాలనిపించేలా ఉంటే ఓకే చేస్తారు. ప్రీమియర్స్‌కి యునానిమస్‌గా ఎక్స్‌లెంట్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ అఫ్ చూసి 'వావ్' అన్నారు. సెకండ్ హాఫ్ కోసం ఈగర్‌గా వెయిట్ చేశారు. సెకండ్ హాఫ్‌లోని హైలెట్స్ కూడా ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. రెస్పాన్స్ చాలా బావుంది. మేము అనుకున్నదాని కంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి జోనర్ సినిమాని ఆదరించి బిగ్ సక్సెస్ చేయడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. కొంత మంది లాయర్స్ ప్రీమియర్ చూసి, చాలా బాగా ఉందని ప్రశంసించారు. ' అని ప్రశాంతి తిపిర్నేని చెప్పారు.




సరికొత్త ఎలిమెంట్‌తో 'దిల్ రూబా'

హీరో కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మించాయి.
రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హోలీ పండుగ సందర్భంగా నేడు (శుక్రవారం) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'ఈ సినిమా గురించి వీలైనంతగా మిమ్మల్ని కలిసి చెబుతూ వస్తున్నాం. ఈ రోజు ప్రీమియర్స్ పడుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్ 30 మినిట్స్ సరదగా వెళ్తూ, ఆ ముప్పై నిమిషాల తర్వాత కథలోకి తీసుకెళ్తుంది. ఈ కథలో ప్రేమ ఒక్కటే కాదు స్నేహం, ఫాదర్-సన్, ఫాదర్-డాటర్ రిలేషన్.. ఇలా అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ఎక్స్ లవర్ మళ్లీ ఆ ప్రేమికుడి జీవితంలోకి వచ్చి, అతని ప్రెజెంట్ లవ్‌ను కలిపే ప్రయత్నం చేయడం అనేది ఇందులో కొత్తగా ఉంటుంది. మాజీ ప్రేయసి, ప్రేమికుడు అంటే శత్రువులా చూడాల్సిన పనిలేదు. వారితోనూ స్నేహాన్ని కొనసాగించవచ్చు అనే ఫీల్ గుడ్ ఎలిమెంట్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. మీరు మీ ఫ్యామిలీతో వచ్చి హాయిగా ఈ సినిమా చూడొచ్చు. ఎలాంటి ఇబ్బందికర డైలాగ్స్, సన్నివేశాలు ఉండవు. ఈ మూవీలో నటించిన తర్వాత నటుడిగా ఇంకాస్త పరిణితి సాధించా అనిపించింది. ఫైట్స్ విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నాను. మా డైరెక్టర్‌కు ఈ సినిమా తర్వాత మంచి పేరొస్తుంది.



ఈ కిట్టు ఎవరు?



విజయ్ ఆంటోనీ

హీరోగా, నిర్మాతగా, లిరిసిస్ట్‌గా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, ఎడిటర్‌గా ఇలా అన్ని రకాలుగా సత్తా చాటుకున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 25వ చిత్రం 'భద్రకాళి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.
విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని సమర్పణలో అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.
తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లి కూడా ఒక రోజు పులి అవును.. అబద్దం, అహంకారం అంతం అవును'.. అంటూ ప్రారంభమైన ఈ టీజర్‌లో విజయ్ ఆంటోని అసలు ఏ పాత్రను పోషిస్తున్నాడో అర్థం కాకుండా ఉంది. ఒకసారి ఫ్యామిలీ మెన్‌లా కనిపిస్తున్నారు.. మరోసారి గ్యాంగ్ స్టర్‌లా అనిపిస్తున్నారు.. ఇంకో సందర్భంలో ఉన్నతాధికారిలా కనిపిస్తున్నారు.. అసలు ఈ కిట్టు ఎవరు? అనే ఆసక్తిని రేకెత్తించేలా టీజర్‌ను కట్ చేశారు. 190 కోట్ల కుంభకోణం చుట్టూ కథ తిరిగేలా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే అంటూ చివర్లో వచ్చిన డైలాగ్‌తో టీజర్ మీద మరింత ఆసక్తిని పెంచేసినట్టు అయింది. విజయ్ ఆంటోని ఈ చిత్రంలో ఇది వరకు ఎన్నడూ కనిపించినంత స్టైలీష్‌గా, యాక్షన్ హీరోగా కనిపిస్తున్నారు. ఈ సినిమాకు విజయ్ ఆంటోని సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ షెల్లీ కాలిస్ట్ విజువల్స్ ఈ టీజర్‌లో అద్భుతంగా అనిపిస్తున్నాయి. విజయ్ ఆంటోనీ ఆర్ఆర్, రేమండ్ డెరిక్ క్రాస్టా ఎడిటింగ్, రాజశేఖర్ కంపోజ్ చేసిన ఫైట్స్ ఈ టీజర్‌లో హైలెట్ అవుతున్నాయి. ఈ సినిమాను సమ్మర్ కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు.

పెళ్ళి కోసం తిప్పలు..



సప్తగిరి

సప్తగిరి నటిస్తున్న చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై.బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు.
చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. గురువారం ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు.
ప్రసాద్‌కి 36 ఏళ్ళు దాటుతాయి. పెళ్లి గురించి మరింత ఆందోళన చెందుతాడు. అతను ఏజ్ బార్‌గా భావిస్తున్నప్పటికీ, కాలక్రమేణా ఎక్కువ అనుభవం వస్తుందని అతని తండ్రి అతనికి భరోసా ఇస్తాడు. అయినప్పటికీ, ఇంకేదైనా ఆలస్యం జరిగితే ఇక అవకాశం వుండదని ప్రసాద్ భయపడతాడు. మరోవైపు, హీరోయిన్ తననే కాకుండా తన మొత్తం కుటుంబాన్ని పోషించగల వరుడి కోసం వెతుకుతోంది. వీరిని విధి ఒకచోట చేర్చుతుందా? అనేది ట్రైలర్‌లో చాలా ఎగ్జైటింగ్, హిలేరియస్‌గా ప్రజెంట్ చేశారు. పెళ్లి కాని ప్రసాద్ పాత్రలో సప్తగిరి తన హ్యూమరస్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నాడు. ప్రియాంక శర్మకు మంచి పాత్ర లభించింది. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ పాత్రలు కామెడీ పోర్షన్‌ని మరింత పెంచింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఆటలు

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

సాత్విక్, చిరాగ్ ముందంజ
ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఓపెన్



బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్) : జూనియర్ సర్క్యూట్‌లో ఆడేందుకు వయసు తప్పుడు వయసు ధ్రువపత్రాలను సృష్టించిన కేసులో క్రిమినల్ విచారణ ఎదుర్కొంటున్న యువ షట్లర్ లక్ష్యసేన్ ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో దూసుకెళ్తున్నాడు. ప్రతిష్టాత్మక బిడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నం.2, మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)పై వరల్డ్ నం.15, అన్‌సీడెడ్ లక్ష్యసేన్ 21-13, 21-10తో వరుస గేముల్లో గెలుపొందాడు. 36 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ అదరగొట్టాడు. తొలి గేమ్‌లో జొనాథన్ క్రిస్టీ ఏ దశలోనూ లక్ష్యసేన్‌కు పోటీ ఇవ్వలేకపోయాడు. 11-6తో విరామ సమయానికి విలువైన ఆధిక్యంలో నిలిచిన లక్ష్యసేన్ అదే జోరు కొనసాగించాడు. రెండో గేమ్‌లో లక్ష్యసేన్ ముందంజ వేసినా 6-6తో జొనాథన్ క్రిస్టీ రేసులోకి వచ్చాడు. కానీ వరుసగా పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 11-6తో ముందంజ వేశాడు. బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 21-10తో ఏకపక్ష విజయం నమోదు చేశాడు. నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో ఆరో సీడ్, వరల్డ్ నం.6 లి షి ఫెంగ్ (చైనా)తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. లి షి ఫెంగ్‌తో ముఖాముఖిలో లక్ష్యసేన్‌కు (7-4) మెరుగైన రికార్డు ఉంది. చివరగా నిరుడు థామస్ కప్‌లో ఈ ఇద్దరు తలపడగా లక్ష్యసేన్ పైచేయి సాధించాడు.

పురుషుల డబుల్స్‌లో స్టార్ షట్లర్లు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో డెన్మార్క్ షట్లర్లు డానియల్, మాడ్స్‌లపై అలవోక విజయం సాధించారు. 21-17, 21-15తో 40 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ ప్రీ క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్) చేతిలో 16-21, 13-21తో వరుస గేముల్లోనే ఓటమి చెందింది. స్టార్ షట్లర్ పి.వి సింధు తొలి రౌండ్లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. మహిళల డబుల్స్‌లో గాయత్రి పుల్లెల, ట్రెసా జాలి జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. 21-17, 21-13తో తొలి రౌండ్లో చైనీస్ తైపీ జోడీపై గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీ క్వార్టర్స్‌లో రోహన్ కపూర్, రుత్విక శివాని జంట 10-21, 12-21తో ఐదో సీడ్ చైనా జోడీ చేతిలో పోరాడి ఓడారు.

హ్యారీ బ్రూక్‌పై వేటు

ఐపీఎల్‌లో ఆడకుండా రెండేండ్ల నిషేధం



ముంబయి : ఇంగ్లాండ్ యువ క్రికెటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ ఆటగాడు హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ వేటు వేసింది. ఈ సీజన్ ఆటగాళ్ల వేలంలో హ్యారీ బ్రూక్‌ను రూ.6.25 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18 ఆరంభం కానుండగా.. ఇంగ్లాండ్ క్రికెట్ టెస్టు సీజన్‌కు సన్నద్ధం అయ్యేందుకు ఐపీఎల్‌లో ఆడటం లేదంటూ బ్రూక్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఐపీఎల్ రూల్స్ ప్రకారం వేలంలో ఫ్రాంచైజీలు కొనుగోలు చేసిన ఆటగాళ్లు ఫిట్‌నెస్ మినహా ఇతర కారణాలతో సీజన్‌కు దూరమైతే రెండేండ్ల పాటు నిషేధానికి గురి కావాల్సి ఉంటుంది. దీంతో హ్యారీ బ్రూక్‌పై నిషేధం వేటు వేసినట్టు, ఈ విషయాన్ని బ్రూక్ సహా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు తెలియజేసినట్టు బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. 2024 సెప్టెంబర్‌లో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ కొత్త రూల్‌ను తీసుకొచ్చింది.

మిచెల్ మార్ష్‌కు లైన్ క్లియర్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025



లక్నో : ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు లైన్ క్లియర్ అయ్యింది. వెన్నునొప్పి గాయంతో ఈ ఏడాది ఆరంభం నుంచి ఆటకు దూరమైన మిచెల్ మార్ష్ ఐపీఎల్ 18 సీజన్‌లో ఆడేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, మిచెల్ మార్ష్ ఐపీఎల్‌లో బ్యాటర్‌గా మాత్రమే ఆడతాడని, బౌలింగ్ చేయకూడదని సీఏ తెలిపింది. గాయంతో చాంపియన్స్ ట్రోఫీకి సైతం దూరంగా ఉన్న మిచెల్ మార్ష్ ఈ నెల 18న లక్నో సూపర్ జెయింట్స్ శిబిరంలో చేరనున్నాడు. లక్నో సూపర్‌జెయింట్స్ వరుసగా రెండో సీజన్‌లో జస్టిన్ లాంగర్ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనుండగా.. రిషబ్ పంత్ కెప్టెన్‌గా కొత్త ఇన్నింగ్స్ మొదలెట్టనున్నాడు. ఇదిలా ఉండగా, గాయాలతో మార్ష్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉన్న పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోశ్ హాజిల్‌వుడ్‌లు సైతం ఈ వారంలో తమ ఐపీఎల్ జట్లతో చేరనున్నారు.

దిలీప్‌కు హెచ్‌సీఏ నజరానా

హైదరాబాద్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలక పాత్ర పోషించిన భారత ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌కు హెచ్‌సీఏ రూ.10 లక్షల ప్రైజ్‌మనీ ప్రకటించింది. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు టీమ్ మేనేజర్‌గా వ్యవహరించిన ఆర్. దేవరాజ్‌కు సైతం నజరానా ప్రకటించినా.. ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు తెలిపారు. బీసీసీఐ ఆదేశాల ప్రకారం తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) లేవనెత్తిన అంశాల అధ్యయనం, పరిష్కారం కోసం ఏడుగురు సభ్యుల కమిటీని నియమిస్తూ హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నట్టు హెచ్‌సీఏ ఓ ప్రకటనలో తెలిపింది.

చేనేతకు బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలి

ఆత్మహత్య చేసుకున్న కార్మికులకు రూ.10లక్షలు చెల్లించాలి :
చేనేత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



చేనేత రంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాతూ రాష్ట్రంలోని చేనేత, పవర్‌లూమ్ కార్మికులు ఉపాధి లేక, సంక్షేమ పథకాలు అమలు కాక ఏడాది కాలంలో 32 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలను రాష్ట్ర మంత్రులెవరూ కనీసం పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తామనీ, ప్రభుత్వ రంగ సంస్థలకు చేనేత వస్త్రాలను అందించడం ద్వారా మెరుగైన ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష రూపాయల లోపు రుణాల మాఫీలో ఒక్క రూపాయి ఎక్కువున్నా వర్తించదని ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలు చేయడానికి ఎంక్వయిరీల పేరుతో లబ్ధిదారులను వేదిస్తూ సంఖ్యను తగ్గించే కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక గ్రూపులకు రెండు చీరలు చొప్పున చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసి ఇస్తామని ఎనిమిది నెలల క్రితం ప్రకటించిన ప్రభుత్వం నేటికీ ఆ పథకాన్ని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలతో పాటు టెస్కోకు ఎన్నికలు జరిపి ఈ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. బడ్జెట్లో చేనేతకు నిధుల కేటాయింపు, సమస్యల పరిష్కారానికి సర్కార్ చొరవ తీసుకోకుంటే రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతికుమార్, కూరపాటి రమేష్ పాల్గొన్నారు

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి
హోలీ శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు.
అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ హోలీ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సవాలు నింపాలని ఆకాంక్షించారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

దౌత్య పరిష్కారం అవసరం

- ఇరాన్ అణు కార్యక్రమంపై బీజింగ్‌లో నేడు త్రైపాక్షిక చర్చలు

బీజింగ్ : ఇరాన్ అణు సమస్యకు దౌత్య పరిష్కారం అవసరమని చైనా పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమంపై బీజింగ్‌లో శుక్రవారం జరగనున్న త్రైపాక్షిక చర్చలకు చైనా ఆతిథ్యమిస్తోంది. ఈ సమావేశంలో ఇరాన్, రష్యా దౌత్యవేత్తలు పాల్గొననున్నారు. ఇరాన్ అణు సమస్యను మరింత పెచ్చరిల్లకుండా నివారించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో, అన్ని పక్షాలు ప్రశాంతతను, సంయమనాన్ని పాటించాలి. లేదా మరింత ఘర్షణల దిశగా జారిపోతామని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. అణు అంశానికి సంబంధించి తలెత్తిన పరిణామాలపై సమావేశం దృష్టి సారిస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. చర్చలు సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడానికి గానూ సమాచార మార్పిడిని, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్చలు ఉద్దేశించబడ్డాయని చైనా పేర్కొంది. పరస్పర విశ్వాసాన్ని పెంచుకుంటూ, అపోహలను తోసిపుచ్చుతూ అన్ని పక్షాలు కలిసికట్టుగా, నిజాయితీగా కృషి చేయగలవని చైనా ఆశిస్తోందని మావో చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

బీమా రంగంలోకి పతంజలి

రామ్‌దేవ్ బాబా వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్, యోగా గురు రామ్‌దేవ్ బాబా తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. తాజాగా మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో పతంజలి అయుర్వేద్ మెజారిటీ వాటాను కొనుగోలు చేసింది. దీంతో రామ్‌దేవ్ బాబా బీమా వ్యాపారంలోకి ప్రవేశించినట్లయ్యింది. మగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కొనుగోలు తర్వాత ఆ సంస్థలో పతంజలి ప్రధాన ప్రమోటర్‌గా మారనుంది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో తమ వాటాను విక్రయించే ప్రధాన విక్రేతలలో సెనోటి ప్రాపర్టీస్, సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్, కేకి మిస్త్రీ, అతుల్ డిపి ఫ్యామిలీ ట్రస్ట్, షాహి స్టెర్లింగ్ ఎక్స్‌పోర్ట్స్, షాహి స్టెర్లింగ్ ఎక్స్‌పోర్ట్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో అధర్ పూనావాలాకు చెందిన సెనోటి ప్రాపర్టీస్ ఏకంగా 74.5 శాతం వాటాను కలిగి ఉంది. అది ఇప్పుడు పతంజలి గ్రూపునకు బదిలీ కానుంది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు ఒప్పందం జరిగిందనే విషయాన్ని ఆయా సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం. నూతన యాజమాన్యం పతంజలి అయుర్వేద్, డిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ బీమా కంపెనీ మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నానని అదార్ పూనవల్లా పేర్కొన్నారు. తమ సంస్థలో 18,000 మంది ఏజెంట్లు, 2,000 కార్పొరేట్లు, ఫైనాన్సియల్ రంగంలో 80 సంస్థలతో కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. గడిచిన ఐదేండ్లలో సగటున 26 శాతం వృద్ధిని సాధించామన్నారు.

ఐదో రోజూ మార్కెట్ల డీలా

సెన్సెక్స్ 200 పాయింట్ల పతనం

నేడు హోలి సెలవు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల అంశాలు కానరావడం లేదు. వరుసగా ఐదో సెషన్‌లోనూ నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలకు తోడు దేశీయంగా ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మద్దతు కానరాకపోవడంతో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 201 పాయింట్లు లేదా 0.27 శాతం పతనమై 73,828.91కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 73 పాయింట్లు లేదా 0.33 శాతం కోల్పోయి 22,397 వద్ద ముగిసింది. హోలి సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోందోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపడం లేదని బ్రోకర్లు పేర్కొంటున్నారు. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.77 శాతం, 0.62 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ ఒక్క సెషన్‌లోనే మదుపర్లు దాదాపు రూ.2 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.393 లక్షల కోట్ల నుంచి రూ.391 లక్షల కోట్లకు పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87 వద్ద ముగిసింది. సెన్సెక్స్- 30 సూచీలో జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, టాటా స్టీల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. దాదాపు 300 స్టాక్స్ 52 వారాల కనిష్ట స్థాయిని తాకాయి.

1.75 లక్షల షేర్ల బహుమతి

ప్రూడెంట్ ప్రమోటర్ సంజయ్ షా నిర్ణయం



అహ్మాదాబాద్ : మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తులు, బీమా పరిష్కారాలు, స్టాక్ బ్రోకింగ్ సేవలను అందించేబ ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్ (ప్రూడెంట్) చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ షా తన వ్యక్తిగత హోల్డింగ్‌ల నుండి దాదాపు 650 మందికి సుమారు రూ.34 కోట్లు విలువైన 1,75,000 ఈక్విటీ షేర్లను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు. లబ్దిదారులలో కంపెనీ ఉద్యోగులు, అతని యాజమాన్యంలోని అనుబంధ సంస్థలు, అలాగే ఇంటి పనివారు, డ్రైవర్లు, వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. వ్యాపారంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు కృతజ్ఞతగా తన సహచరులకు ఈ షేర్లను అందిస్తున్నట్టు సంజయ్ షా తెలిపారు. సహచరులుగా తనతో పాటు నిలిచిన వారికి చెప్పే హృదయపూర్వక కృతజ్ఞత అని సంజయ్ షా పేర్కొన్నారు.

షావోమి 15 సీరిస్ విడుదల

న్యూఢిల్లీ : షావోమి అధికారికంగా తన షావోమి 15 సీరిస్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇటీవల మొబైల్ వాల్డ్ కాంగ్రెస్‌లో ఆవిష్కరించిన ఈ సీరిస్‌ను తాజాగా ఇక్కడి మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొంది. షావోమి 15, షావోమి 15 అల్ట్రా రెండు వేరియంట్లను స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్, లైకా కెమెరాలు, ఏఐ సామర్థ్యాలు, ప్రీమియం హార్డ్‌వేర్ ఫీచర్లలో అందిస్తున్నట్టు తెలిపింది. షావోమి 15 ధరను రూ.64,999గా, అల్ట్రా ధరను రూ.1,09,999గా నిర్ణయించింది. అల్ట్రా వేరియంట్‌ను 200 ఎంపి లైకా పెరిస్కోప్ లెన్స్ కెమెరా, 50 ఎంపి ప్రైమరీ కెమెరా, 32 ఎంపి సెల్ఫీ కెమెరాతో తీసుకొచ్చింది.

ఉచితాలతో నిరుపయోగం

ఉద్యోగాల వల్లనే పేదరిక సమస్యకు పరిష్కారం :

ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నారాయణ మూర్తి



ముంబయి : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణమూర్తి మరోసారి నోరు పారేసుకున్నారు. వారానికి 90 గంటలు పని చేయాలని ఇటీవల వ్యాఖ్యలు చేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకొని అబాసుపాలైన ఆయన.. తాజాగా ఉచితాలు నిరుపయోగమని అన్నారు. ముంబయిలో జరిగిన 'టైకాన్ ముంబయి 2025'లో నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సృష్టించే ఉద్యోగాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కానీ ప్రజలకు పంచే ఉచితాలతో ఉపయోగం ఉండదన్నారు. ఔత్సాహికవేత్తలు మరిన్ని వ్యాపారాల సృష్టిపై దృష్టి సారించాలన్నారు. వినూత్న కంపెనీలు ఏర్పాటు చేస్తే ఏదో ఒక రోజు పేదరికం మాయమవుతుందన్నారు. ఏ దేశమూ పేదలకు ఉచితాలు ఇవ్వడం వల్ల విజయవంతం కాలేదన్నారు. ఉద్యోగాల వల్లే పేదరిక సమస్య పరిష్కారమవుతుందన్నారు.

బీఎస్ఎన్ఎల్ హోలీ ధమాకా ఆఫర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం కంపెనీ బీఎస్ఎన్ఎల్ తన వినియోగదారులకు మరో బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. హోలి ధమాకా ఆఫర్‌లో భాగంగా రూ.2399 ప్రీపెయిడ్ ప్లాన్‌కు 30 రోజుల అదనంగా వ్యాలిడిటీని పెంచింది. గతంలో ఈ ప్లాన్ చెల్లుబాటు 395 రోజులుగా ఉంది. తాజా ఆఫర్‌తో 425 రోజులకు పెరగనుంది. ఈ ప్లాన్‌లో భారత్ అంతటా అపరిమిత కాలింగ్ సౌకర్యం పొందవచ్చని బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ఈ ప్లాన్‌లో వినియోగదారులు ప్రతిరోజూ 2జీబీ హై స్పీడ్ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను పొందవచ్చు. మొత్తం ప్లాన్ వ్యవధిలో మొత్తం 850 జీబీ డేటా అందించనుంది.

హైదరాబాద్‌లో టెయిల్ గ్లోబల్ సెంటర్ ఏర్పాటు

నవ తెలంగాణ - హైదరాబాద్

లైఫ్‌సైన్స్ కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజరీ సేవలందించే స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్త్‌పిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ కంపెనీ హైదరాబాద్‌లో తన టెన్త్‌పిన్ ఎఐ ల్యాబ్స్ (టెయిల్) గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. దీనిని తెలంగాణ ప్రభుత్వ వాణిజ్య, ఐటి శాఖ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ లాంచనంగా ప్రారంభించారు. విస్తరణ ప్రక్రియలో భాగంగా టెన్త్‌పిన్ తెలంగాణను ఎంచుకోవడం సంతోషకరమని జయేష్ రంజన్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి ప్రపంచంలోనే అతి పెద్ద కేంద్రం కావడం ఆనందదాయకమన్నారు. లైఫ్‌సైన్స్ కంపెనీలు తమ నిపుణులతో కలిసి పని చేసేందుకు ఇది ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా వ్యవహరిస్తుందని కంపెనీ డైరెక్టర్ బార్ట్ రీజ్స్ పేర్కొన్నారు.

సమాఖ్య వ్యవస్థను గౌరవించాలి

కేంద్రం నుంచి నిధులు తెండి : బీజేపీ సభ్యులకు పొన్నం సలహా

- పదేండ్లుగా బీఆర్ఎస్ అడగలేదని వ్యాఖ్య
- గవర్నర్ ప్రసంగం ధన్యవాద తీర్మానం గరంగరం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్





కేంద్ర ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థను గౌరవించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీ సభ్యులు కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసుకుందామని చెప్పారు. హైదరాబాద్‌తోపాటు మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులు అవసరమని అభిప్రాయపడ్డారు. 29వ రాష్ట్రంగా ఏర్పడ్డ చిన్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. గురువారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో ధన్యవాద తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అప్పుల్లో పురోగతి సాధించిందన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. పింఛన్లు రావడం లేదని వ్యాఖ్యానించారు. ఆయా ప్రాజెక్టులకు బలవంతపు భూసేకరణ చేస్తున్నారని గుర్తు చేశారు. గిరిజనుల భూములను లాక్కుంటున్నారని చెప్పారు. ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ ఎలా అయ్యిందో చెప్పాలని కోరారు. రాజుల పేర్లతో ఉన్న జిల్లాల పేర్లు మార్చాలని డిమాండ్ చేశారు. సచివాలయ నిర్మాణంలోనూ టూంబ్స్ ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. రుణమాఫీ 40 శాతం రైతులకు అందలేదని అన్నారు. చర్చలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుంటూ నిధుల కోసం ప్రధాని మోడీతోపాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు పలుమార్లు కలిశామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో కేంద్రం సహకారం కావాలని అభిప్రాయపడ్డారు. గత పదేండ్లల్లో కేసీఆర్ ఒక్కసారి నిధులు అడగలేదనీ, మేము అడిగామని చెప్పారు. సభను బీజేపీ తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు. వక్రీకరణ చేయొద్దని అన్నారు. రైతుబంధు, రుణమాఫీ చేశామని వివరించారు. రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ వివక్షలేదన్నారు. తమ ప్రభుత్వం ఏ పథకాన్ని ఆపడం లేదని వివరించారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం తప్పనిసరి అని గుర్తు చేశారు.

పక్కరాష్ట్రం మాదిరిగానే మనకూ నిధులు రావాలి: శ్రీధర్‌బాబు

మంత్రి శ్రీధర్‌బాబు చర్చలోకి వస్తూ తప్పుడు సమాచారంతో మహేశ్వర్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. సమాఖ్య వ్యవస్థను అందరూ గౌరవించాలని చెప్పారు. బాధ్యతగా వ్యవహ రించాలని సూచించారు. నిర్మల్ నియోజకవర్గంలో రుణమాఫీ, 200 యూనిట్ల కరెంటు, రైతుభరోసా అమలుచేశామన్నారు. కావాలంటే పూర్తిలెక్కలు ఇస్తామని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధికి సహక రించాలని కోరారు. పక్కరాష్ట్రానికి నిధులు ఎలా వెళుతున్నాయో, అలానే తెలంగాణకు రావాలని కోరుకుంటున్నామని వివరించారు.

అసెంబ్లీ ఎక్కువ రోజులు నడపాలి: అక్బరుద్దీన్

ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ఏడాదిలో కనీసం 100 రోజులు నిర్వహించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే 42 రోజులు మాత్రమే సమావేశాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజాసమస్యలపై అత్యున్నత వేదికైన అసెంబ్లీలోనే కదా ? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు ఉండాలని చెప్పారు. పాత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకూడదన్నారు. సభ్యుల సస్పెన్షన్ విషయంలో ఆయా పార్టీల నేతలను అడిగితే అభిప్రాయాలు చెప్పేవాళ్లమనీ, స్పీకర్‌కు మద్దతు ఇచ్చేవాళ్లమని అన్నారు.

ఎక్కువ రోజులు నడిచేలా చూస్తా: భట్టి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చర్చలో జోక్యం చేసుకుంటూ చట్టసభలు, సభ్యులు ప్రజల గురించే ఆలోచించాలనీ, చర్చించాలని అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారమే అసెంబ్లీ వేదిక కావాలన్నారు. వీలైనన్ని ఎక్కువ రోజులు సభను నడిపేందుకు నిబంధనలను సవరిస్తామని వివరించారు. వ్యవసాయానికి ఉచిత కరెంటును అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్లలోపు బిల్లు వచ్చే పేదలకు మాత్రమే కరెంటు చార్జీలు మాఫీ చేస్తామన్నారు. అంతకంటే ఎక్కువ వస్తే బిల్లు చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. మళ్లీ అక్బరుద్దీన్ చర్చలోకి వస్తూ తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు లేవని చెప్పారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు లేవని అంటున్నారనీ, సర్కారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రంజాన్, ఉగాది తదితర పండుగల నేపథ్యంలో ఇమామ్‌లు, పూజార్లు, పాస్టర్లు, ఇతరులకు గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం 420 హామీలు ఇచ్చిందనీ, వీటికి రూ. 2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పలేదని ప్రశ్నించారు. డాలర్ రేటు మన్మోహన్, మోడీ వయస్సును దాటిపోయిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు చెప్పాలని అభిప్రాయపడ్డారు.


స్పీకర్‌ను అవమానించడం సరికాదు : కూనంనేని

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ స్పీకర్‌ను అగౌరవంగా మాట్లాడటం సరికాదన్నారు. ఆ కుర్చీలో ఎవరు కూర్చున్నా వారికి గౌరవం ఇవ్వాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ధర్మరాజులా పాలన చేయాలని కోరారు. సస్పెండ్ చేసిన సభ్యుని విషయంలో ఆలోచించాలని అన్నారు. మన గవర్నర్ ఇబ్బందులు తెలుసుకుని తన వ్యక్తిగత పలుకుబడితో కేంద్రంతో చర్చించాలని చెప్పారు. రాష్ట్రం అప్పుల గురించి మాట్లాడిన బీజేపీ సభ్యులు కేంద్రం అప్పుల మాట కూడా చెబితే బాగుండేదన్నారు. మీరు, మేము మిత్రులమనీ, మీరు బాగుండాలని అన్నారు. మీ సహకారంతో ఎమ్మెల్సీ గెలిచామని చెప్పారు. లోపాలు ఉంటే ప్రశ్నించడంలో తప్పులేదని తెలిపారు. సోషల్‌మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టి వ్యక్తిగతంగా దూషించడాన్ని తప్పుబట్టారు. అలాంటి వ్యక్తులు మహిళలైనా సరే చర్యలు తీసుకోవాలనీ, అలా చేయకపోతే అసమర్థత కింద వస్తుందన్నారు. ఈవిషయంలో చంద్రబాబు, లోకేష్, పవన్ గతంలో ఓపికగా ఉన్నారని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ప్రతిపక్షం పోస్టులు పెడుతున్నదని వివరించారు. ప్రజాస్వామ్యంలో పద్ధతి ప్రకారం వ్యవహరించాలని సూచిం చారు. ప్రభుత్వంపై అసంతృప్తి, అసహనం ఎందుకు పెరుగుతున్నదో మేథోమథనం చేయాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలోకి వస్తూ ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు.

దుబాయి నుంచి కాంగ్రెస్ సర్కారుపై విష ప్రచారం

తెలంగాణ కులగణనను కేంద్రం మోడల్‌గా తీసుకోవాలి : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



దుబాయిని కేంద్రంగా చేసుకుని సోషల్‌మీడియా వేదికగా కొందరు తెలంగాణలోని ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గవర్నర్ ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనను ఆయన గురువారం శాసనసభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చక్కగా వివరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను కేంద్ర ప్రభుత్వం మోడల్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కులగణనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొనకపోవడాన్ని తప్పుబట్టారు. బీసీల పట్ల వారికి ఇంత చులకన భావం తగదన్నారు. కులగణన సరిగా జరగలేదని వారే విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. లక్ష మందికిపైగా ప్రభుత్వోద్యోగులు శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టారనీ, సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశాన్ని కూడా ఇచ్చామని తెలిపారు. రాజకీయ, విద్య, ఉద్యోగ నియామకాల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు దక్కబోతున్నాయని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రాన్ని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతే రాజుగా భావించి రూ.2 లక్షల లోపు ఉన్న బ్యాంకు రుణాలను మాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సన్నాలకు బోనస్ బోగస్ అని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. బోనస్ కింద రైతులకు రూ.1206 కోట్లు ఇచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కనీసం మద్దతు ధర కూడా రైతులకు దక్కలేదని గుర్తుచేశారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో దోహదపడుతున్నదన్నారు. రూ.21 వేల కోట్లతో ఇందిరా మహిళా శక్తిని అమలు చేయబోతున్నామన్నారు. తమది కమీషన్ల ప్రభుత్వమని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. మిషన్ భగీరథలో కమీషన్లు, మిషన్ కాకతీయలో కమీషన్లు, కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, కరెంటు కొనుగోళ్లలో కమీషన్లు...ఇలా అన్నింటి కమీషన్లు తీసుకుని ఆ కుటుంబంలో నలుగురే బాగుపడ్డారని విమర్శించారు. ఆ నలుగురు కుటుంబ సభ్యుల వల్లే నేడు రాష్ట్రం అప్పులపాలైందని ఆరోపించారు.

తెలంగాణకు పదేండ్లలో జరిగిన నష్టానికి రిపేరు చేస్తున్నాం : వేముల వీరేశం

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు జరిగిన నష్టానికి రిపేరు చేసే పనిలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం చెప్పారు. పదేండ్ల కాలంలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై కేసీఆర్ సర్కారు వివక్ష చూపిందని విమర్శించారు. రూ.20 వేల కోట్ల సంపద హైదరాబాద్‌లోని వెయ్యి మంది చేతుల్లోనే పోగైందనీ, బీఆర్ఎస్ నేతలు తప్ప రాష్ట్రం అభివృద్ధి చెందలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమానికి జీవం పోశారని గుర్తుచేశారు. ఎస్సీవర్గీకరణ అంశంపై కేసు సుప్రీంకోర్టులో ఉంటే క్లియర్ కావడానికి సీఎం రేవంత్‌రెడ్డి సహకరించారనీ, త్వరలో ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీ ముందుకు రాబోతున్నదని చెప్పారు. జయజయ హే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు.



విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

- నిజామాబాద్ జిల్లాలో ఘటన

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో లోకాయి రిషిక్ (12) అనే బాలుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 12న స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో లోకాయ్ రిషిక్ బుక్స్ కింద పడేశాడనే కారణంతో స్కూల్ టీచర్ భూమేష్ ఇష్టం వచ్చినట్టు విద్యార్థిని కర్రతో కొట్టాడు.

దాంతో గాయాలయ్యాయి. కోపోద్రిక్తులైన విద్యార్థి తండ్రి.. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు అనురాధను కోరారు.

బీసీ యువతకు ఉచిత డ్రైవింగ్‌లో శిక్షణ

- వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ బీసీ యువతీ, యువకులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు వెనుకబడిన తరగతుల అర్థిక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య బట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత. డ్రైవింగ్ కోర్సులో హెవీ మోటారు వాహనం (హెచ్‌ఎంవీ), తేలికపాటి మోటారు వాహనం(ఎల్ఎంవీ) శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 18రోజులపాటు శిక్షణను ఇస్తారని పేర్కొన్నారు. ఇది పూర్తయిన తర్వాత సంబంధిత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హకీంపేటలో టీఏ, జెడ్ఎస్‌టీసీ, (టీజీఆర్టీసీ) ద్వారా అందించనున్నట్టు తెలిపారు. ఎల్ఎంవీ కోసం 18 నుంచి 45 సంవత్సరాల వరకు, హెచ్‌ఎంవీ కోసం 20నుంచి45 సవంత్సరాల వరకు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు.ఆధార్, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో రూ. 1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2.00లక్షల ఆదాయం ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ బీసీ యువతీ యువకులు సంబంధిత బీసీ అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 15నుంచి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితారాణి

అమరావతి : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు చివరికి ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలో వివిధ పార్టీలకు చెందిన ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. అభ్యర్థులంతా ఏకగ్రీవమైనటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితారాణి ప్రకటించారు. కూటమి పొత్తులో భాగంగా టిడిపి తరపున బి.తిరుమలనాయుడు (బిటి నాయుడు), బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనసేన తరపున కొణిదల నాగేంద్రబాబు, బిజెపి తరపున సోము వీర్రాజు నామినేషన్ వేశారు. కాగా, వీరంతా ఏకగ్రీవమయ్యారని వనితా రాణి ప్రకటించారు. అలాగే ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



బిటి.నాయుడు



కావలి గ్రీష్మ




బీద రవిచంద్ర



కె.నాగేంద్రబాబు

సోము వీర్రాజు



శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు భలే గిరాకీ

నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

నవ తెలంగాణ - హైదరాబాద్

గడిచిన ఏడాదిలో హైదరాబాద్‌లో గిడ్డంగుల డిమాండ్ 35 లక్షల చదరపు అడుగులుగా నమోదయ్యిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ చేసింది. మొత్తం లావాదేవీల్లో తయారీ రంగం అత్యధికంగా 34 శాతం వాటాను.. రిటైల్ రంగం 33 శాతం వాటాను కలిగి ఉన్నాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు ఎక్కువ డిమాండ్ చోటు చేసుకుంది. గతేడాది మొత్తం లావాదేవీల్లో శంషాబాద్ క్లస్టర్ ఏకంగా 47 శాతం వాటాను కలిగి ఉండటం విశేషం. ఈ క్లస్టర్‌లో శంషాబాద్, ఎరోట్రోపోలిస్, శ్రీశైలం హైవేస్, బొంగ్లూర్, కొతూర్, షాద్‌నగర్ ప్రాంతాలు ఈ క్లస్టర్‌లో వస్తాయి. 2024లో హైదరాబాద్ గిడ్డంగుల మార్కెట్‌లో సగటున చదరపు అడుగుకు రూ.20.7 అద్దె చెల్లింపులు జరిగాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే అద్దెలో 1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మెడ్చల్ క్లస్టర్ 46 శాతం, పటాన్‌చెరు క్లస్టర్ 7 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.

వరల్డ్‌బ్యాంక్ ఫెలోషిప్‌కు ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్ ఎంపిక

- భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి
- అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్‌కు తెలంగాణ ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభా స్కర్ ఎంపికయ్యారు. స్టాటిస్టిక్స్ అండ్ అనాలిటిక్స్ అంశంపై గతేడాది నుంచి ప్రపంచబ్యాంకు ఈ ఫెలోషిప్ కోర్సు నిర్వహిస్తుంది. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎమ్ఐటీ) కోర్సులో మాస్టర్ ఆఫ్ అప్లయిడ్ సైన్స్ లో చదువుకొని, అందులో చేసిన ప్రాజెక్టు వర్క్ ఆధారంగా ఈ ఫెలోషిప్‌కు ఎంపిక చేశారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఫెలోషిప్ కోసం దాదాపు 2,600 దరఖాస్తులు వచ్చా యి. దీనిలో ప్రపంచవ్యాప్తంగా 33 మంది ప్రభుత్వ అధికారులను ఎంపిక చేశారు. భారతదేశం నుంచి కృష్ణభాస్క ర్ ఒక్కరే ఎంపికయ్యారు. ఫెలోషిప్‌లో భాగంగా వాషింగ్టన్ డీసీలో తొమ్మిది రోజులు శిక్షణ పొందేందుకు రావాలని వరల్డ్ బ్యాంక్ అధికారులు కృష్ణభాస్కర్‌కు ఆహ్వానం పంపారు. ఆరు నెలల కోర్సులో భాగంగా ప్రత్యేక శిక్షణ తర్వాత, డిజిటల్ అనుబంధంగా ఈ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫెలోషిప్‌కు ఎంపికైన కృష్ణభాస్కర్ అమెరికా వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కోర్సు కు సంబంధించిన మొత్తం ఖర్చును వరల్డ్ బ్యాంక్ భరిస్తుంది. ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు అమెరికాలో ఆయన శిక్షణ తీసుకోనున్నారు. ఈ సందర్భంగా కృష్ణభాస్కర్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

ప్రజావాణి ఈ నెల 18కి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హోలీ పండుగ నేపథ్యంలో ఈ నెల 14న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మార్పును గమనించి దరఖాస్తుదారులు ఈ నెల 18న హాజరు కావాలని సూచించారు.

తప్పులు, అప్పులు సరిదిద్దుకుంటూ వస్తున్నాం

- నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం
- ఓర్వలేకనే దిగజారుడు రాజకీయాలు : మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ చేసిన అప్పులు, తప్పులు క్రమంగా సరిదిద్దుకుంటూ వస్తున్నామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం శాసన సభలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం కుర్చీని అగౌరవ పరుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం దివాళా తీయటానికి మామ అల్లుళ్లే (కేసీఆర్,హరీశ్) కారణమని చెప్పారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. వీరి ప్రవర్తనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయటమేంటని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధిగా వ్యవహరించాలని హరీశ్‌కు సూచించారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, ముఖ్యమంత్రి అంటే మీకు విలువలేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టే స్థాయి లేని వారు ముఖ్యమంత్రిని విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. పదేండ్లు చేయని అభివృద్ధి 15 నెల్లల్లో జరుగుతుంటే. తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియక బీఆర్ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. హరీశ్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రికార్డు స్థాయిలో దోచుకున్న కేసీఆర్ కుటుంబం

- మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ కుటుంబం తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో దోచుకున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన కొత్తగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం తెలంగాణ బీజేపీ నేతలు తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్త ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. దళిత స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీరు సరికాదన్నారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ బలహీనవర్గాలను కించపరుస్తోందని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయబోతున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో విజయశాంతి క్రియాశీలకంగా పాల్గొన్నారనీ, 2023 ఎన్నికల ప్రచారంలో చురుకుగా వ్యవహరించారని గుర్తుచేశారు. కులగణన ప్రభావంతోనే దాసోజు శ్రవణ్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఇచ్చిందన్నారు.

ప్రత్యేక టీచర్లను క్రమబద్ధీకరించాలి

- సుప్రీంకోర్టు కీలక తీర్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగ విద్యార్థులకు బోధిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేయాలని సుప్రీంకోర్టు కీలకమైన తీర్పును వెల్లడించింది. ఈ మేరకు ఐఈఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి మారిపెల్లి రమేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2023-24 విద్యాసంవత్సరం లెక్కల ప్రకారం వికలాంగుల పిల్లలు 81 వేల మంది నమోదయ్యారని తెలిపారు. ఐఈఆర్పీలు 790 మంది 19 ఏండ్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల ఏడో తేదీన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఆ తీర్పుననుసరించి మహారాష్ట్రలో 3,100 మంది, మణిపూర్‌లో 272 మంది, హర్యానాలో 146 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరణ చేశారని వివరించారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఐఈఆర్పీలను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. పే స్కేల్‌ను అమలు చేయాలని కోరారు.

ఉభయ సభలు శనివారానికి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసన సభ, శాసన మండలి శనివారానికి వాయిదా పడ్డాయి. గురువారం ఉభయ సభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగింది. అసెంబ్లీలో ఇదే అంశంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డికి మధ్య వాడివేడి చర్చ నడిచింది. అనంతరం స్పీకర్ జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేసిన విషయం విదితమే. గురువారం రాత్రి 8 గంటల వరకు కొనసాగిన సభలో ఈ వ్యవహారంపై పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం సభను శనివారం ఉదయం 10 గంటలకు సభాపతి వాయిదా వేశారు. హోలీ పండుగ నేపథ్యంలో శుక్రవారం ఉభయ సభలకు సెలవు దినం.

కుల గణన సర్వేపై మండలిలో వాగ్వాదం

- ఈబీసీ రిజర్వేషన్ల కోసం బీసీల జవాభాను తక్కువ చూపించారు
- సర్కార్ తీరుతో భవిష్యత్‌లో బీసీలు నష్ట పోతారు : తీన్మార్ మల్లన్న
- తప్పులుంటే సూచనలివ్వండి.. సరిదిద్దుకుంటాం...
- మొత్తం ప్రక్రియను తప్పుపట్టడం సరికాదు : మంత్రి పొన్నం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణన సర్వేపై గురువారం శాసనమండలిలో వాడి వేడి చర్చ జరిగింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. 10 శాతం ఈబీసీ కోటా రిజర్వేషన్ల కోసం బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని మల్లన్న ఆరోపించారు. కుల గణన సర్వే తప్పుల తడకని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అనాలోచిత చర్య వల్ల భవిష్యత్‌లో బీసీలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈదశలో జోక్యం చేసుకున్న పొన్నం, తీన్మార్ వ్యాఖ్యలను ఖండించారు. భారత దేశ చరిత్రలో మొదటి సారిగా పారదర్శకంగా తెలంగాణ సర్కార్ కులగణన సర్వే చేసిందని చెప్పారు. 150మందికి ఒక ఎన్యూమరేటర్లను నియమించి పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేసినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వందకు వంద శాతం సక్సెస్ అయ్యిందనీ, హైదరాబాద్‌తో పాటు కొన్ని పట్టణాల్లో మాత్రం కొంత మిగిలి పోయిందని గుర్తు చేశారు. ఎక్కడైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సలహాలు, సూచనలిస్తే సవరించుకుంటామని పేర్కొన్నారు. అయితే పొన్నం వాదనతో తీన్మార్ ఏకీభవించలేదు. సర్కార్ కొన్ని వర్గాలకు లబ్ది చేసేందుకు బీసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. పొన్నం ప్రభాకర్ బీసీ మంత్రిగా ఉండి కూడా ఏమి చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1951 నుంచి 2019 వరకు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు 808 మంది మంత్రులుగా ఉంటే, అందులో ఓసీలు 543 మంది కాగా, 212 మంది మాత్రమే బీసీలు ఉన్నారని గణాంకాలతో సభకు తెలిపారు. అలాగే విద్య, ఉద్యోగ, తదితర అన్ని రంగాల్లో దశాబ్దాలుగా బీసీలకు అన్యాయం జరిగిందని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకున్న నిర్ణయాన్ని తాను సమర్థిస్తాననీ, అదే సందర్భంలో వారి నోటి కాడి కూడును లాక్కోవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సభలో ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. తెలంగాణ తదుపరి సీఎం పొన్నం ప్రభాకరే అంటూ తీన్మార్ పేర్కొన్నారు. దాంతో పొన్నం రెండు చేతులు జోడించి తనను ఎందుకు అనవసరమైన విషయాల్లో లాగుతున్నారంటూ సభనుంచి వెళ్లి పోయారు. ఆ తర్వాత సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్టుమండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాష్ ప్రకటించారు.

స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో

హోలీ సంబురాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొని రంగులతో సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా రంగులకలగా మారింది. విద్యార్థులు పరస్పరం రంగులు చల్లుకుని పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, నృత్యం చేస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ లంక మాట్లాడుతూ ప్రేమ, స్నేహం, సామరస్యానికి ప్రతీక హోలీ పండుగ అని అన్నారు. ప్రమాదకరమైన రసాయనాలతో కాకుండా సహజ రంగులతో ఈ వేడుకలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ కె కృష్ణారావు, డైరెక్టర్లు టి రాకేశ్‌రెడ్డి, ఆర్ ప్రదీప్‌రెడ్డి, డీన్ ఎ వినయ్‌బాబు, డైరెక్టర్ వి అనురాధ, ఏవో ఏ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టాప్ వందలో బీసీలు 48 మంది

- వందలో పురుషులు 59 మంది, మహిళలు 41 మంది
- పారదర్శకంగా మూల్యాంకనం ప్రక్రియ
- కొందరు వ్యక్తులు, సంస్థలు తప్పుడు సమాచారం వ్యాప్తి : టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రక్రియ న్యాయమైన, పారదర్శకంగా జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 తాత్కాలిక మార్కులకు సంబంధించి అన్ని వివరాల్లోకి వెళ్లకుండా కొంతమంది వ్యక్తులు, సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని తెలిపారు. కొందరు స్వార్థపరులు వారి ప్రయోజనాలకు అనుగుణంగా సమాచారాన్ని విశ్లేషించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని వివరించారు. ఇది గ్రూప్-1 అభ్యర్థుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలను నివృత్తి చేయడానికి, అభ్యర్థులు, సాధారణ ప్రజలకు తెలియజేయడానికి మరింత స్పష్టత, విశ్వాసం కోసం సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. హెచ్ఎండీఏ పరిధిలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించామని తెలిపారు. సమాధాన పత్రాల మూల్యాంకనం నవంబర్ ఒకటి నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు జరిగిందని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఈనెల పదో తేదీ కంటే ముందు తాత్కాలిక మార్కులను ప్రకటించలేదని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేయడమే టీజీపీఎస్సీ లక్ష్యమని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా మార్కులను అభ్యర్థుల లాగిన్‌లో ఉంచామని తెలిపారు. సొంత అంచనాలతో అభ్యర్థులు సోషల్ మీడియాలో ఊహాగానాలతో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో అభ్యర్థుల్లో గందరగోళం, అనవసరమైన అశాంతిని తొలగించడానికి కమిషన్ గణాంకాలను విడుదల చేసిందని వివరించారు. 20,161 మంది అభ్యర్థులకు సంబంధించి అత్యధిక మార్కులు ఇంగ్లీష్‌లో 139.5, పేపర్-1లో 97.5 మార్కులు, పేపర్-2లో 102.5 మార్కులు, పేపర్-3లో 102.5 మార్కులు, పేపర్-4లో 113.5 మార్కులు, పేపర్-5లో 96.5 మార్కులు, పేపర్-6లో వంద మార్కులు వచ్చాయని తెలిపారు. ఇంగ్లీష్ మాధ్యమంలో 12,323 మంది, తెలుగు మాధ్యమంలో 7,829 మంది, ఉర్దూలో తొమ్మిది మంది రాశారని పేర్కొన్నారు. టాప్ వంద ర్యాంకుల్లో పురుషులు 59 మంది, మహిళలు 41 మంది ఉన్నారని వివరించారు. టాప్ వంద ర్యాంకుల్లో ఓసీలు 32 మంది, బీసీలు 48 మంది, ఎస్సీలు ముగ్గురు, ఎస్టీలు ఐదుగురు, ఓసీ ఈడబ్ల్యూఎస్ వారు 12 మంది ఉన్నారని పేర్కొన్నారు. 500 ర్యాంకు వరకు పురుషులు 296 మంది, మహిళలు 204 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో ఓసీలు 132 మంది, బీసీలు 228 మంది, ఎస్సీలు 50 మంది, ఎస్టీలు 38 మంది, ఓసీ ఈడబ్ల్యూఎస్ వారు 52 మంది చొప్పున ఉన్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం నోటిఫై చేసిన ఖాళీల ఆధారంగా అభ్యర్థులను మెరిట్ జాబితా నుంచి ఎంపిక చేస్తామని తెలిపారు. ఆర్డీవో, డీఎస్పీ, సీటీవో మొదలైన కేటగిరీ పోస్టుల్లో నోటిఫికేషన్ ప్రకారం రిజర్వు చేయని, రిజర్వు చేసిన కేటగిరీ అభ్యర్థులు నియామకమవుతారని వివరించారు.

పేలవంగా నీటి వనరుల ప్రాజెక్టుల నిధుల వినియోగం

- ఎత్తి చూపిన జల వనరుల స్థాయీ సంఘం

న్యూఢిల్లీ : నీటి వనరుల ప్రాజెక్టులకు, గ్రామీణాభివృద్ధికి, గంగా జలాల పారిశుధ్యానికి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయారని పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. 2024-25 సంవత్సరానికి సవరించిన కేటాయింపులు రూ.21,640.88కోట్లు కాగా అందులో గతేడాది డిసెంబరు చివరి నాటికి దాదాపు 58శాతం మేర నిధులే వినియోగించారని, ఇంకా మెరుగైన రీతిలో ఖర్చు పెట్టాల్సిందని వ్యాఖ్యానించింది. ఈ ప్రాజెక్టు పనుల అమలు యంత్రాంగాన్ని, పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం వుందని కమిటీ జలశక్తి మంత్రిత్వ శాఖకు సూచించింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. కేటాయించిన నిధుల్లో దాదాపు 40శాతం నిధులు అలాగే మిగిలిపోయాయని జల వనరులపై స్థాయీ సంఘం పేర్కొంది. నిధుల పంపిణీ, ప్రాజెక్టు అమల్లో జాప్యాలే ఇందుకు కారణమని పేర్కొంది. సాధారణంగా వర్షాకాలం తర్వాత వ్యయం అనూహ్యంగా పెరుగుతుందని, తక్కువ ఖర్చు పెట్టడానికి ఇదికూడా కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 3వేల కోట్ల రూపాయిల మేరకు ప్రతిపాదనలు పరిశీలన నిమిత్తం పెండింగ్‌లో వున్నాయని కమిటీకి హామీ ఇచ్చింది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలో కీలకమైన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో గణనీయమైన పెరుగుదల వుందని నివేదిక పేర్కొంది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుతో సహా కొన్ని ప్రాజెక్టులకు కేటాయింపులు పెరగగా, నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పి)కు ఏకంగా 98శాతం కేటాయింపులుతగ్గాయని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు 2025-26 సంవత్సరానికి రూ.5,936కోట్లు కేటాయింపులు అందాయి. గతేడాది ఈ మొత్తం రూ.5,512.50కోట్లుగా వున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టం, 2024 కింద పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. దీన్ని 2026 మార్చినాటికి పూర్తిచేయాలని భావిస్తున్నారు.

స్పీకరంటే గౌరవముంది..

- మాజీ మంత్రి తలసాని
- కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్ :వేముల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్పీకరంటే తమకు గౌరవముందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ సభలో ప్రతిసారి జగదీశ్వర్ రెడ్డిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ సభ ఎవరి సొంతం కాదని చెప్పారు. అలా అనడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతలే దళితుడు, దళితుడు అని స్పీకర్‌ను అవమనపరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కి ఛాంబర్ లేకుండా అవమానపరిచారని తెలిపారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావును కోరుకుంటూ సీఎం మాట్లాడటం సబబు కాదన్నారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి కాంగ్రెస్ నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. సభలో అందరూ సమానమే అంటే తప్పా అని ప్రశ్నించారు. బుధవారం ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలను పక్కదారి పట్టించేందుకు స్పీకర్‌ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటివరకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారా? అని అడిగితే డైవర్షన్ చేస్తున్నారని చెప్పారు. మీడియా పాయింట్‌లో కూడా తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి :అడ్లూరి

సభలో స్పీకర్‌ను అవహేళన చేసినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి జగదీశ్వర్‌రెడ్డిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆనాడు శాసనసభలో దళిత వర్గానికి చెందిన సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. అదే సామాజిక తరగతి నుంచి స్పీకర్‌గా ఉన్నారు కాబట్టే కేసీఆర్ ఏడాది కాలంగా సభకు రావటం లేదని చెప్పారు. దళితవర్గాన్ని తక్కువచేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్టేచర్‌గురించి ముందు మాట్లాడింది కేటీఆరేనని గుర్తు చేశారు. సీఎం పదవి కంటే మించిన స్టేచర్ ఇంకేముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఒకే కుటుంబంలో నలుగురు పదవులు పొంది వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పదేండ్లు పందికొక్కుల్లాగా రాష్ట్రాన్ని దోచుకుని ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్వనీ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు నిండు సభలో కాలేజి విద్యార్థుల్లా ప్రవర్తిస్తున్నారనీ, వీరిని చూసి కొత్త శాసన సభ్యులు ఏం నేర్చుకోవాలని ప్రశ్నించారు. అబద్దాలు ఎలా చెప్పాలో బీఆర్ఎస్ వాళ్లను చూసి నేర్చుకోవచ్చని ఎద్దేవా చేశారు. నాడు కేసీఆర్ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని ఎందుకు మాట తప్పారో చెప్పాలని ప్రశ్నించారు. జగదీశ్‌రెడ్డిని సభనుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు.. :గంగుల

మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదన్నారు. ఆయన కేసీఆర్‌ను మాజీ ముఖ్యమంత్రి లాగానే చూస్తున్నడనీ, తాము మాత్రం తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిగా చూస్తున్నామన్నారు. అలాంటి వ్యక్తిని చావాలని కోరుకుంటావా? అని ప్రశ్నించారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత 15 నెల్లుగా రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష అభ్యంతరకరంగా ఉందని విమర్శించారు. ఆయన బాష మార్చుకోవాలన్నారు. కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే కేపీ వివేకానంద,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సర్కార్ తీరు పై మండిపడ్డారు.

అవి భూదాన బోర్డు భూములే

నవతెలంగాణ-హైదరాబాద్

మహేశ్వరం మండలం నాగారంలోని 50 ఎకరాల భూమి భూదాన బోర్డుదేనని రాష్ట్ర సర్కార్ హైకోర్టుకు తెలిపింది. సర్వే నెం.181, 182లోని దాదాపు 50 ఎకరాల భూమిపై ఆ బోర్డు విచారణ పూర్తి చేసిన వివరాలు ఇచ్చేందుకు రెండు వారాల సమయం కావాలంటూ భూదాన్‌బోర్డు కాంపిటెంట్ అథారిటీ ఆఫీసర్ హోదాలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ కౌంటర్ పిటిషన్ వేశారు. సర్వే నెంబరు 182లో 10 ఎకరాలు ఖాదర్ ఉన్నీసాకు చెందినదంటూ నాటి కలెక్టర్ అమోయ్‌కుమార్, డీఆర్‌వో జ్యోతి తేల్చడంపై వాళ్లపై చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదును ఖాతరు చేయలేదంటూ నవాబ్ ఫరూఖ్‌ఖాన్ పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి సమగ్ర నివేదిక ఇవ్వాలని గతంలో ఆదేశించారు. భూదాన్ బోర్డు భూములకు సంబంధించి సింగిల్ జడ్జి ఉత్తర్వులపై కొందరు లబ్ధిదారులు అప్పీల్ పిటిషన్ వేశారు. వీటిని యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

యావజ్జీవ శిక్ష రద్దు

ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో 2014 ఫిబ్రవరి 20న కార్తీక్ హత్య కేసులో జిల్లా కోర్టు షంషేర్ ఖాన్‌కు విధించిన యావజ్జీవ శిక్షను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ కె సురేందర్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన వివరాలకు పొంతన లేదన్నారు. సాక్షుల వాంగ్మూలాలు సందేశాలను రేకెత్తిస్తున్నాయని చెప్పారు. పలు సందేహాస్పదంగా ఉన్నందున కింది కోర్టు విధించిన యావజ్జీవశిక్షను రద్దు చేస్తూ తీర్పు ప్రకటించారు.

బంగారం విడుదలకు హైకోర్టు నిరాకరణ

అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ 2011లో సీబీఐ కేసు దర్యాప్తులో భాగంగా గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమారుడు, కుమార్తెల బంగారాన్ని సీజ్ నుంచి విడుదలకు హైకోర్టు నిరాకరించింది. సుమారు 58 కిలోల బంగారు నగలు, బాండ్లు, క్యాష్ రిలీజ్ చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమార్తె బ్రాహ్మణి, కొడుకు కిరిటీరెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ కొట్టేస్తూ తీర్పు చెప్పారు. సీబీఐ కేసు విచారణలో ఉన్నందున జప్తు చేసిన వాటిని విడుదలకు ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు.

కేటీఆర్‌పై ఎన్నికల కేసు కొట్టివేత

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ఎం.గోపాల్‌లకు ఊరట లభించింది. ముషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసింది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా బాణసంచా కాల్చడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆనాటి ఎస్ఐ ప్రేమ్ కుమార్ ఫిర్యాదు మేరకు వాళ్లిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. వీటిని కొట్టేయాలంటూ వాళ్లు వేసిన పిటిషన్లను అనుమతిస్తూ జస్టిస్ లక్ష్మణ్ తీర్పు చెప్పారు.

మేడిగడ్డ సందర్శనకు అనుమతి అవసరమా? : ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించడానికి అనుమతులు అవసరమా? అని రాష్ట్రాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అనుమతి ఇవ్వాలంటే దానికి చెందిన నిబంధనలను తెలియజేయాలని ఆదేశించింది. అధికారిక రహస్యాల చట్టం కింద ఒక ప్రాంతాన్ని నిషేధిత జాబితాగా ప్రకటించాలంటే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాల్సింటుందని గుర్తు చేసింది. మేడిగడ్డకు సంబంధించి కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను అందజేయాలంది. ఈ కేసులో నమోదు చేసిన 8 మంది సాక్షుల వాంగ్మూలాలను సమర్పించాలంది. విచారణను 18కి వాయిదా వేసింది. మేడిగడ్డ సందర్శన సందర్భంగా అనుమతుల్లేకుండా డ్రోన్ వినియోగించారంటూ గత ఏడాది జులై 29న మహదేవపూర్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్, గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్కసుమన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. పిటిషనర్ లాయర్ వాదిస్తూ, కేసు నమోదు చేయడంలో జరిగిన జాప్యానికి కారణం చెప్పలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీని కేటీఆర్ ఇతర బీఆర్ఎస్ నేతలు సందర్శించారంటూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వలీషేక్ ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు అయ్యిందన్నారు. అధికారిక రహస్యాల చట్టం కింద నిషేధిత ప్రాంతంగా ప్రభుత్వం చెబుతోందనీ, ఇలా నిషేధిత జాబితా ప్రాంతమైతే కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వాల్సివుందన్నారు.. మేడిగడ్డ రిజర్వాయరులో తగినంత నీరు ఉన్నప్పటికీ విడుదల చేయకపోవడంపై కేటీఆర్ తదితరులు సందర్శించారనీ, ఇదేమీ నేరం కాదని చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ మేడిగడ్డ జాతీయ భద్రతా అంశాల పరిధిలోకి వస్తుందనీ, దీనికి సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 8 మంది సాక్షుల వాంగ్మూలాలున్నాయని తెలిపారు. అక్కడ ఉన్న సిబ్బందిని నెట్టుకుంటూ, వారి విధులకు భంగం కలిగిస్తూ మేడిగడ్డను సందర్శించారన్నారు. అంతేగాకుండా అధికారిక రహస్యాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్‌తో చిత్రీకరించారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి కేంద్రం నోటిఫికేషన్ కాపీ అందుబాటులో లేకపోవడంతో నోటిఫికేషన్ కాపీతోపాటు సాక్షుల వాంగ్మూలాలను పిటిషనర్ తరపు న్యాయవాదికి, కోర్టుకు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు.

బీపీ ఆచార్య ప్రాసిక్యూషన్‌కు అనుమతి వివరాలివ్వండి : ఈడీకి హైకోర్టు ఆదేశం

జగన్ కేసుల్లో భాగంగా లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు భూకేటాయింపులకు సంబంధించి నమోదు చేసిన కేసులో అప్పటి ఐఏఎస్ అధికారి, ఏపీఐఐసీ వైస్‌చైర్మెన్, ఎండీ బి.పి.ఆచార్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరుకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని హైకోర్టు ఆదేశించింది. హెటిరో కేసులో బి.పి.ఆచార్యకు, ఇండియా సిమెంట్స్ కేసులో ఆదిత్యనాథ్‌దాస్‌కు అనుమతులు ఉన్నాయో లేవో చెప్పాలంది. విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. లేపాక్షి వ్యవహారంలో ఈడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ బీపీ ఆచార్య వేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 197 కింద ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరంటూ ఇండియా సిమెంట్స్‌లో మాజీ ఐఏఎస్ ఆదిత్యనాథ్‌దాస్‌పై కేసును ఇదే హైకోర్టు కొట్టేసిందని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. దీనిని సుప్రీం కోర్టు ఆమోదించిందన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, సుప్రీం కోర్టు ఉత్తర్వుల అనంతరం ఈ కేసుల్లో అనుమతులు మంజూరయ్యాయో లేదో చెప్పాలంది. విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో ఇందూ టెక్ జోన్ కేసులో సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ బి.పి.ఆచార్య దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది.

డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిల నియామకం వివక్షాపూరితం

జీవో 75 అమలును నిలిపివేత

డీసీఎంఎస్‌ల (జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలు) పాలక వర్గాల పదవీ కాలం గడువు ముగియడంతో ఆ స్థానంలో పర్సన్ ఇన్ ఛార్జిల నియామకం చేపడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివక్షాపూరితమని బుధవారం హైకోర్టు పేర్కొంది. పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 75 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా కొనసాగించాలని ఆదేశించింది. డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిలుగా అదనపు కలెక్టర్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 14న జారీ చేసిన జీవో 75, అదనపు కలెక్టర్లను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఉమ్మడి జిల్లాలకు చెందిన ఖమ్మం మినహా మిగిలిన 8 జిల్లాల డీసీఎంఎస్ డైరెక్టర్లు హైకోర్టులో వేర్వేరుగా 8 పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్.హేమేంద్రనాథ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు డీసీఎంఎస్ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారన్నారు. ఇందులో కొందరు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ల ఎంపిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ల ఆధారంగా ఉంటుందని, డీసీఎంఎస్‌లో 6 డైరెక్టర్ పోస్టులు పీఏసీఎస్‌ల ప్రతినిధులకు కేటాయిస్తారన్నారు. అయితే డీసీఎంఎస్ డైరెక్టర్ల పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుందని తెలిపారు. చట్టప్రకారం మేనేజింగ్ కమిటీ పదవీ కాలం ముగియకముందే ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత సహకార శాఖ ఎన్నికల సంఘంపై ఉందన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ల పదవీ కాలం ముగుస్తుండగా ఎన్నికలు నిర్వహించడానికి బదులు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 14న జీవో 75 జారీ చేసిందన్నారు. డీసీసీబీ, పీఏసీఎస్, టీజీసీఏబీల పదవీ కాలం ముగిసినప్పటికీ అదే రోజు ముగిసినప్పటికీ డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వం జీవో 74 జారీ చేసిందని, అయితే డీసీఎంఎస్‌లకు మాత్రం అదనపు కలెక్టర్లను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించడం వివక్షాపూరితమన్నారు. ప్రభుత్వ న్యాయవాది బి.మోహనారెడ్డి వాదనలు వినిపిస్తూ డీసీఎంఎస్‌ల పదవీ కాలం ముగియడంతో సహకార శాఖ రాసిన లేఖ ఆధారంగా పర్సన్ ఇన్‌ఛార్జిలను ప్రభుత్వం నియమించిందన్నారు. ఇలా నియమించే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. డీసీసీబీలతో పోల్చడం సరికాదని, అది బ్యాంకింగ్ నియంత్రణ చట్టం కింద పనిచేస్తుందన్నారు. పీఏసీఎస్‌ల పునర్‌వ్యవస్థీకరణ చేయాల్సిన నేపథ్యంలో డీసీఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకావడంలేదన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ప్రభుత్వ నిర్ణయం వివక్షాపూరితమైనదని పేర్కొన్నారు. పీఏసీఎస్, డీసీసీబీలు, డీసీఎంఎస్, టీజీసీఏబీల పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగిసిందని, ఫిబ్రవరి 2న సహకార శాఖ కమిషనర్ రాసిన లేఖ ఆధారంగా ప్రభుత్వం ఫిబ్రవరి 14న రెండు జీవోలను జారీ చేసిందన్నారు. పీఏసీఎస్, డీసీసీబీ, టీజీసీఏబీలకు కొనసాగుతున్న పాలకవర్గం కమిటీనే పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీగా నియమిస్తూ జీవో 74 జారీ చేయగా, డీసీఎంఎస్‌లకు మాత్రం అదనపు కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ జీవో 75 జారీ చేసిందన్నారు. రెండు జీవోలు ఒకే లేఖ ఆధారంగా జారీ అయినప్పటికీ డీసీఎంఎస్‌ల విషయంలో భిన్నమైన నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి కారణాలను పేర్కొనకపోవడం సరికాదన్నారు. ప్రాథమిక ఆధారాలు పరిశీలిస్తే డీసీఎంఎస్‌ల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ జారీ చేసిన జీవో 75 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్, డీసీసీబీల వలె డీసీఎంఎస్ పాత డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ రాజశేఖర్‌కు హైకోర్టు బెయిలు

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో 13వ నిందితుడైన డాక్టర్ పెరుమాళ్ల రాజశేఖర్‌కు బుధవారం హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత హామీతోపాటు అంతే మొత్తానిక మరో రెండు పూచీకత్తులు సమర్పించాలని, ప్రతి నెలా 11వ తేదీ సంబంధిత పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశించింది. అభియోగ పత్రం దాఖలు చేసేదాకా లేదంటే మూడు నెలలపాటు హాజరుకావాలని, విచారణకు సహకరించాలని సాక్షులను ప్రభావితం చేయడానికి, సాక్ష్యాలను తారుమారు చేయడానికి ప్రయత్నించరాదని షరతులు విధించింది. హైదరాబాద్ సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో అనుమతి లేకుండా తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళల నుంచి రూ.55 లక్షలు చెల్లించి కిడ్నీలు తీసుకున్నారంటూ నమోదైన కేసులో నిందితుడైన డాక్టర్ పెరుమాళ్ల రాజశేఖర్ దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టి ఈమేరకు ఉత్తర్వులు వెలువరించారు.